

ఆంధ్రసచిత్రవారపత్రిక



30-6-72

50 పైసలు



రైతు సోదరులారా!
అధిక పంట!
అధిక లాభం!

అత్యధికమైన పోషక పదార్థాలు తగు పాళ్లతో, ఆదా చేకూర్చేలా సరిక్రొత్త గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14

అన్ని పైరులకు అనువైనది. ఎరువు నిమిత్తం చేసే ప్రతి రూపాయి ఖర్చుకు అధికంగా పోషక పదార్థాలను అందించేది. చిన్న చిన్న గుళ్లగావుండి పొలంలో చల్లటానికి బహు వీలుగా వుండేది. రవాణా, నిల్వల విషయంలో ఆదా చేకూర్చేది.

లాభసాటి గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14

భాస్వరామ్లం ఎక్కువగా అవసరమైన, వేరుశెనగ వంటి పైరులు, మిర్చి, పొగాకు బంగాళదుంప, కొన్ని దేశవాళీ వరి రకములు, ప్రత్తి మరియు చమురు గింజల పైరులకు సాటిలేని మేటి ఎరువు ఈ క్రొత్త గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14!

ఇతర వివరములకు
మీకు దగ్గరలోనున్న కోరమాండల్/
ఫ్యాక్టరీ ప్రతినిధులను సంప్రదించండి.

coromandel gromor

కోరమాండల్ ఫెర్టిలైజర్స్
లిమిటెడ్
126, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-3

చేనుకు
చేవ,
రైతుకు
రొఖ్ఖం —
గ్రోమోర్

AIYARS-CF. 369 TL



VIJAYA

శ్రీ గణేశ చిత్రాలయ

శాంతినిలయం

కథ, స్క్రీన్‌ప్లే, సమర్పణ, దర్శకత్వం:
సి. వైకుంఠరామశర్మ B.A.

ఆంధ్ర:
శ్రీ లక్ష్మీనారాయణ పిక్చర్స్

సీడెడ్: బలరాం పిక్చర్స్, నైజాం: శ్రీ కనకదుర్గా పిక్చర్స్, కృష్ణా, విశాఖ, శ్రీకాకుళం: R.K. మూవీస్, తూర్పుగోదావరి: శ్రీ లక్ష్మీగణపతి పిక్చర్స్.

ఉత్తరాలు

వ్యాసాలు

విప్రుల్ని చెప్పేందే వేదం అన్నట్టు ఈ కాలంలో ఇందిరమ్మ చెప్పిందే అభ్యుదయం అవుతుంది. ఆమెకు ప్రతిపక్షంలో మాట్లాడిన సోషలిస్టులు కూడా పాపం జనంచేత అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేయబడ్డారు, పడుతున్నారు. కుటుంబానికి కనీసం 30 యొకరాలైనా మంచి భూమి ఉండాలన్న మల్లాది సూరిబాబు మాట చాలా సబబుగా ఉంది. 10, 18 యెకరాలుగా భూమిని విభజించి యెద్దర్లైన వాడి చేతుల్లో పెడితే నాగలుంటే యెద్దుండదు యెద్దుంటే బుద్దుండదు ఇంతకన్న రష్యాలా సమిష్టి క్షేత్రాలు నడవడం ఉభయత్రా క్షేమకరం.

వేముల ప్రభాకరుడు (రాయికల్)

* * *

మా ప్రముఖ చిత్రకారుడయిన 'రామారావు' గారి జీవితంలోని ముఖ్యమయిన విశేషాలు ప్రచురించినందుకు మా కెంతో సంతోషము కలిగింది.

కె. వైజయంతి (లచ్చపేట)

* * *

2—6—72 పత్రికలో ప్రచురించిన 'భూకమతాల— పరిమితి చట్టం' మల్లాది సూరిబాబు గారి వ్యాసం చదివాను. అది చదివాక ఇది వ్రాయాలని ఆలోచన వచ్చింది.

మల్లాది సూరిబాబుగారు బహుశ భూస్వాములు అయ్యి వుంటారు. అందుకే తమబాధను ఇలాగ వ్యక్తం చేశారు.

వారే వ్రాసిన ఒక శాస్త్రవేత్త వాక్కులు 'రైతు అప్పులోనే పుట్టి అప్పుల్లో పెరిగి అప్పుల్లోనే చస్తాడు.' అన్నవి ముమ్మాటికి నిజం. కాని ఈ విషయంపై కొంచెం ఆలోచించవల్సి వుంది.

అసలు మన వాడుక పదం రైతు (ఫార్మర్) అంటే అర్థం ఏమిటి. తన పొలం దున్ని దానిపై ఆధారపడివుండి వ్యవసాయమే తన ముఖ్యవృత్తిగా కల్గినవాడు ఫార్మర్ లేక రైతు అనబడతాడు.

కాని ఇప్పుడు రైతు, (ఫార్మర్) అర్థము వేరు. వ్యవసాయం చేయక, కేవలం కొన్ని వందల ఎకరాల భూములకు యజమాని అయ్యి, భూముల్ని రైతులతో (కూలీలపై) పనుల చేయించి వచ్చిన లాభాన్ని జేబులో పెట్టుకోవడం, అంతేకాదు వేరేవేరే పెద్దపెద్ద వ్యాపకాలు కల్గియున్నారు ఈ నాటి మన ఫార్మర్స్. ఫార్మర్ అనేవంతుకన్న 'లాండ్‌లార్డ్' అంటే నాటికి మారుపేర్లు సబబుగా వుంటుంది.

పై కోవకు చెందినవారు మన ప్రముఖ ప్రజానాయకులు, సంఘసేవకులు, ప్రజాశ్రేయస్సునే అభిలషించేవారు ఎందరో వున్నారు. ఉదా:— మన మాజీమంత్రి తిమ్మారెడ్డిగారి అధ్వర్యంలో వెలిసిన ఫార్మర్స్ 'అసోసియేషన్ ఇలాంటిదే:

సూరిబాబు గారు అన్నట్టు రైతు అప్పుల్లో పుట్టటం పెరగటం, చావటం పరిస్థితి మెరుగు పడాలంటే ఈ స్వార్థపరులైన భూస్వాములు తొలగాలి. దానికి ఈ చట్టం ఎంతో అవసరం ఈ భూస్వాములు రైతులా అన్నబేధము వుండరాదు. రైతుయొక్క దీన స్థితికి కొంతవరకు భూస్వాములు వ్యాపారస్తులు మరియు ప్రభుత్వం బాధ్యులు అనటంలో అనుమానం లేదు.

'వ్యవసాయ రంగాన్ని రాజకీయ ప్రచారానికి ఒక పందెపు పావుగా వినియోగించటం' అన్నవాక్యం ఏమాత్రం సబబుగా లేదు. అది ప్రస్తుత భూస్వాన్ని వుద్దేశించి అన్నట్టుంది సూరిబాబుగార్కు దీనిని మాత్రం ఎవ్వరూ ఒప్పుకోరు.

పరిమితి గూర్చి చర్చించారు. సూరిబాబుగారు తమ 11వ పేరాలో. ఆహార వుత్పత్తికి మరియు భూకమతాల పరిమితి చట్టంకు గల సంబంధము ఏమిటి? ఒక్కొక్క వ్యక్తికి వందల ఎకరాలు భూమి వుండడం వలన, సాగుచేయజాలక ఎంతో భూమి బంజరుగా మారినపైనాలు చూస్తున్నాము. ఇది దేశంకు తీరని నష్టం కాదా! అంతేగాదు ఈ భూస్వాములు గర్వంతో పల్లెటూళ్లలో బీదలపై మరియు రైతులపై చేయించే ఆగడాలు చెప్ప నలవి కాదు. ప్రాణాలు తీయటానికైనా వెను దీయరు ఈ మహాశయులు.

'అన్నదాత' అంటే ఎవరు భూస్వామికాదు, రైతు అన్నదాత అవుతాడు. పదిమంది నోరుల్ని కొట్టి, పదిమంది కష్టఫలాన్ని తన జేబులో నింపుకునే భూస్వామిని పట్టుకుని అన్నదాత అనడం శోచనీయంగా వుంది. మనదేశంలో నిరుద్యోగానికి, పేదత్వానికి, ఈ భూస్వాములు కొంతవరకు కారణభూతులు. ఈ చట్టం ఎన్నో సమస్యలకు పరిష్కారం కాగలదు. రాబోయే ఆందోళన కేవలం తాత్కాలికమే. ఎంతోకాలం నిలువదు.

సూరిబాబు గారు పైవర్గం తోసహా పెగురు వ్యక్తులున్న కుటుంబానికి నెలకు కనీసం 1500—కావాలి అన్నారు. 1500— నెలాదాయము వున్న కుటుంబాలు భారతదేశంలో ఎన్ని వున్నాయో చెప్పుతారా సూరిబాబుగారు? వుద్యోగులలో ఎంతమందికి మూడువేలు జీతం వుంది. ఆలోచించడము మంచిది.

120 ఎకరాల పొలందాకా వుండటానికి అవకాశం యిస్తే మరి భూస్వామిత్వము ఎప్పుడు తొలగుతుంది. ఈ చట్టం వలన లాభం ఏమిటి?

ఈ చట్టం సమాజంలో సమానత్వమును పెంచుతుందే తప్ప నూతన పేదవర్గం సృష్టించదు. అంతేగాదు. భూస్వాముల మదాన్ని అణచుతుంది. ప్రజలందరికి పనిపాట చూపెడ్తుంది. అందరి జీవిత ప్రమాణాన్ని పెంచుతుంది. ధనిక, పేద వర్గాలను కొంతవరకు దగ్గర పరుస్తుంది. మరియు అధికారం దుర్వినియోగ పరచబడకుండా చూస్తుంది. దేశ వుత్పత్తిని పెరిగేటట్లు చేస్తుంది.

నిజానికి ఈ చట్టాన్ని ప్రవేశపెడుతున్న ఇందిరా ప్రభుత్వమును మెచ్చుకోవాలి. సర్వ మానవ సమానత్వానికి ఇది నాంది ప్రస్తావన కాగలదు.

రాచకొండ శ్రీధర్ (హైదరాబాద్)

* *


ఆంధ్రపత్రిక (9.6.72)లో అవంతి గారి వ్యాసం 'భూగరిష్ఠ పరిమితులకు సంబంధించినది' బాగుంది.

ఎస్. సత్యనారాయణ మూర్తి (రాజోలు)

* * *

మామూలు రకం కాఫీలపై విప్లవం జరపండి!

ఉచితం!



ప్రత్యేక బహుమానము:
ఉచితం! ప్రత్యేక బహుమానము
ప్రతి సీసాలోనూ (రెండు రూపాయల
విలువైన) వెండిపూత పూసిన
కాఫీ చెంచా లభిస్తుంది.

స్పెషల్‌కాఫీమాత్రమే కావాలనిఅడగండి

ప్రత్యేక శక్తి నిస్తుంది

ఇది చిక్కనైన సంతుష్టికరమైన కాఫి. దక్షిణాదిలోని కాఫీప్రియుల రుచికి అనుగుణ్యంగా ప్రత్యేకంగా తయారుచేయబడినది.


ప్రత్యేకమైన రంగు

చిక్కనైన మంచి కాఫీకి అర్ధ చెంచా పొడి చాలు. మీ కప్పులో నల్లని ఎక్కువ సంతృప్తి నిచ్చే కాఫీ తయారవుతుంది.

ప్రత్యేకమైన ప్యాకింగు

తాజాగా సువాసన రుచిపోకుండా భద్రపరచటానికి మనదేశంలో రికరి ప్రప్రథమంగా ముందడుగు వేసింది. తేలికగా తెరవగల ప్లాస్టిక్ మూతతో లోపల "సేఫ్టీ సీలు వున్న" రికరి లభ్యమవుతుంది. నేడు లభించే సీసాలన్నిటికన్న ఆధునికమైనది.

ధర
రూ. 2.87
ఇతర పన్నులు
అదనం.



కొత్తది! అధికస్ట్రాంగ్
రికరి®
ఇన్‌స్టెంట్

ఇది ప్రత్యేకమైనది! ఇది నెస్‌కాఫె వారుతయారు చేసినది

ముఖచిత్రం

వాణిశ్రీ ముఖచిత్రం నాకు ఆకర్షణీయంగా లేదు.

కొవ్వూరి రామానుజాచార్యులు (భీమవరం)

* *

16—6—1972 నాటి సంచిక ముఖచిత్రం కళ్ళు జిగేలు మనిపించేలా ఉంది. ఆ చిత్రాన్ని గంటసేపు దాకా అలాగే చూస్తూ ఉండిపోయామంటే నమ్మండి. లక్ష్మి ఛాయ చాల అందంగా కనిపించింది.

జి. జగన్ మోహన్ రెడ్డి, జి. మదన్ మోహన్, (హైదరాబాద్)

*

9.6.72 పత్రికలో వాణిశ్రీ ముఖచిత్రం మాకు చాలా నచ్చింది.

భాగవతుల రమణారావు (కోరాపుట్టి)

పిల్లలు—ఆరోగ్యము

వాణిశ్రీ ముఖ చిత్రముతో వెలువడిన 9.6.72 వార పత్రిక చాలా బాగుంది. పిల్లల ఆరోగ్యమును గురించి అమూల్యమైన సలహాలనిస్తున్న డాక్టర్ కె. వెంకటేశ్వరరావుగారికి కృతజ్ఞతలు. 'సెంకన్నాస్ కోల్డ్' సీరియల్ బొమ్మలకథ చాలా ఇంటరెస్టింగ్‌గా మొదలయింది.

కంభంపాటి మాధవరావు (జాండ్రపేట)

* * *

16—6—72 తేదీ 'పత్రిక' లక్ష్మీఛాయ ముఖచిత్రముతో లక్షణముగా ఉన్నది.

చీకటి జనార్దనరావు (కందుకూరు)

కథలు

చాలరోజుల తరువాత ఉన్నవ విజయలక్ష్మిగారి కథ, మాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. మొదటి భాగం చాల బావుంది. తరువాత ఏమవుతుందా అని ఆత్రుతగా వున్నది. ఇదే సీరియల్ అయితే, ఇంకా బాగుండును.

గురజాడ సరస్వతీజోగారావు (హైదరాబాద్)

* * *

రఘురామంగారు వ్రాసిన 'రైల్లో వాళ్ళు ముగ్గురూ' అనేకథ చాలా సస్పెన్స్‌లో నడిచింది. మొదట కృష్ణ పాలికేళ్ళ వాడనుకున్నాం. కాని చివరవరకు చదివేక ఇంటర్ని పాది నవ్వుకున్నాం.

టి. యస్. శశికుమార్ తదితరులు (గురుజాల)

* * *

ఉయలక్ష్మి రచించిన 'తీయని కలలూ — తీరని వెతలూ' నవ్వెంతో ఆకర్షించింది. ఇది ఈవారం హై లైట్.

ఎస్. సాయిబాబు (ప్రొద్దుటూరు)

సీరియల్

'రాగధార' సీరియల్ చాల బాగుంది. ఇందులో అనురాధ మాధవరావుల పాత్రలు చాల బాగున్నాయి. 'నాలుగుమంచాలు' సీరియల్ కూడ చాల బాగుంది. ఇందులో సూర్యం చేస్తున్న త్యాగాలు చదువుతుంటే చాల బాధ కల్గుతుంది. ఇందులో ఇంకా శ్రీనివాస్, శెట్టి గారి పాత్రలు కూడ చాల బాగున్నాయి. ఇటువంటి సీరియల్స్ వ్రాసిన విమలా రామంగార్కి మరియు బలివాడ కాంతారావుగార్కి నాహృదయ పూర్వక కృతజ్ఞతలు.

పి. సలీమా ఖాతూన్ (మహబూబ్‌నగర్)

సినిమా

16—6—72 సంచిక ఉత్తరాల శీర్షికలో మిత్రులు పి. బి. సుందర్ రెడ్డి, లలిత (విజయవాడ) గార్లు కృష్ణ తెలుగు చలనచిత్ర పరిశ్రమకే వెన్నెముకవంటి వాడు అని వ్రాసారు. మాకు చాలా బాధ అనిపించింది. విదేశాలలో షూటింగ్ జరిపినంత మాత్రాన వెన్నెముకవంటి వాడు కాలేడు.

కె. రాణి, విజయ (గుంటూరు)

ఉత్తరాలు

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 30-6-72
(శ్రీవిరోధికృన్నామ సం॥ జ్యేష్ఠ మాస॥ బహుళ చవితి)

సంపుటము: 60 సంచిక: 45

స్థాపితము:
1908

ఆక్టింగ్ ఎడిటరు:
ఎస్. రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు - 1

విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక


ప్రజలని మాయ చెయ్యడం
భూవసతిలేని ప్రజలు
భూమిలేని వారికి భూములు
పట్టణ ఆస్తుల పరిమితి భయంవల్ల వాళ్ళు ఇళ్లు కట్టడం మానేశారు
పార్టీలు మార్చేవారు నశించాలి!
పార్టీ మార్పిడిదారు
కాలుష్యం
ఏయ్! వాతావరణాన్ని కలుషితం చెయ్యకు!
అభివృద్ధి చెందని దేశాలు
అభివృద్ధి సాధించిన దేశాలు

వారపత్రిక – శ్రీ శంభుప్రసాద్

దినపత్రికలు నడపటంకంటె వారపత్రికను, వారపత్రికను నడపటంకంటె మాసపత్రికను కూర్చడం కష్టమని ఈ పత్రికలని చదివే ఎవరికైనా అనిపిస్తుంది. ఎందుచేతనంటే దినపత్రికలో వార్తలు, మార్కెట్లు, రేడియో, క్రీడారంగం ఇంకా వేస్తే దినఫలాలు, వారఫలాలు యిటువంటివన్నీ ఉండి ఆ పత్రికని తేలిగ్గా ఇయ్యవచ్చుని అనిపిస్తుంది. వార్తలలో విదేశీవార్తలు, దేశవార్తలు, రాష్ట్ర వార్తలు యిలా బహురకాలుగా ఉంటాయి. అంతేగాక ఒక్కరోజు, ఏరోజు పత్రిక ఆరోజు చదివేసేస్తే పాఠకుడికి తృప్తి కలుగుతుంది.

వారపత్రికల విషయం అలా కాదు. వారం రోజులు సరిపడగా ఇదిగో ఇందులో యిది చదివామని మనస్సుకి బాగాపట్టి మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే విధంగా వాటిని నిభాయించుకోవల్సి ఉంటుంది. వారపత్రికలలో కూడా అనేకరకాల వ్యాసాలు, కథలు, మొదలైన శీర్షికలు అనేకం ఉంటాయి. కానీ యిక్కడ విషయం ఏమిటంటే వారం రోజులపాటు పాఠకులని నిర్భరులనిచేసే విధంగా కొత్తకొత్త విషయాలతో పత్రికను యివ్వవలసి ఉంటుంది. పత్రికలు చదివే సామాన్యుడికి కూడా కనిపిస్తూనే ఉంటుంది.

మాసపత్రికల విషయంలో చూసామంటే వానియొక్క సంఖ్యనిబట్టే వాటిని నిభాయించుకు రావడం కష్టమని అనిపిస్తుంది. ఈ మాసపత్రికలలో బాగా బరువైన విషయాలని గురించి వ్యాసాలు పడుతూ ఉంటాయి. సామాన్యులకు అవి నిజంగానే బరువుగానే ఉంటాయి.

మరి ఒకనెల అంతా విషయం పాఠకుల మనస్సుల్లో ఉంటూఉండి ఆ తర్వాత కూడా వాటియొక్క ప్రాముఖ్యం నిలిచి ఉండే విధంగా ఈ మాసపత్రికలని తయారు చెయ్యవలసి ఉంటుంది.

ఈ మూడురకాల పత్రికలని – ఆతర్వా

ఒక సామాన్య పాఠకుడి దృష్టికి ఏమి అనిపిస్తూందో ఆ విషయాలనే ఇక్కడ చెబుతున్నాను.

చాలాకాలంగా నాకు పత్రికలు చదవటం అలవాటైపోయింది. ముందు వారపత్రికతోనే పత్రికలు చదవడం ప్రారంభించాను.

అప్పటికి నేను యింకా చిన్నవాడిని. స్కూల్‌ఫైనలుగావల్ను చదువుతున్నా. ఆరోజుల్లో ఆంధ్రసచిత్రవారపత్రికలో 'వేయి పడగలు' నవల పడుతూ ఉండేది. మంచి ఆసక్తిజనకంగా ఆ నవలలో కథ నడవడం చేత, ఆ నవలకోసమే నేను ఆ రోజుల్లో వారపత్రిక కొనేవాడిని. చాలాచోట్ల కొనేవారు. కొన్నిచోట్ల పత్రికలకి ఎగబడటం కూడా ఆ రోజుల్లో నేను చూశాను. పత్రిక చదవడం మొదలెడితే తలకట్టు దగ్గర్నించి చివరి పేజీవరకూ చదవటం నాకు అలవాటు గనక ఎడిటొరియల్, ప్రింటెడ్ మొదలైనవికూడా అలవాటైపోయింది.

ఆ రోజుల్లో శ్రీ శంభుప్రసాద్‌గారు వారపత్రికకి సంపాదకులని ఆ చదవటంలో తెలుసుకున్నాను. ఆ రోజుల్లో వారపత్రికలో ప్రతి బుధవారం నాటి సంపాదకీయం సంపాదకీయంగా వేసేవారు. 'వేయి పడగలు' నవలకి ఒక శివలింగము, దానిపైన నీడ పట్టేవట్టు వేయిపడగలతో ఒక మహా సర్పం తన ఫణామండలాన్ని విచ్చుకుని గొడుగుపడుతున్నదా? అన్నట్లు ఉండేది. నేను నిజంగా ఆటువంటి శివలింగం దేశంలో ఎక్కడో ఉంది, దాని బొమ్మ సంపాదించి వేశారు అని అనుకుంటూ ఉండేవాడిని. కానీ తరవాత ఎవరితోనో మాటాడుతుంటే ఈ విషయం వచ్చింది. ఆ మాట్లాడుతున్న ఆయన — ఆ బొమ్మ ఒక పువ్వుబొమ్మ; దాన్ని నాగపుష్పం అంటారు అని చెప్పాడు. అప్పుడు అనుకున్నాను — పత్రికలలో ఎంతెంత చమత్కారాలు చేస్తారయ్యా అని.

నేను యింకొంచెం పెద్దవాణ్ని అయిన తర్వాత క్రాబికలోని పాతపత్రికలన్నీ చదవటం అలవాటు అయి ఇతర పత్రికలు కూడా యిట్లాగే చమత్కారాలు చేస్తాయా అని పరిశీలించాను. ఇటువంటివేమీ అక్కడ లేవు. అప్పుడు ఆంధ్ర వారపత్రికలోనే ఈ రకమైన చమత్కారం ప్రారంభం చెయ్యబడిందని నాకున్న అప్పటి కొన్ని జ్ఞానానికి అనిపించింది.

ఆ తర్వాత ఆంధ్ర సచిత్రవారపత్రికలోనే చెలియలికట్ట మొదలైన నవలలుకూడా చదివాను. ఇట్లా చాలా నవలలు వారపత్రికలోపడ్డాయి. ఈరోజున ఆంధ్రసాహిత్యంలో ఆ నవలలన్నీ ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకుని ఉన్నాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'వడ్లగింజలు', 'ఆత్మబలి' మొదలైన నవలలు కూడా వారపత్రికలోనే చదివాను. అప్పుడు నవలలు చదవటం, సంతోషించడమే కానీ, ఆ నవలలు సంపాదించడానికి, ప్రచురించడానికి సంపాదకులు పడే కష్టాలు, అవీ అంతగా తెలియవు. తర్వాత తర్వాత కొంతమంది కొంతమంది పత్రికా సంపాదకులతో పరిచయభాగ్యం కలగటంచేత ఈ పని అంతా కూడా చాలా కష్టంతో కూడుకున్న విషయమని తెలుస్తూవచ్చింది.

ఇంతకీ చెప్పవచ్చేదేమంటె యిప్పుడు ఆ వారపత్రికకు అప్పుడు సంపాదకత్వం వహించి ఉన్న శ్రీ శంభుప్రసాద్‌గారు శివసాయుజ్యం చెందటం వినగా అప్పటి వారపత్రిక, అవి అన్నీ తలపుకు వచ్చాయి. అవే యిక్కడ రాస్తున్నాను.

ఆ రోజుల్లో వారపత్రిక యిప్పటి వారపత్రికకంటే పొడుగు, వెడల్పు ఎక్కువగా ఉండేది. దినపత్రిక అడ్డంగా సగానికి మడిస్తే ఎట్లా ఉంటుందో అంత ఉండేది. అట్టమీద పెద్ద బొమ్మ ఉండేది. వారానికి ఒక విధమైన బొమ్మ. ఒకసారి పెద్ద బాతుల బొమ్మలు వేశారు. బొమ్మలో చూస్తే అవి నిజంగా హంసలులాగా ఉన్నాయి. ఇన్ని రకాల చమత్కారాలు అదివరకు తెలుగు పత్రికలలో లేనివి ఉండేవి?

ఈ రకమైన చమత్కారాల్ని కూడా తెలుగుదేశపు పత్రికా ప్రపంచంలో శ్రీ శంభుప్రసాద్‌గారే ప్రవేశపెట్టారని నేను యిప్పటికీ అనుకుంటూనే ఉన్నాను. వారపత్రిక లోపల కూడా ముచ్చటైన బొమ్మలు వేసేవారు. ఆ బొమ్మలు ఎంతో బాగుండేవి. నాకు బాగా నచ్చి యిప్పటికీ జ్ఞాపకం ఉన్న కొన్ని బొమ్మల సంగతి చెబుతాను. ప్రతిదేశంలోనూ అనేకరకాల వృత్తుల వాళ్ళు ఉంటారు. ఉద్యోగాలు అవీ చేసే వాళ్ళ విషయం కాదు. కోతుల్ని ఆడించి, రోడ్డు పక్కన జాతకాలు చెప్పి, గారడీలు ఆడి, యిట్లా అనేకరకాల వృత్తులని అవలంబించి, అకించనులు అలవోకగా జీవితాలని గడిపివేసే సందర్భాలు ఉంటాయి. 'బ్రతుకుతెరువుకు మార్గాలు' అని శీర్షిక పెట్టి ఏమో వానిని ఛాయాచిత్రాల వృత్తంగా కొంతకాలం నడిపించారు. దేశంలో వైవిధ్యం ఎంతగా ఉంది? జనం ఏ విధంగా బ్రతుకుపోరాటం సాగిస్తున్నారు అన్న విషయాలు మనం రోజూ చూచేవే. అయినా బొమ్మలలో చూసినప్పుడు అదొక విచిత్రమైన విషాదము, ఒక విచిత్రమైన సంతోషము కూడా కలుగుతూ ఉండేవి. వాస్తవాన్ని చూట్టం మనం మనల్ని చూసుకోడంలాగే ఉంటుంది. ఏమీ కొత్తగా ఉండదు. దానినే ఏ బొమ్మలోనో, ఛాయాచిత్రంలోనో చూచినట్లయితే అది మనస్సుకు హత్తుకుపోతుంది. ఇటువంటి పద్ధతినికూడా శ్రీశంభుప్రసాద్‌గారే వారపత్రికలో ప్రవేశపెట్టి తెలుగు దేశం జీవితంయొక్క ఒక విధమైన వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి, అకించనుల బ్రతుకుతెరువు పోరాటాలను జనం ముందు ఉంచడానికి ప్రారంభం చేశారా అనిపిస్తుంది.

ఇప్పుడు కొంచెం పెద్ద వయస్సు వచ్చిన తర్వాత అప్పుడు ఆ నడిచిన వారపత్రికలు తలుచుకుంటూ ఉంటే ఆ వారపత్రిక శ్రీ శంభుప్రసాద్ గారి చేతులో భారతితో దీటుగా నడిచిందాఅని అనిపిస్తూ ఉంటుంది. అప్పుడు నాకు భారతి చదివే అలవాటు లేదు. కాలేజీ చదువులకి వెళ్ళిన తర్వాత గానీ భారతి చదవటం మొదలు పెట్టలేదు. మా కాలేజి లైబ్రరీలో మొట్టమొదటిసారి భారతి చదివాను. నాకే విచిత్రం అనిపించింది. [illegible] భారతి అన్నది తెలియకుండా యిట్లా ఉన్నానా అని సిగ్గేసింది. ఇప్పుడు తెలుగుదేశంలో చాలా ప్రసిద్ధమైన కథలు, నాటకాలు, నవలలు కొన్ని భారతిలోనే వచ్చాయి. ప్రసిద్ధులైన రచయితలు భారతి ద్వారానేకాక అప్పటి వారపత్రిక ద్వారాకూడా తెలుగు దేశానికి తెలుగు ప్రజకు సుపరిచితులైనారు, శ్రీ మాధవపెద్ది గోఖలే కథలు శ్రీ కొడవటిగంటి కుటుంబరావు కథలు కొన్ని, ఇంకా మరికొంతమంది. అప్పటికి కొత్తవారైన రచయితల కథలు నేను వారపత్రికలోనే చదివాను.

ఇట్లా కొత్త తరం రచయితలకు శ్రీ శంభుప్రసాద్‌గారు ప్రోత్సాహం, ఉత్తేజం కలిగించి కొత్త రచనలను పురిగొల్పుతూ ఉండేవారు. ఆ తర్వాత ఆ తర్వాత అనుకుంటూ వచ్చాను.

ఒకసారి వారపత్రికలో మీ గ్రామం యొక్క గొప్పతనాన్ని గురించి వ్రాయండి అని ఒక ప్రకటన పడింది. కొంచెం రచనలో ఆసక్తి అప్పుడే పెరుగుతూ పెరుగుతూ ఉన్నందువల్ల మా ఊరుని గురించి కూడా రెండో మూడో కాగితాలు వ్రాసి పంపించాను. అది వారపత్రికలో పడలేదు. నాకు చాలా నిరుత్సాహం కలిగింది. ఎందుకు పడలేదు అని ఆ శీర్షికకింద పడ్డ 'మా గ్రామపు గొప్పతనాల' వ్యాసాలను చదివాను. ఆ పడినవన్నీ నేను వ్రాసిన దానికంటే బాగున్నాయి. నేను వ్రాసిన తెలుసుకున్నా మంచి తెలుగు గిలిగిఉన్నయి. మనంకూడాఎందుకు అట్లావ్రాయగూడదు? అన్న ఉబలాటం ఒకటి నాలో కలిగింది. కాంపిటిషన్‌లా వ్రాస్తే పత్రికలలో పడవని కూడా అప్పుడే తెలిసింది. ఇది ఒక కొత్త శీర్షికతో జనాన్ని ఆకట్టడానికి చేసిన ఒక పత్రికా నిర్వహణ శిల్పప్రక్రియ అని నేను అప్పుడూ అనుకోలేదు, ఇప్పుడూ అనుకోడం లేదు. పత్రికా నిర్వహణ శిల్పంలో అది భాగం అయితే కావచ్చుకానీ, రచనా వ్యాసంగ లక్షణం లోపల నిద్రాణంగాఉన్న వారిని కూడా పొడిచి రాయించడానికి ప్రోద్బలాన్ని కలిగించిన తీరువల్ల ఆ రకమైన శీర్షికలు గట్టి ప్రయోజనంతో నిర్వహించబడినయ్యని యిప్పటికీ నాకు అనిపిస్తుంది. ఇక్కడ అప్పుడు నాకు కల్గిన మనోభావ, విశేషాలని గుర్తించి కించిత్తు చెబుతాను:

తనా మోహారి వ్యాసం పడకపోవటం వల్ల ఏ నిర్వేదం నాలో అప్పుడు కలిగిందో అది నిజంగా నాలో రచనా ప్రకోపనం కలగటానికి ప్రథమకారణం అయింది. ఉత్సాహంతో రచనా ప్రకోపనం కలుగుతుందని కొందరంటారు. కాని నిర్వేదంలోంచి పుట్టిన ప్రకోపం ఏ ఉత్సాహత్తులో ఆ ఉత్సాహత్తుకు స్థిరమై నిలుస్తుందని నా అనుభవం. అప్పుడు మా గ్రామాల శీర్షిక కింద వారపత్రికలో వ్యాసాలు రాసినవాళ్ళు యిప్పుడు రచయితలుగా ఎక్కడా కనపడటం లేదు. వారికి అక్కడికి అక్కడే సంతృప్తి కలిగింది. అంతటితో ఆ ఉబ్బు అణిగింది వారు పెరగలేదు. పెరిగిన వారు యిప్పుడూ రచనలుచేస్తూనే ఉన్నారు. ఒక పత్రికా సంపాదకుడు దేశంలో రచయితలను బయటికి తేవడానికి యిటువంటి ప్రక్రియలు అనేకం చేస్తారు గావును అని అప్పుడు యిప్పుడూ కూడా నాకు అనిపిస్తూ ఉంటుంది.

ఇట్లా చూస్తే ఆంధ్రదేశంలో రచయితను అన్వేషించడానికి, వారిని వెలుగులోకి తీసుకురావడానికి, వారు ప్రతిభావంతులైతే వారిని ప్రజలముందు ఉంచడానికి వారు కాలూని దేశంలో రచయితలుగా స్థిరంగా నిలవడానికి యిటువంటి అనేక ప్రక్రియలని శ్రీ శంభుప్రసాద్‌గారు తమ వారపత్రికా నిర్వహణ దినాల్లో అనుసరించడం గమనిస్తూనే వచ్చాను.

సంవత్సరం బాగా గుర్తులేదు గాని ఒకసారి వారపత్రికలో జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి కవిత్వపు కూరల అంగడి అనో లేక మరియింకో అటువంటి పేరుతోనో ఒక వ్యాసం రాశారు. దాంట్లో కూరగాయలను ప్రతీకలుగా పెట్టి తెలుగుదేశంలో ఆయా కవుల కవిత్వపు పంథాలను తమ సహజ చమత్కారధోరణిలో రాశారు. అది ఆరోజుల్లో నాకు చాలా నచ్చింది. అందులో రుక్మిణీనాథశాస్త్రి కూరగాయల రూపంలో వ్యక్తంచేసిన అభిప్రాయాలు నాకు నచ్చినా నచ్చకపోయినా ఆ వ్యాసరచనా పద్ధతి యిప్పటికీ నా మనస్సులో నిలిచిపోయే ఉంది.

వ్యాసం అనేసరికి అనేక విషయాలు జ్ఞాపకం వస్తున్నాయి. శతావధానులైన

(మిగతా పేజీ-[illegible])

రిట్రెంచ్ మెంట్



యర్రంశెట్టి శాయి

జయ వాచి చూసుకొంది.

అయిదూనలభై.

పది నిమిషాలు ఆలస్యం అయిపోయింది. అయిదున్నరకల్లా ఇంటి దగ్గరుండాల్సింది. మనసులో అశాంతి రగులు కొంటోంది. ఏమయింది? ఎందుకింత వరకూ రాలేదు? పెళ్ళయి అయిదేళ్ళవుతోంది. తనకు తెలీకుండా ఏరోజూ ఎక్కడికీ వెళ్ళలేదు. సాయంత్రం అయిదు తర్వాత కంపెనీలో వుండడు. బయటికొచ్చి నుంచుంది జయ. ఎండ వేగంగా ఉపసంహరించుకొంటోంది. తోటలో క్రోటన్స్ మొక్కల మధ్య నీలిను, పక్కింటి పిల్లను కూర్చోబెట్టి ఆరిందాలా ఇంగ్లీష్‌లో కబుర్లు చెప్తోంది. ఆ పిల్ల కళ్ళు చక్రాలంత పెద్దవి చేసి ఆశ్చర్యంగా వింటోంది. జయకు నవ్వు వచ్చింది. ఇదెప్పుడూ ఏనుగుని చూడలేదు గానీ, చూసిన వాళ్ళకంటె ఎక్కువగా వర్ణించి చెప్తోందా పిల్లకు.

'నీలీ!'

'యస్ మమ్మీ!' పరిగెత్తుకొచ్చింది నీలి.

'నీకు తెలియం దాన్ని గురించి అలా అబద్ధాలు చెప్పకూడదు...'

'బట్ ... ఐనో ఎలిఫెంట్ మమ్మీ ... ఇటీజ్ ...'

'తెలుగులో మాట్లాడు!' గద్దించింది జయ.

'నేను ఏనుగుకి చూశాడు మమ్మీ!'

'ఎక్కడ?' నవ్వు ఆపుకొంటూ అడిగింది జయ.

'ఇన్ ది మాగజైన్...'

'తెలుగు...'

'డాడీ తెచ్చిన పుస్తకం మీద...'

దూరంగా స్కూటర్ శబ్దం వినిపించి గేటు దగ్గరకు పరిగెత్తింది జయ.

స్కూటర్ ఇంటిముందునుంచి ఆగకుండా వెళ్ళిపోయింది.

'దటీజ్ నాట్ డాడీ మమ్మీ!'

జయ ఇంట్లోకి నడిచి డ్రాయింగ్

కూరలో కూర్చుండిపోయిరది. ఆరవుతోరేది. ఏమయిందిి? స్కూటర్ చెడిపోయిందా? యాక్సిడెంట్ అయిందా? అశాంతి పేరుకుపోతోంది. క్షణం గంటలా వుంది. రేడియో ఆన్ చేసింది. పదేళ్ళ క్రితం రిలీజయిన తెలుగు సినిమా పాటలు ... గొంతు నొక్కినట్లు ఊరుకుండిపోయింది రేడియో. న్యూస్‌పేపర్ చేతుల్లోకి తీసుకొందామె.

'ఇందిరా వేవ్ ఆన్ ... కాంగ్రెస్ ఆర్ ఫాన్ ది ఎలక్షన్స్... శ్రీ డైవిత్ హంగర్.'

స్విట్జర్లాండ్ రికగ్నైజెస్ బంగ్లాదేశ్. కరుణానిధి డిమాన్స్ ఎసి సస్పెన్షన్ మూవ్.

పేపరు విసురుగా టేబుల్‌మీద పడింది.

ఆరు దాటింది.

స్కూటర్ ఇంటిముందుకొచ్చి ఆగిన శబ్దం గుండె గాలితో తేలిపోయింది.

'డాడీ!'

'కమాన్ నీలీ!'

'డిడ్ యూ బ్రింగ్ చాక్‌లెట్స్?'

నీలి పరిగెత్తుకు వెళ్ళిపోయినట్లుంది. మెట్లమీద బూట్ల చప్పుడు. అలసిపోయిన మొహం—చిరాగ్గా ఉన్న చూపూ—పెదాల మీదకు బలవంతంగా లాక్కొస్తున్న చిరునవ్వూ—

'సారీ!' మొఖం మీద భావాలన్నిటినీ చెరిపేస్తూ నవ్వాడు.

షర్టు విప్పి షర్ట్ హాంగర్‌కి తగిలించి ఆమె ప్రక్కనే కూలబడ్డాడు. జయ ఏమీ మాట్లాడలేదు. లోపలికెళ్ళి కప్పునిండా టీ తీసుకొచ్చి అతని ముందుంచింది.

కప్పు అందుకోబోతూ ఏదో గుర్తుకొచ్చినవాడిలా ఆగిపోయాడతను.

'మర్చిపోయావా?'

జయ చిరాకుపడింది. 'వద్దు! నాకు త్రాగాలని లేదు!'

'ప్లీజ్!'

ఆ ప్లీజ్‌ని ఎదిరించే శక్తి తనకు లేదు. అక్కడే అతనిముందు చిత్తుగా ఓడిపోయి సర్వస్వం అతనికి ధారపోసి దాసురాలయిపోయింది.

అతని చేతుల్లోని కప్పు తీసుకొని రెండు గుక్కలు త్రాగి మళ్ళీ అతని కందించింది.

త్రాగేసి ఆమె భుజంమీద చేయివేసి చిన్నగా నవ్వాడతను.

'వాడు...చారిగాడు తెలుసుగా—రాస్కెల్! ఇప్పుడే వస్తానన్జెప్పి స్కూటర్ తీసుకుపోయాడు...తీసుకెళ్ళి—ఓ! అంతే తీసుకెళ్ళాడు. అయిదున్నరయ్యాక తిరిగి వచ్చాడు ... అంతవరకూ ఆఫీసులోనే... నువ్వెదురు చూస్తుంటావని తెలుసు...కాని చారి...స్కూటర్ ... ఎప్పుడూ అడగలేదు వాడు...ఇదే మొదటిసారి...పోనీలేగదాని...'

ఠక్కున ఆగిపోయాడు రాజ్.

'హనీ!' అన్నాడు జయ భుజాలు పట్టుకొని కుదుపుతూ. జయ కిటికీలోనుంచి బయటకు చూస్తున్నదల్లా మెల్లగా తల త్రిప్పి అతని కళ్ళల్లోకి చూసింది. రాజు కొద్దిగా తేటబడ్డాడు.

'ఆర్ యూ ఆల్‌రైట్ హనీ! అలా డల్‌గా ఉన్నావేం?' రెండు చేతుల్తోను ఆమెను లేవనెత్తి తన వళ్ళో కూర్చోపెట్టుకొన్నాడతను.

'వదలు! నీలి వస్తుందేమో!' లేవబోయింది జయ.

'ఊహు! రాదు! ఆడుకొంటోంది. అది సరేగాని నువ్వెందుకలా ఉన్నావ్?' ఆప్యాయంగా ఆమెను గుండెలకు హత్తుకొంటూ అడిగాడతను.

'నీ కోసం ఎదురు చూశానుగదా! కొంచెం డిజప్పాయింట్‌మెంట్! అంతే!!'

'మర్చిపో! వచ్చేశానుగదా! ఎప్పుడోసారిలా అవుతూంటుంది...'

'మమ్మీ! వాటీజ్ డిజ్పైవ్‌మెంట్?' లోపలికొస్తూ అడిగింది నీలి.

ఒక్క ఉదుటున అతని చేతుల్నుంచి విడివడి లేచినుంచుంది జయ.

'సిక్స్‌థర్టీ'

'ఓ. కే!' అంటూ లోపలకు పరిగెత్తింది.

భోజనాలు ముగించి వెన్నెల్లో క్రోటన్స్ మొక్కల మధ్య కూర్చున్నారు రాజు.

'హనీ!'

'ఏమిటి?'

'నువ్వేమిటో ఆలోచిస్తున్నట్లున్నావ్?'

'అవును!'

'ఏమిటది?'

'ఓ సామెత గుర్తొచ్చింది. కామెర్లకళ్ళు వాడికి లోకమంతా పచ్చగా కనబడుతుందట...'

'అంటే?' అర్థం కానట్లు అడిగాడు రాజు.

జయ కిలకిల నవ్వింది. వెన్నెల్లో ఆమె అందమైన పలువరుస మనోహరంగా [illegible]పించిందతనికి.

రాజు ఆమె దగ్గరగా జరిగి చెవిపట్టుకొని మెలి పెట్టాడు.

'ఓహ్! మొద్దుచెయ్యి! వదులు! నొప్పెడుతోంది!'

చెవి పట్టుకొనే ఆమె మొఖం మీద ముద్దు పెట్టుకొన్నాడతను.

'ఇదిగో! నీకు మర్యాద తెలీదా?'

చెవి వదిలేశాడు రాజు.

'లేపోతే ఏమిటీ? నువ్వు చెప్పిన కథేం బావుండలేదు...ఇంకోటేదైనా ఆలోచించి చెప్పు త్వరగా...'

ఖంగారు పడ్డాడు రాజు 'ఏ కథా?'

'అదే చారిగాడూ—స్కూటర్ కథ!'

'నమ్ముకొన్న ఆడకూతురు దగ్గర అబద్ధాలు చెప్పటం నాకిష్టం లేదు...సరే నువ్వు ఇలాగా అనుకొంటూ కూర్చో నాకు నిద్రొస్తోంది ... వెళ్ళి పడుకొంటామ్మ' లేచి వెళ్తూ అన్నాడు రాజు. జయ కూడా గట్టిగా నవ్వుతూ అతని వెనుకే నడిచింది.

అర్ధరాత్రి దాటుతోంది. గడియారం అంతకుముందే పన్నెండు కొట్టింది. వెన్నెల మరింత కాంతి పుంజుకొని కిటికీలో నుంచి మంచం మీదకు ప్రవహిస్తోంది.

రాజుకి నిద్ర పట్టటం లేదు. చంద్రుడి వంకే చూస్తున్నాడు. తన గుండెల మీద పడిన వల్లని జయ చేతిని పట్టుకొని ఆమె వంక చూశాడు. పెద్దకళ్ళు తేసుకొని ఏదో ఆలోచిస్తూందామె.

'హనీ!' ఆశ్చర్యంగా పిలచాడు రాజు.

'ఊ!'

'ఇంకా నిద్రపోలేదూ?'

'ఊహు!'

'ఎందుకని?'

'ఏమో!'

కొద్ది క్షణాలు ఆగాడతను.

మెల్లగా ప్రక్కకు తిరిగి ఆమెను దగ్గరకు లాక్కొన్నాడు.

'నేనే ఓడిపోయాను హనీ! నీ దగ్గర నిజం దాచబోయాను!' అతని కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి. జయ ఆనందంతో ఊగిపోయింది. అతని మొఖాన్ని తన గుండెల మీద గాఢంగా హత్తుకొంది.

'నాకు తెలుసు రాజూ! నువ్వు నా దగ్గరేమీ దాయలేవు! అసలేమయింది?'

రిట్రెంచ్ మెంట్

'ఆ దుర్వార్త నీ చెవినేసి నీకూ మనశ్శాంతి కరువుచేయటం ఇష్టంలేక ఊరుకొన్నాను... అంతే హనీ! అంతకంటె మరో ఉద్దేశ్యం లేదు!'

'అన్యాయం రాజా! మనం ఒకరికొకరు పూర్తిగా అర్థం చేసుకొన్నాం! ఆ నమ్మకంతోనే ఒకటయ్యాం ... మనవాళ్ళెవ్వరికీ ఇష్టంలేకపోయినా!'

'సాయంత్రం మా కంపెనీ డైరెక్టర్ల మీటింగ్ జరిగింది. కంపెనీకి గత సంవత్సరం వచ్చిన నష్టాల మూలంగా సగం సిబ్బందిని రిట్రెంచ్ మెంట్ చేయదలుచుకొన్నారు. అందుకు ముందుగా బలయ్యేది నేనే...బహుశా ఓ నెల్రోజుల్లోపలే ఈ ఉద్యోగం ఊడిపోతుంది...ఆ తరువాత... మరో ఉద్యోగం అంత తేలిగ్గా దొరుకుతుందని అనుకోను!...'

జయ ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూండిపోయింది. చంద్రుడి వంక చూస్తూండగానే నల్లటి మేఘం ఒకటి వచ్చి చంద్రుడిని మూసివేసింది.

'హనీ?'

'ఊఁ!'

'భయంగా ఉందా?'

'ఎందుకూ?'

'ఉద్యోగం పోతుందని!'

నవ్వింది జయ.

'ఓ సారిలా చూడు!'

'ఏమిటి?'

'ఆ చంద్రుడు కనబడుతున్నాడా?'

'ఆ మబ్బు తప్పిపోతుంది రాజా. మళ్ళా వెన్నెల వస్తుంది...'

'అలా వెలుగొస్తుందంటావా?'

'తప్పకుండా!...'

'అంతే రాజా! మనకూ వెలుగే వస్తుంది!'

'అర్థమయింది...' ప్రేమగా ఆమె వంక చూస్తూ అన్నాడు రాజా.

'హనీ!'

'ఊఁ!'

'నువ్వు దేవతవి!'

అతని కౌగిట్లో పూర్తిగా ఇమిడిపోయింది జయ.

నెల రోజుల్లోగానే అతని ఉద్యోగం పోయింది. అంతకుముందు నుంచే ఉద్యోగం వేట మొదలయింది. ఐదు నెలలయినా ఎక్కడా అది దొరికే సూచన కూడా కనిపించలేదు. రాన్రాను నిరాశ పెరుగుతోంది. ఈ ఆరునెలల్లోనూ బాంక్ లోని బాలెన్సూ—స్కూటరూ కలిసి ఆ కుటుంబాన్ని ఆదుకొన్నాయి. ఉదయమే లేవడం—కాఫీటిఫినూ తీసుకొని ఉద్యోగం కోసం బయల్దేరటం తిరిగి తిరిగి రాత్రికి ఇల్లు చేరుకోవడం — అతని దిన చర్యగా తయారయింది. ఇకముందు గడవటం ఎలా అన్న ప్రశ్న అతన్ని పీడించేస్తోంది. రాత్రుళ్ళు అసలు నిద్ర పట్టటం లేదు.

'నీకో విషయం చెప్దామనుకొంటున్నాను!' అంది జయ రాత్రి అతను భోజనం చేశాక.

'ఊఁ!' అన్నాడతను.

'ఈ యింటికి నూటయాభై రూపాయలు అద్దె ఇస్తున్నాం—ఇలా ఎన్నాళ్ళివ్వగలం? మరేదైనా చిన్న ఇల్లు తక్కువ అద్దెలో చూడు! వీలైనంత త్వరగా వీలయితే —రేపే—చూస్తే మంచిది...'

గగనకుసుమాలు

ఎక్కడివీ చిరు మొగ్గలు
గగనంలో విచ్చుకొనును
ఎక్కడిదీ మెరుపు తీగ
ఆకాశాన అల్లుకొనును,

ఏకలో సుందరివో
జడనుంచాలు పూలా యివి?
ఏ ప్రేయసి అధర మందు
మెరసినట్టి భావములా?

తిమిరాలే భ్రమరాలై
తిరుగుతున్న వేమి వింత
మాధవియై ఆకాశము
మొగ్గ తొడిగె అణువంత—

ఒకే ఒక్క మనసులోని
వివిధములౌ అనుభూతుల
సితారాల సరాగాల
సమ్మేళనమా తారలు—

విరహబాధ కోర్వలేని
విరహార్తుని విరిశయ్యో!
లోకముపై విసరుతున్న
మారుకరముల శర జాలమొ!

—వడ్డాది సత్యనారాయణమూర్తి

'థాంక్యూ హనీ! నువ్వు ఫీలవుతావేమోనని ఈ ఆలోచన వచ్చినా నీకు చెప్పలేదు.'

మర్నాడే రెండుగదులున్న ఓ పెంకుటింట్లోకి మారిపోయారు. ఆదివరకు అవసరం అనుకొన్న వస్తువులన్నీ అనవసరంగానూ, వృధాగానూ కనిపించసాగినయి. అన్నీ రెక్కలు కట్టుకొని ఇంటి ఖర్చుగ్గాను ఎగిరిపోతున్నాయి. అతనికి రాన్రాను చిరాకు పెరిగిపోతోంది. దిగులుతో మనిషి చిక్కి సగమయ్యాడు.

'ఇవాళ ఆ రాస్కెల్ మోసం చేశాడు హనీ! ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తానని ...తీరా ఏ ఉద్యోగం చూపించాడో తెలుసా? కూలీలమీద మేస్త్రీ...నాలుగూ దులిపేసి వచ్చేశాను. సేల్స్ మేనేజరుగా పనిచేశాను కనీసం దానికి దగ్గర్లోనయినా ఉద్యోగం దొరక్కపోతే ఎలా?...ఇంకా కొంచెం అభిమానం ఉంది. బహుశా అది ప్రాణంతో పాటే పోతుంది!'

'హనీ! అదిగాకపోతే ఇంకో చోట...' అతన్ని సముదాయిస్తూ అంది జయ.

'నీకు తెలీదు హనీ! టార్చర్ గా ఉంది!' రెండు చేతుల్తోనూ తల పట్టుకొని కూలబడుతూ అన్నాడతను.

మరో రెండు నెలలు గడిచిపోయినయి. ఒకోసారి అతను జయమీదే విసుక్కొంటున్నాడు. ఆమె వంటిమీద నగలన్నీ ఒకటొకటే ఖర్చయిపోతూంటే అతనికి పిచ్చెక్కినట్లు అనిపించసాగింది. ఒకోసారి కోపంగా ఇంటికొచ్చేవాడు.

'వాడు శేఖర్ గాడు లేడూ? ఎంత మంచి ఫ్రెండో నీకు తెలుసుగా హనీ! కనబడి, మన సంగతి విని, ఎలా పారిపోయాడో తెలుసా? డబ్బడుగుతా ననుకొన్నాడేమో రాస్కెల్! నేనా? సంతోషంగా చస్తానుగాని ఎవడినీ దమ్మిడీ అడగను...' ఆవేశంతో అతను ఇంట్లోంచి బయటకు కదల్లేదు.

ఓ రోజు అర్ధరాత్రి జయను నిద్ర లేపాడతను.

'ఏమయింది?' అంది జయ ఆత్రుతగా.

'మనగురించే ఆలోచిస్తున్నాను హనీ! ఉద్యోగం ఉన్నప్పుడు మనకెప్పుడయినా ఇలాంటి పరిస్థితి వస్తుందని అనుకొన్నామా? జీవితం స్థిరపడిపోయిందని — అంతా సవ్యంగా, సాఫీగా జరిగిపోతుందని



BD 3615-Q

యంత్ర యుగానికి తగిన చీరలు!

జోరుగా ముందుకు పోతున్న యీ దశాబ్దికి తగిన వివిధ రకముల చీరలు! గాలి ఆడే, ముడతలు పడని 100% టెరీన్ రకములు. వయ్యారముగా ప్రయాణమునకు సొగసైన 'రేలిక'. బొంబే డైయింగ్ వారిచ్చే అపురూప కానుక! మెత్త మెత్తని 100% ముడతలు పడని నూలు చీర కట్టుకొందుకు చక్కగా ఉంటుంది. మనోరంజకమైన 2001 'స్విస్ వాయిల్స్'. తేలికైన, సొడలేని వాయిల్స్, మామూలుగా ఉన్నా, తళతళలాడతాయి.

బొంబే డైయింగ్

మీ వలె మరెవ్వరూ విశిష్టతను గ్రహింపజాలరు

ఎంత ధైర్యంగా అనుకొన్నాం? ఉద్యోగం తప్పితే మనకి మరేమీ రక్షణలేదనీ—లేకుండాపోతుందనీ ఎందు కాలోచించలేదు? మనిషి బ్రతుకింత అనిశ్చితంగా ఎందుకు తయారయింది? ప్రభుత్వానికేమీ బాధ్యత లేదా?'

'ఇప్పుడదంతా ఎందుకూ? నిద్ర పోరాదూ? నీకు దొరికేదే ఈ ఆరుగంటల విశ్రాంతి. ఈ కాసేపుకూడా ఎందు కిలా మనసు పాడుచేసుకొంటావ్?'

దీనంగా అంది జయ.

అతను మాట్లాడకుండా పడుకొన్నాడు. లైటు ఆర్పేసి తనూ పడుకొంది జయ. రాజాకి ఉదయం మెలకువ వచ్చేసరికి నీలి ఏడుస్తోంది.

'ఎందు కేడుస్తోంది?' అడిగాడతను.

జయ ఏమీ జవాబు చెప్పలేదు. విన నట్లే తనపని చూసుకోసాగింది.

'ఏంకావాలి నీలి?'

'నన్ను స్కూల్‌కి వెళ్ళొద్దంటోంది మమ్మీ...'

రాజాకి అర్థమయింది. మనసంతా వికల

రిట్రెంచ్ మెంట్

మయిపోయిం దతనికి. నిజమే.'

ఈ పరిస్థితులో నీలిని స్కూల్ మానిపించటంకంటె చేసేదేముంది.

రోజులు గడిచిపోతున్నాయి. త్రాగాను తిండికికూడా గడవటం కష్టమయి పోతోంది.

'ఇవాళ ఇంటర్వ్యూ కేమయిందో తెలుసా? మీ ఫ్రెండ్‌కూడా వచ్చింది అదే... భానుమతే నాపేరు?... ఇందుమతా? ...ఏదోమతి. ఉన్నదొక్కటే పోస్టు–పది మంది మగాళ్ళం—ఒకే ఒక్క ఆడది... ఒక్క సంవత్సరం అనుభవం ఉందిట. అయిదేళ్ళు అనుభవం ఉన్నా నన్నొదిలేసి ఆమెని సెలక్ట్ చేసుకొన్నారు...మీ ఆడాళ్ళు సగం తినేస్తున్నారు మా అపర్చునిటీస్‌ని...' నవ్వుతూ అన్నాడు ఓరోజు.

ఆ తరువాత వారం రోజుల వరకూ ఇల్లు కదల లేదతను.

'ఇంక ఎక్కడికీ పోదల్చుకోలేదు హనీ! ఏమయినా కానీ!' అంటూ కూర్చుండి పోయాడు. వారం రోజులవగానే ఒక్క ఉదయం మళ్ళీ తిరగటం మొదలు పెట్టాడు; పదిహేను రోజులలా వేళకు తిండీ నిద్రా లేకుండా తిరుగుతూనే ఉన్నాడు.

'ఈసారి తప్పకుండా వస్తుంది హనీ! ఈ కంపెనీ పర్సనల్ ఆఫీసర్ నన్ను గుర్తుపట్టాడు. అదివరకు సేల్స్‌మేనేజరుగా నేనున్నప్పుడు ఇద్దరం కలుసుకొన్నాం ఓ సారి... తప్పకుండా నాకీపోస్ట్ ఇస్తానని ప్రామిస్ చేశాడు?' అన్నాడు ఆనందంగా ఓరోజు రాత్రి ఇంటికొచ్చి.

ఆ ఆనందం వారం రోజులు తిరక్కుండానే కరువై పోయింది.

ఎప్పుడూ లేనంతగా నిస్పృహ పడి పోయాడు.

'ఇది మరీ అన్యాయం హనీ! ఎవరి మాట నమ్మాలో ఎవరి మాట నమ్మ కూడదో కూడా తెలీటం లేదు. అందరూ అన్యాయం చేస్తున్నారు...' ఆరోజు అతను భోజనం కూడా చేయలేదు. జయ ఎంత బ్రతిమాలినా లాభం లేక పోయింది. అర్ధ రాత్రి ఆమెకు మెలకువ వచ్చేసరికి లైట్ వెలుగులో తననే చూస్తూ అతను కూర్చునుండటం కనిపించిందామెకి.

'రాజా! ఇంకా నిద్రపోలేదూ?'

'ఊహూ!'

ఆమె కళ్ళు చెమ్మగిల్లినయి.

'రాజా!' అంటూ అతన్ని తన మీదకు లాక్కొని నుదుటి మీద చుంబించింది. ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆగలేదు.

'వద్దు రాజా! నువ్విలా దిగులు పెట్టుకోవద్దు...' ఏడుపు దిగమింగు కొంటూ అందామె.

'హనీ! నిన్నెలా తయారు చేశానో చూడు! ఈ మధ్య నెప్పుడయినా అద్దంలో చూసుకొన్నావా? పాలిపోయి, సన్నబడి — ఇదంతా నా మూలానకదూ? అందర్నీ కాదని నన్ను ఎంచుకొన్నందుకా ఈ శిక్ష? తల్లిదండ్రుల్నీ, ఐశ్వర్యాన్నీ వెధవ 'ప్రేమ' అనే పదం కోసం వదిలేయటం అవివేకంగా అనిపించటం లేదూ?'

'రాజా! ఇంకేం మాట్లాడకు! నా మనసులో ఇప్పటికే బాధగా ఉంది. నీకు నమస్కారం చేస్తాను ...' ఉక్రోషంగా అందామె.

'అవును హాసీ! నీ నగలన్నీ అయిపోయినాయి. బహుశా కొద్దిరోజుల్లోనే మనకు భగవంతుడు తిండి కూడా దొరకనీడనుకొంటాను, అప్పటికీ ఉద్యోగం దొరక్కపోతే...మనం మిగలము...'

'కాని నాకు నమ్మకముంది రాజూ! దేముడు మనని అన్యాయం చెయ్యడు...'

మిగిలిన రాత్రి ఇద్దరూ నిద్రపోలేదు. పీడకలల్లాంటి ఆలోచనలతో గడిపేశారు. తెల్లరుజామున ఆమెకు కొద్దిగా నిద్ర పట్టింది. బాగా తెల్లారిం తర్వాతగాని మెలకువ రాలేదు. రాజు ఎక్కడా కనిపించలేదామెకి. ఆరోజున ఇంటర్వ్యూ ఉందని చెప్పాడు. బహుశా అక్కడికి వెళ్లి ఉండవచ్చు అనుకొని ఊరుకుండి పోయింది.

'లేడీస్ ఆర్ ఈక్వల్లీ ఎలిజిబుల్' హాసీ! నాకేం నమ్మకం లేదు ఈ ద్యోగం దొరుకుతుందని!' ఆఉద్యోగం కోసం అప్ప్లై చేసిం దగ్గర్నుంచీ అంటూనే ఉన్నాడతను. అది గుర్తొచ్చి నవ్వుకొంది జయ.

అతను తిరిగి ఇంటికొచ్చేసరికి మధ్యాహ్నం రెండవుతోంది. దహించేసేట్టున్న ఎండ. వడగాల్పులు! ఆకలి! ఇంతకుముందెన్నడూ ఎనిమిదేళ్ళ కాఫీ త్రాగే అలవాటు పూర్తిగా మానిపోయింది — వారం రోజుల్లో! కాళ్ళు తేలిపోతున్నాయి ఓపికలేక.

ఇంటి ముందు కారు చూసి తక్కన ఆగిపోయాడతను. అదే కారు. ఇంట్లోకి నడిచాడతను. రాఘవరావు కుర్చీలో కూర్చొని ఉన్నాడు. జయ గోడవారగా నిలబడి ఉంది. సిలిమ చాపమీద నిద్రపోతోంది.

'హల్లో రాజూ!' అన్నాడు రాఘవరావు.

'హలో...' అని అస్పష్టంగా గొణిగి 'ఎప్పుడొచ్చారు?' అన్నాడు రాజు.

'నిన్న! రాగానే మీ పాతఇంటికెళ్ళాను. మారిపోయినట్లు చెప్పి - ఈ అడ్రసిచ్చారు వాళ్ళు...!

'అవును! మారాల్సి వచ్చింది ..' కమిలిన మొఖంతో అన్నాడు రాజు.

'అఫ్‌కోర్స్!... మనిషనేవాడెవడైనా సరే పరిస్థితులకు బానిసే!' అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

లోపల గదిలోకి నడిచాడు రాజు.

రాఘవరావు ఎందుకొచ్చినట్లు! తను పరిస్థితి తెలిసి? జయను పరామర్శించావనా? డబ్బిద్దామనా?

'నేను వెళ్తాను మరి...' గుమ్మం దగ్గరకొచ్చి అన్నాడతను.

అతనితోపాటు బయట తలుపువరకూ వెళ్లాడు రాజు.

'వస్తా జయా!'

మౌనంగా నవ్వింది జయ. కారు వెళ్ళిపోయింది.

'ఎందుకొచ్చాడు?'

'ఎందుకేమిటి? ఊరికెనే'

'ఏమంటాడు?'

జయ జవాబు చెప్పలేదు దానికి.

'పదండి! ముందు భోజనం చేద్దురు గాని...' అంది లోపలకు నడుస్తూ.

ఆమె వెనుకే నడిచాడు రాజు. అతనికి కావల్సిన సమాధానం దొరకలేదు

భోజనం వడ్డించిందామె.

'నిన్నుచూసి జాలిపడుతున్నాడా?'

అతనివంక విసురుగా చూసిందామె.

'ఏం? తప్పా? మన పరిస్థితి చూస్తే హృదయం ఉన్నాడెవడయినా జాలిపడతాడు!'

'నిన్ను తనతో వచ్చెయ్యమంటున్నాడా?'

ఆమె కళ్ళల్లోకి ఉక్రోషం చిమ్ముకొచ్చింది.

'నీకేమయినా మతుందా? ఎందుకలా అర్థంలేని మాటలు మాట్లాడతావు?'


'మతుండే మాట్లాడుతున్నాను! నిన్ను నానా బాధలూ పెడుతున్నాను. అందుక్కానే దానిలా తయారుచేశాను. అలాంటప్పుడు నిన్ను గుండెల్నిండుగా ప్రేమించిన బావ ఏం మాట్లాడినా ఆశ్చర్యపో నవసరంలేదు. ఇప్పటికయినా మించిపోయిందిలేదు, తనతో వచ్చెయ్యమని అనుంటాడు. నువ్వేమో సందిగ్ధంలోపడి...'

'రాజూ!' కాళిలా అరచింది జయ.


రాజు ఆమెవంకచూసి తల దించుకొన్నాడు.

'సే దట్ యూ ఆర్ సారీ!'

అతనేమీ మాట్లాడలేదు. ఆమె అక్కడి నుంచి విసురుగా వెళ్ళిపోయింది. అతనూ లేచి చేయి కడుక్కొన్నాడు రాజు. చాలాసేపటివరకూ సిలిమ ప్రక్కనే చాపమీద పడుకొని ఆలోచనల్లో మునిగిపోయాడు. జయపట్ల తన ప్రవర్తన చాలా అసహ్యంగానూ, అమానుషంగానూ కనిపించిందతనికి. అంత బలహీనత తనెలా అవహించిందో తెలీటంలేదు. ఎప్పుడూ ఇంత హీనస్థితికి దిగజారలేదు. కేవలం తన కోసం, తనతో వచ్చిన జయ గురించి అంత నీచమయిన ఆలోచన ఎందుకొచ్చిందో అర్థం కాలేదు. ఆమె మనసు గాయపడింది. ఆడది ఎన్నిబాధలయినా సంతోషంతో భరిస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా చిరునవ్వుతో ఎదుర్కొంటుంది. కానీ ఇలాంటి అవమానం భరించలేదు. ఇక్కడే ఆమె మనసు ముక్కలయిపోతుంది. రాజుకి కళ్ళ వెంబడి నీళ్లు తిరిగినయి. నెమ్మదిగా లేచి



కోరవలసినదేది?



బులుసు వేంకటరమణయ్య—ధర్మపథం

✱ ఒకప్పుడు కాకపోతే, మరొకప్పుడయినా, మనిషికి— తన జీవితం స్థిరం కాదనీ, ఎప్పుడో తాను శరీరాన్ని విడవవలసి వస్తుందనీ తెలియకపోదు. అందువల్ల— ముక్తిని పొందవలెననే కోరిక ఉండడమున్నూ సహజమే!

ముక్తి అనేది అంత సులభంగా లభించేది కాదు. దానికి ఎంతో పరిశ్రమ, నిష్ఠ మొదలైనవి కావాలి. అవి ప్రయత్నపూర్వకమైనవేకాని ఉన్నపాటున వచ్చేవి కావు. ఉదాహరణకు — ఒక మనిషి పడుక్కొని ఉన్నాడనుకుందాము. అతనికి పరుగెత్తాలనే కోరిక కలిగింది. ఆ కోరిక నెరవేరడానికి అతడు ఏమి చెయ్యాలి? మొదట మెల్లగా లేవాలి. లేచి కూర్చోవాలి. తర్వాత నిలవాలి. నిలిచిన తర్వాత పరుగెత్తాలి. అప్పుడే అతనికి పరుగెత్తడం సాధ్యపడుతుంది. పడుక్కొన్న పాళంగా పరుగెత్తడం సాధ్యపడదు. ఒకవేళ తొందరపాటున ప్రయత్నించినా — ఆ ప్రయత్నం వల్ల శరీరానికి బాధకలగడమే తప్ప ఫలితం ఉండదు.

ఆ విధంగానే ముక్తి పొందడానికి ముందుగా జరగవలసిన సాధనాలు ఎన్నో ఉన్నవి. క్లిష్టమైన వాటిని మనం అనుసరించనక్కరలేదు. తపోనిష్ఠలు అక్కర్లేదు. మానవుడు ఉండవలసిన విధంగా మనం నడుచుకొన్నప్పుడు — అన్ని విధాలా పురోగతి కలిగి క్రమంగా కొంత కాలానికి సంకల్పం నెరవేరుతుంది.

మానవులమై ఉన్నందుకు మనం నడుచుకోవలసిన విధానమెటువంటిది?

నేనూ మానవజన్మ ఎత్తి మానవులు నడుచుకొనే విధంగా నడుచుకోకపోతే నా జీవితమువల్ల ప్రయోజనం ఏమిటి? అని ఆలోచించి పరార్థ దృష్టిని పెట్టుకోవలసి ఉంటుంది. మానవుడన్నవానికి స్వార్థం లేకుండా ఉండదు. దాన్ని చంపుకోవడం మానవమాత్రునికి సాధ్యం కానే కాదు. స్వార్థ పరార్థ భావాలు మనలో సమానమైన పాళ్ళలో (అంటే చెరి ఏభయి పాళ్ళలో) ఉన్నాయని అనుకుందాం. అట్టి స్థితిలో మనం స్వార్థంలో ఒకపాలు తగ్గించి, పరార్థం విషయంలో ఒకపాలు హెచ్చించి— ఏభై యొక్క పాలు నిస్స్వార్థత ఉండేటట్లు ప్రయత్నించాలి. అలా క్రమంగా దాని పాళ్ళు హెచ్చిస్తూ స్వార్థపరతపైని వుండే దృష్టిని తగ్గించుకోవాలి. ఆచరణలో పెట్టే సంకల్పం వుంటే యీ ప్రయత్నం సఫలం కాక తప్పదు. అప్పుడు పరాత్పరుని కృప మనం పొందడానికి ఎంతో అవకాశం వుంది. ఆ కృపమూలంగానే తరించే ఉపాయాలూ మనకు తెలుస్తాయి. అంతేకాకుండా తరించే ఉపాయాలను అనుభవజ్ఞుల వల్ల తెలుసుకొనుటకు ఎంతో అవకాశం వుంది. అట్టివారు మనం కోరకుండానే మనకు వాటిని తెలియజేస్తారు.

మోక్ష మార్గానికి మొదటి మెట్టు మానవుడు మానవుడుగా ప్రవర్తించడానికి చేసే ప్రయత్నం! ●

ప్రక్కగదిలోకి నడిచాడు. జయ మంచంమీద పడుకొనిఉంది. ఆమె కళ్ళవెంబడి నీళ్ళు ధారలు కట్టేసయి.

అతనికి దుఃఖం ఆగటంలేదు: రెండు కళ్ళల్లో నుంచి [illegible]

రిట్రెంచ్ మెంట్

గుండెలకు గాఢంగా హత్తుకొన్నాడు:

'హాసీ! ఏమిటేమిటో [illegible]... [illegible]'

'నువ్వింత అప్సెట్ అయిందు కవుతున్నావ్ రాజా. ఇక ఉద్యోగమే దొరకదన్నట్లు ప్రవర్తిస్తున్నావ్! అడదానికూడా అన్యాయమయిపోతే ఎలా?'

'ఏమిటో హాసీ! ఎందుకో నాకు భయంగా ఉంది!'

'భయపడి నువ్వు చేయగలిగిందేమయినా ఉందా?'

అతను జవాబివ్వలేదు. ఆమె గుండెల మీద తలఉంచి మౌనంగా ఊరకుండిపోయాడు. 'పోస్ట్' అన్న కేకవిని వేగంగా ఆత్రుతగా బయటకు నడిచాడతను. రెండు కవర్లు వచ్చినయి పోస్ట్ లో.

ఆత్రుతగా విప్పి చూశాడు.

ఒక కంపెనీలో అతన్ని అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ గా నియమించినట్లూ, వారంరోజుల్లో జాయినవ్వాలనీ వ్రాసి ఉంది.

రెండో కవర్ తీసిచూశాడతను.

జయ పేరు సంబోధించి ఉందందులో.

మరో కంపెనీలో ఆమె స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గా సెలక్ట్ అయినట్లు వెంటనే జాయినవ్వాలనీ ఉంది.

'జయా ఏమిటిది?' ఆశ్చర్యంగా అడిగాడతను.

ఆమె గర్వంగా నవ్వింది.

'అవును? డిగ్రీ ఉంచుకొని ఇంట్లో కూర్చోడ మెందుకని నేనూ అప్లయ్ చేశాను. మీకు తెలీకుండా ఇంటర్వ్యూక్కూడా వెళ్ళాను.

దీనికి ఇన్‌స్పిరేషన్ ఎవరో తెలుసా?!

'ఎవరు?'

'నువ్వే!'

అతను నమ్మలేనట్లు చూశాడు!

'అవున్సార్! నువ్వంటూండేవాడివి గదా! 'లేడీస్ ఆర్ ఈక్వల్లీ ఎలిజిబుల్' ఆ వాక్యమే నా ప్రాణాలు తీస్తోందని... అప్పుడే తట్టింది. ఆ ఛాన్స్ నేనెందుకు తీసుకోకూడదని...'

'రక్షించావ్ జయా! ఇప్పుడు ఇద్దరం ఉద్యోగాలు చేస్తుంటే ఎంత ధైర్యంగా ఉంటుందో తెలుసా? మనకిప్పుడు పూర్తి రక్షణ ఉంది. నాకిప్పుడెంత కాన్ఫిడెన్స్ వచ్చిందో తెలుసా?...'

ఆనందంగా, ఉద్వేగంగా మాట్లాడుతోన్న అతని కళ్ళల్లోకి చూస్తూండి పోయింది జయ తృప్తిగా. ●

వారపత్రిక...

17వ పేజీ తరువాయి

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి వ్యాసపరం పరలు మొదటిసారి నేను ఆంధ్ర వారపత్రికలోనే చదివాను, ఆ వ్యాసాలలో చాలా యిప్పుడు అచ్చయి గ్రంథాలుగా కూడా వచ్చాయి. తెలుగులో వ్యావహారిక భాషలో రచన చేయదలుచుకున్నవాళ్లు ఆ వ్యాసాలను విధిగా చదివితీరాలని నాకు ఆ మొదటిసారి చదివినప్పుడే అభిప్రాయం కలిగింది. ఆ తెలుగు మహా సొగసుగా ఉంటుంది. నవలల కన్నాకూడా వెంకటశాస్త్రిగారి వ్యాసాలు ఎంతో రంజుగా ఉండేవి. వారి ఆ వ్యాసాలు చాలా వారపత్రికల్లో పడ్డాయి. ఆ వ్యాసాలు చదివి నేను తెలుగు నేర్చుకున్నాను. అధునాతనమైన వ్యాస రచనా శిల్పం చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి గారి వ్యాసాలలోనే కనిపిస్తుంది. చాలామంది వ్యాసాలు అవీ రాశారుగానీ చాలామందికి ఆ వ్యాస రచనా శిల్పం పట్టుపడలేదు. ఇటువంటి వ్యాసాలను వారపత్రికలో ప్రకటించి శ్రీ శంభుప్రసాద్‌గారు నాబోటి చాలామంది అనధికారులకు ఎంతో విద్యాదానం చేశారని నేను నిత్యమూ అనుకొంటూనే ఉంటాను.

అప్పుడు వారపత్రికలో చిన్న చిన్న సాహిత్యపు తగాదాలు కూడా కొనసాగుతూ ఉండేవి. అవి మాబోటివారికి మహా ఉత్సాహంగా ఉండి సాహిత్యంలో అభిరుచి కలగటానికి కారణాలు అయినయి. ఆ చర్చలలో హేమా హేమీలలాంటి వాళ్ళు రాస్తూ ఉండేవారు. అప్పటికి ప్రసిద్ధులై ఉన్నవారే కాక కొత్త కొత్త వాళ్ళు కూడా ఆ వివాదాలలో ముందుకు వస్తూ ఉండేవాళ్లు. అవి పలుకు ఉంటే పడుతూ ఉండేవి. ఈ విధంగా కూడా రచనా వ్యాసంగానికి కొత్త తరంలో ప్రోత్సాహం కలుగుతూ ఉండేది. ఈ విధంగా వారపత్రికలో సాహిత్య విమర్శలకు ప్రోత్సాహం యివ్వడమే కాకుండా కొత్త రచయితలకు తెలిసే వీళ్లు అందులో ఉండేది. ఇటువంటి చర్చలవల్ల రచయితలకి ఎంత ఉపకారం జరిగిందో దేశానికి భాషకు కూడా అంతే ఉపకారం జరుగుతుంది. స్కూళ్ళలో పాఠాలకన్నా యిటువంటి చర్చల్లోనించి ఎక్కువ విషయాలు తెలియటానికి ఆస్కారం ఉంది. ఇటువంటి బహుపద్ధతులను శ్రీ శంభుప్రసాద్‌గారు వారపత్రికలో ప్రవేశపెట్టి పత్రికకు ఒక ఆకర్షణను సాధించి దేశానికి పెద్ద మేలు చేశారని నేను అనుకుంటూ ఉంటాను.

తర్వాత చాలా కాలానికి శ్రీ శంభుప్రసాద్‌గారితో నాకు పరిచయం అయింది బెజవాడలో అనుకుంటాను. ఒక మిత్రుడి పెళ్ళికి వెళ్లాను. వారూ ఆ పెళ్లికి వచ్చారు. అక్కడ పందిట్లో కుర్చీలో తెల్లని ఖద్దరువంచె, తెల్లని ఖద్దరులాల్చీ, తెల్లని ఖద్దరు ఉత్తరీయం వేసుకుని ఆయన కూర్చున్నారు. శంభుప్రసాద్‌గారు వచ్చారు, శంభుప్రసాద్‌గారు వచ్చారు అని అంతా గుబ్బుగా అనుకుంటూ ఉంటే నేనూ అటువెళ్లాను. మా మిత్రుడు నన్ను ఆయనకు పరిచయం చేశారు. వీరిది ఫలానా ఊరు, ఏదో రచనచేస్తూ ఉంటారు అని పరిచయపు మాటలు చెప్పారు. నిజానికి నేను అప్పటికి రచనా చెయ్యలేదు ఏమీ చెయ్యలేదు. తెలుగు భాషలో మహత్తరమైన నవలలను తమ పత్రికలో ప్రకటించి, బహువిధములైన చర్చలను వారపత్రికలో నడిపి ఆలోచన అంటే యిట్లా చెయ్యాలిగావున్నా అని నామటుకు నాకు మార్గాన్ని చూపించిన, నేను అప్పటికి ఎంతో కాలంనించీ చూడాలనుకుంటున్న వ్యక్తిని చూచాను. అప్పుడు నాలో ఏమి భావాలు కలిగాయో యిప్పుడు బాగా గుర్తులేదు. కానీ ఒక గొప్ప వ్యక్తిని ఆ రోజు చూచాను అన్న స్పృహ నాలో యిప్పటికీ అట్లాగే నిలిచిఉంది. ఆ తర్వాత మరి కొంత కాలానికి వారితో నాకు సన్నిహిత పరిచయం ఏర్పడింది. నాలో అప్పుడు ఆయన గొప్పదనాన్ని గురించి కల్గిన ఏ స్పృహ ఉన్నదో ఆ స్పృహ పరిచయాధిక్యం కలుగుతూ వస్తూన్న కొద్దీ బలపడుతూనే వచ్చింది. నేను యిప్పటికిగూడా నేను మొదట చదివిన వారపత్రికలలోనే తెలుగు భాషలో ఓనమాలు నేర్చుకున్నాను అనిపిస్తుంది. అనిపించడం కాదు అక్షరాలా నిజం.

వారపత్రికలో పడక కుర్చీ భావాలని అనేక విషయాల పైన వ్యాఖ్యానప్రాయమైన వ్యాసాలవంటివి పడుతూఉండేవి. అప్పుడు అంతాకూడా ఇది ఎవరు రాస్తున్నారు ఇవి ఎవరు రాస్తున్నారు అని అనుకుంటూ ఉండేవారు. వాటిలో విమర్శ, విషయ వివరణ, తెలుగు నుడికారపు సొంపు సముత్సాకంలో ఉండి ఆహా అనిపిస్తూ ఉండేవి. **ఆ తెలుగులో కృత్రిమపు పదిష్టీలు ఉండేవి కావు. తెలుగు నుడికారం చిక్కగా చిక్కని** ఉండేది. విమర్శ కటువుకాక, కఠినమూకాక మృదువుగా కాంతా సమ్మితంగా ఉండేది. దేశంలో ఆ పడకకుర్చీ భావాల పరంపర మంచి సంచలనాన్ని కలిగించింది. తర్వాత ఎప్పుడోగానీ అవి శ్రీ శంభుప్రసాద్‌గారు రాసినవని నాకు తెలియలేదు.

అప్పటి వారపత్రికను గురించి ఒక్క విషయం చెప్పి యిది ముగిస్తాను. దసరా పండుగ వస్తోంది, వారపత్రిక దసరా సంచిక వెలువడుతుందని ముందుగానే ప్రకటించారు. మంచి అందంగానూ, మంచివ్యాసాలతోనూ వస్తుందని వేశారు. సంవత్సరం నాకు బాగా గుర్తులేదు. నేనూ మా స్నేహితులమూ అది మామూలు వారపత్రిక సైజులోనే వస్తుందనుకున్నాము. ఇది విశేష సంచిక గనుక విశేషంగా ఉంటుందన్న భావం రాలేదు. ఆశ్చర్యాన్ని కల్గించడం అన్నది పత్రికా ప్రచురణ శిల్పంలో ఒక విశేషం అన్న విషయం ఆ దసరా సంచికని చూసినప్పుడు నాకు అనిపించింది. ఆ దసరా సంచిక యిప్పుడు ఆంధ్రసచిత్రవారపత్రిక సైజులో వచ్చింది. బాగా ఎక్కువగా పేజీలు వేశారు. మంచి మంచి రచనలు ఉన్నాయి, పైగా అట్ట మహా ఆకర్షణీయంగా ఉంది. ఆ పత్రికను నేను చాలాకాలం దాచి ఉంచి పెట్టుకున్నాను. ఇటువంటి బహు పత్రికా ప్రచురణ శిల్పంలో చమత్కారాలు శ్రీ శంభుప్రసాద్‌గారుచేస్తూ ఉండేవారు. ఆ రోజుల్లో వారపత్రిక చదవటం నామటుకు నాకు కొత్తవిద్యను అభ్యసించేడంగా ఉండేది. హేమాహేమీల రచనలు పడుతూ ఉండేవి. అవి ఆ రోజులు శ్రీ శంభుప్రసాద్‌గారు వారపత్రిక సంపాదకత్వాన్ని వహించిన కొత్త రోజులని నాకు తర్వాత తర్వాత తెలిసింది. ఇప్పుడు ఆ రోజులను తలచుకుంటే ఆంధ్రదేశంలో వారపత్రికను కొత్త పద్ధతిలో నడపటం అంటే ఏమిటో అప్పుడే ప్రారంభం అయినట్లు ఒక భావం కలుగుతుంది. అప్పటికీ యిప్పటికీ కూడా నా అభిప్రాయం అదే. ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసిన అవసరం కూడా నాకు కనిపించలేదు.

— సా. గో.

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

టి. ఎస్. ఆర్. కొవ్వూరు

భర్తమాట విన్న ఆడదానిని పతివ్రత అంటారు. మరి భార్యమాట విన్న మగ వాడిని అసమర్థుడు అంటా రెందుచేత ?

అది పూర్వం. ఇప్పుడు— పత్నీవ్రతుడు, అని గొప్పగా చెప్పుకుంటారు.

ఎస్. ఆర్. ఆర్, ముక్కామల

ప్రస్తుతం లోకం ఎటు పోతోంది?

'73 వైపు.

సంసారం విచ్ఛిన్నం కావడానికి కారకులు స్త్రీలా ? పురుషులా?

స్త్రీ పురుషులు.

హెచ్. హెచ్. ఆర్, గుంటకల్

మీకు దేవునిమీద నమ్మకంవుందా?

ఉందని చెప్పి ప్రయోజనం లేదు. లేదని చెప్పి ప్రయోజనం లేదు— ఎలా చెప్పినా ఆధారమేమిటి అని అడుగుతారు. నేనుచెప్పలేను.

ఎస్. కె. ఆర్, పర్లాకిమిడి

ఎటువంటి ఆశలూ లేనివాడిని ఏమనాలి?

ఆశలేని మనిషి వుండడు బ్రదర్!

వీస్. వి. ఆర్, రాజమండి

విద్యార్థులు బాగా చదువుకొని మంచి భవిష్యత్తు ఏర్పరచుకుందాం అనుకోకుండా తిరుగుదాం, సినిమాలు చూద్దాం అనుకుంటారేమండీ?

కుర్రతనం చేత.

జి. కె, రాజమండి

ఎంత సంతోషంగా ఉండాలన్నా ఎందుకుండదు?

సంతోషంగా ఉన్నానా అని ప్రశ్నించుకుంటూ కూర్చుంటే ఉన్న సంతోషం కాస్తా హరించుకుపోతుంది. అందుచేత.

ఎమ్. కె, హైదరాబాదు

ప్రతిస్త్రీ తను ప్రేమించిన వాడికన్నా తనని ప్రేమించిన వాడిని చేసుకుంటే సుఖపడకలదని అనుకుంటాను.

నిజమే. తనని ప్రేమించేవాడికి తానే దైవం. తను ప్రేమించిన వాడికలా కాకపోవచ్చును కదా.

కె. ఆర్. ఎల్, కాకినాడ

మీరు పత్రికలో రాస్తున్న వ్యాసాలు చాలా బాగుంటున్నాయి...

సంతోషం.

వీస్. పి. ఎమ్. ఆర్, రాజమండ్రి

రాలిపోయేముందు యీ జీవితానికో ఆశ కల్పించమన్నాను. నిర్మలజ్యోతిలా సాగిపోయే నా జీవితాన్ని మీకోసం త్యాగం చేయలేనండి.

ఎవరో గట్టి పిండంలా వుంది!.. లేకుంటే అంతనేలన కాలూని నిలబడకల్లేదా?!

జి. ఆర్. ఆర్, జెంషెడ్‌పూరు

యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు గోపికలతో రాసక్రీడలు జరపడంలో అంతరార్థం ఏమిటి ?

అవి రాసక్రీడలు కావు గురూ. యోగాభ్యాసంలో తొలిపాఠాలు.

పి. హెచ్. బి. కే, ముమ్మవరం

ఊహాజగత్తులో అవరోధములు లేని మానవునికి వాస్తవిక జగత్తులో దేనికి ఎదురుదెబ్బ ?

వాస్తవం. బొత్తిగా వూహాజీవితం కాదని తెలియచెప్పాలి కదా? అందుకు.

ఆర్. వి. ఆర్, తిరుపతి

నా చేతిరాత సరిగా వుండదని అంటున్నారు. అందుచేతనే...నే రాసిన గేయాలు, కథలు...

బాధ పడకు తమ్ముడూ, చేతిరాతే— ప్రమరణకు అర్హత అయితే యీనాటి ప్రముఖ రచయితలెందరో— కలికంలోకి కనబడకుండా పోయివుందురు. రాతలో కాదు—రాసిన దాంట్లో ఉండాలి అందం!

బి. ఆర్. డి, హీరమండలం

జీవితంలో మనిషికి మిగిలేదేమిటి?

ఆతగాడు చేసిన మంచి చెడూ.

ఎస్. ఎస్. ఆర్, విశాఖపట్నం

మనిషికి మనసుకు శాంతి లభించేది ఎక్కడ ?

యిక్కడే — నీతోనీకు శత్రుత్వం లేకపోతే. లేకుంటే ఎక్కడా లేదు.

జె. ఆర్. ఏ, లచ్చిపేట

ఎక్కడా స్థలం దొరకనట్టు బస్సుల్లో సరసాలాడే భార్యాభర్తల నేమనాలి?

బహుశా కొంపలో కూర్చునే స్థలం కూడా ఉందో, లేదో అనుకోవాలి. లేదా 'ఇంట్లో తన్నుకు చస్తారు కాబోలు.పబ్లిక్‌గా ప్రేమించుకుంటున్నారు.' అనుకోవాలి. లేదా లేకుంటే సినిమాలో ఏ నాగేశ్వరావూ వాణిశ్రీయో, రాజబాబు, రమాప్రభలో అలా చేశారు కాబోలు అనుకోవాలి.'

జి. వి, కొమరగిరి పట్నం

నేను ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు నా మాటలవలన ఎదుటివారి మనసు బాధపడుతుందేమోనని భయపడతాను. అందువల్ల ఎవరితోనూ సరిగా మాట్లాడలేను.

ఓ పని చెయ్యకూడదూ, మాట్లాడ్డం ప్రారంభించడానికి ముందే 'నామాటల వల్ల బాధ కల్గితే క్షమించండి.' అని ఓ డైలాగు పారేసి యిష్టం వచ్చినట్టు మాట్లాడితే సరి!

పి. ఎన్. ఆర్, రాజమండి

నిజం ఎందుకు బాధ పెడుతుంది ?

నిజం బాధపెట్టదు. —బాధ పెట్టవలసి వస్తే తప్ప!

టి. వి. కె, బళ్లారి

ప్రతిమనిషి తనకంటె ధనవంతుణ్ణి చూసి అసూయపడతాడేగాని తనకంటే బీదవాడిని చూసి సంతోషించడు. ఎందుకని?

ఎందుకు సంతోషించడు—లోలోపల సంతోషిస్తాడు. తానా స్థితిలో ఉండనందుకు.

ఎస్. ఎన్, తెనాలి

స్త్రీహృదయంలో ఎంతమందికి స్థానం వుంటుంది ?

తన భర్తకి, తను కన్నపిల్లలకి.

ఎమ్. ఎన్. ఎమ్, విజయనగరం

'మంచి రోజులొచ్చాయి' దేనికి నాధారమూ.

ఆ 'సవాలే సవాల్' అనే శివాజీ చిత్రానికి కాపీ.

కె. ఆర్; కె. ఎన్; కె. ఎమ్. ఎస్;

కె. ఏ, కాజూరు

సర్కస్, డ్రామా, సినిమా యీ మూడింటిలో ఏది కన్నులకు యింపుగా వుంటుంది?

సర్కస్+డ్రామా కలిసి ఉండే మన సినిమాలు!

ఎస్. పి. ఎమ్. ఆర్, రాజమండి


మీరిచ్చే కొంటె జవాబులు బాధ కల్గిస్తున్నాయి ముఖ్యంగా ప్రేమికుల విషయంలో. వారి ప్రేమికులను ఎందుకంత చులకగా ఊహిస్తున్నారు?

అవే బరువైన ప్రేమలైతే ప్రశ్నావళికి, ఎందుకువస్తాయి స్వామీ? గుట్టు కోరుతాయిగాని!

ఆర్. ఎస్. ఆర్, హైదరాబాదు

స్త్రీకి సహనం ఓర్పు ముఖ్యం కదా? మరి పురుషునికి?

సహనం, ఓర్పు ముఖ్యం!



ప్రతినిధి

రాధిక

చిక్కని చీకట్లో సారంగం తవ్వుకుంటూ తారురోడ్డుమీద పరుగెడుతోంది బస్సు. తవ్విన సారంగం బస్సు వెనుక వెంటనే మూసుకుపోతోంది. అంత వరకూ చీకట్లో బ్రతుకుతున్న రెక్కల పురుగులు బస్సుముందు అద్దానికి విసురుగా తగులుతున్నాయి. చల్లటిగాలి ముఖానికి తగిలి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. నిద్రవేళ కాకపోయినా చిన్నకునుకు పట్టింది.

బస్సు ఆగింది. కునుకు చెదిరింది.

దిగేవాళ్ళు దిగుతున్నారు. బస్సు దాదాపు ఖాళీగాఉన్నా సీట్లు దొరకవనే ఆదుర్దాతో ఎక్కేవాళ్ళు దిగేవాళ్లకు అడ్డుపడుతున్నారు.

'కాఫీ తాగేవాళ్ళు తాగొచ్చు' కండక్టరు అరిచాడు, తనుకూడా-బస్సుదిగుతూ.

బస్సుదిగి అక్కడే ఉన్న డిపో కాంటీనుకు వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చాను. 'కాఫీ అలవాటు మానివేయ దలచుకొన్నవారు అక్కడ ఓ రెండుసార్లు కాఫీ తాగితే చాలు' అనిపించింది ఆ కాఫీ త్రాగాక, పాడయిన నోటిని ఉద్ధరించడానికి ఓ వక్కపొడి పొట్లం కొన్నాను.

తిరిగి బస్సు ఎక్కేసరికి కండక్టరు అప్పుడే ఎక్కిన ఒక ప్యాసంజరుమీద చికాకు పడుతున్నాడు. 'హైదరాబాదుకి మూడూ ఎనభై పైసలు. ప్రతీవాళ్ళూ పెద్దనోట్లు తెస్తే చిల్లర ఎక్కణ్ణుంచి తేవాలి?' కండక్టరు చికాకు సమంజస మనిపించింది. టికెట్ మీద డ్యూ వ్రాయడంతో ఆ సద్దు మణిగింది.

టికెట్ల తిరణాల తరువాత బస్సు కదిలింది. కదిలి పదిగజాలు వెళ్ళిందోలేదో ఓ ఇద్దరు దాదాపు రోడ్డుకడ్డంగా నిలబడి బస్సును ఆపేశారు 'బాబుగారు వస్తున్నారు' అంటూ. ఆ బాబుగారికోసం ఈ జాతీయం చెయ్యబడ్డ ప్రజావాహనం ఆగి ఎదురు చూస్తోంది. కండక్టరు తలుపుతెరిచి ఆహ్వానిస్తున్నట్లు నిలబడ్డాడు.

ఒక నడివయస్సాయన తన స్వంత కారులో ఎక్కబోతున్నవాడిలా తాపీగా నడుస్తూవచ్చి బస్సుఎక్కాడు.

'రేపట్నుంచి మరో యాభైమందిని పెట్టి పదోతారీఖులోగా పని అయేట్టు చూడండి.' ఆయనను బస్సు ఎక్కించడానికి వచ్చిన ఆ గుంపులో ఎవరినుద్దేశించి చెప్పాడో!

బస్సు కదిలింది.

ఆయన వరాసరి వచ్చి ఖాళీగా ఉన్న నా ప్రక్కసీట్లో కూర్చున్నాడు, నన్ను కిటికీవైపు నొక్కేస్తూ.

'ఏంసార్! కులాసానా?' కండక్టరు తలుపు మూసివచ్చి ఆయన్ని సాదరంగా ప్రశ్నించాడు. ఆయన చిరునవ్వుతో తల పంకించాడు. కాసేపు నిలబడి తరువాత తన సీట్లోకి వెళ్ళికూర్చున్నాడు కండక్టరు.

దూరంగా కూర్చొన్న వాళ్లను విశితంగా పరిశీలించవచ్చు బస్సులో. మరీ ప్రక్కన కూర్చున్నవాళ్లను గమనించడానికి కొంత సమయం పడుతుంది.

ప్రక్కసీట్లో కూర్చొన్నాయన వయస్సు దాదాపు, యాభై ఉండొచ్చు. మనిషి భారీగా ఉన్నాడు. గోల్డుఫ్రేము కళ్ళజోడు ఆయన హుందాని పెంచింది. బుర్రమీసాలు కొద్దిగా నెరిసి ఆయన వ్యక్తిత్వంలో సరిగ్గా ఇమిడాయనిపించింది. ఆయన ఖద్దరు పంచె, లాల్చీ, భుజంమీద చిలకంచు ఉత్తరీయం అయన పెద్దరికాన్ని సూచిస్తున్నాయి. ఆయన చేతికి రాయిలేని బంగారు ఉంగరం ముద్దుగా, మందంగా మెరిసింది. ఆయన్ను చూస్తే చేతికర్ర కేవలం ఠీవికోసం తప్ప దాని అవసరం ఆయనకు ప్రస్తుతం లేదనిపిస్తుంది.

మొత్తంమీద ఆయన స్వరూపం నాలో ఆయనగురించి తెలుసుకోవాలనే ఉత్సుకతను కలిగించింది.

'మీరూ హైదరాబాదేనా ?' 'ఇంతలో ఆయనే పలుకరించాడు.

'ఔనండీ.' ఆయన పలకరింపులోనే ఆయన హైదరాబాదు వస్తున్నారని తెలిసింది. జవాబిచ్చి, ఆయన గురించి తెలుసుకుందా మనుకున్నాను. కానీ, ఆయన ప్రశ్నల వర్షం నన్ను ప్రశ్నలు వేయనివ్వలేదు.

'మీరూ ఇక్కడే ఎక్కారా ?'

ఏక్కణ్ణుంచి వస్తున్నానో చెప్పాను.

'ఆ ఊళ్లో ఉద్యోగమా ?'

'అవునండీ. స్టేట్ బ్యాంకులో పని చేస్తున్నాను.'

'హోదా ఏమిటి ? క్యాషియరా ?'

'కాదండీ. ఆఫీసరుగా చేరి సంవత్సరం అవుతోంది...' ఆయన అటుగా జరిగి నాకు మరో కొంతస్థలం మంజూరు చేశాడు. ఆయనగురించి తెలుసుకోడానికి కొంత వ్యవధి దొరికింది. అది ఉపయోగించుకునే లోగా ఆయన మరో ప్రశ్న వేశాడు.

'పెళ్ళి అయిందా ?'

లేదన్నాను. ఆయన మా కుటుంబం గురించి కనీసం మరో అరడజను ప్రశ్నలు వేశాడు. ఆయన ప్రశ్నావళి కంతటికీ ఓపిగ్గా జవాబులు చెప్పాను, కాస్త చనువు

ప్రతినిధి

తీసుకున్నాడాయన.

'మీరెంకులం నాయనా ?'

నన్ను చాలా ఇబ్బంది పెట్టే ప్రశ్నల్లో ఇది మొదటిది. ఒకసారి ఆయన కళ్లలోకి చూసి సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాను.

'నాకు కులాలమీదా మతాలమీదా నమ్మకం లేదండీ. నేను ఇతరుల గురించి తెలుసుకునే సమయాలలో వీటిని విస్మరిస్తాను.' ఆయనకు అర్థమయినట్లుంది.

'భేష్, బాగా చెప్పావు నాయనా ! నాకు నచ్చావు. చెప్పుకోడానికి తప్ప ఈ రోజుల్లో కులాలకు ప్రాముఖ్యంలేదు. ఎంతమంది తమ కుల వృత్తుల్లో ఉన్నారు చెప్పు ? ఆ రోజులు పోయాయి...'

'—మన ప్రభుత్వం కూడా మనం మరచిపోతున్న కుల, మత వ్యవస్థలను మళ్ళీమళ్ళీ మనకు జ్ఞప్తికి తేకుంటే ఇంకా బాగుంటుంది. ఉద్యోగంకోసం దరఖాస్తు పెడదామంటే ముందుగా మనం ఏకుల మతాలకు చెందినవాళ్లమో చెప్పాలి! ఇన్ని చెప్పి మనం ఎవరిమో మళ్ళీమళ్ళీ స్మరించుకుంటూ కులమత భేదాలు లేకుండా వుండమంటే ఎంతవరకూ సాధ్యమో మీరే చెప్పండి.'

'బాగుంది నాయనా, నువ్వు చెప్పేది; మనిషికులం తెలుసుకోకుండా ఎలా ఇమ్మంటావ్, ఉద్యోగం ? కనీసం అతడు వెనుకబడ్డజాతి వాడేమో అదైనా తెలుసుకోవాలి కదా ! అందుకైనా అతడు ఏకులంవాడో తెలియాలి. వెనుకబడ్డ తరగతులవారిని ఉద్ధరించవలసిన అవసరం నేడెంతైనా ఉంది.'

'సరే, మీరు చెప్పింది ఒప్పుకుందాం. మరి మతం ఏమిటో అడగటం దేనికి ? మతం తెలుసుకోకుండా 'ఉద్యోగం ఇవ్వకూడదా ? మీరు పెద్దవారు; నాకు తెలిసినది తక్కువే అయి ఉండొచ్చు. కానీ, నా దృష్టిలో కులాన్నిబట్టి మనిషియొక్క ఆర్థిక సాంఘిక సోమత అంచనా వెయ్యడం అనుచితం. వెనుకబడ్డ జాతులవారిని ఉద్ధరించడం అంటే మిగిలినవారిని అణగద్రొక్కడం కాకూడదు.'

'నీ ధోరణి నాకు నచ్చలేదు' అన్నట్లు ఆయన మౌనంగా చిరునవ్వు నవ్వారు. నేను అంతగా ఆవేశపడటం నాకే నచ్చలేదు కొంతసేపు ఇద్దరం మౌనంగా ఉన్నాము.

బస్సు వేగంగా పోతోంది. హెడ్‌లైట్లు చీలుస్తున్న చీకటి బస్సు వెనుక వెంటనే కలుసుకొంటోంది !

'మీ పేరు సెలవివ్వారు కాదు' తెచ్చిపెట్టుకొన్న నమ్రత నా మాటల్లో ధ్వనించింది.

'నన్ను భుజంగరాయుడంటారు. ఇక్కడ మా వాళ్ళదొక కాంట్రాక్టు ఉంటేనూ, చూద్దామని వచ్చాను ... హైదరాబాదులో ఉంటున్నాను ప్రస్తుతం.' కిటికీలోనుండి దూరంగా చూస్తూ అన్నారాయన.

'మీరుకూడా కంట్రాక్టరా ?'

'లేదు బాబూ ! ఏదో శక్త్యనుసారం దేశానికి ఇంత సేవ చేద్దామనే తహతహ మాత్రం ఉంది. క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో, కొద్ది తేడాలతో ఓడిపోయాను. మొన్న మళ్ళీ నామినేషను దాఖలు చేశాను. ఈసారి గెలవడం ఖాయం...స్వాతంత్ర్య పోరాటంలో రెండుసార్లు జైలుకెళ్లాను...అప్పటి లాఠీ దెబ్బల నొప్పులు ఇప్పుడే కొస్తకొస్త మరచిపోతున్నాం ! మా రోజులే వేరు. ఆనాటి విజాయితీ మళ్ళీ వెలుగు చూడదేమో...'

ఆయన కంఠంలో బాధ నాకు స్పష్టంగా వినిపించింది.




అతనంటే నాకుప్రాణం. అతన్తో ఎట్లాచెప్పేది?
"అయ్యో, నే నేం చేసేది? మా ఇద్దరి మధ్య నోటి దుర్వాసన అడ్డు రావటం సహించ లేక పోతున్నాను"
తరువాత, ఒక రోజున రాధ స్నేహితురాలు, కుసుమ కాలక్షేపం కోసమని వచ్చింది.
"అట్లా దిగాలుపడి ఉన్నావేం, రాధా?"
"రమేష్ నోటి దుర్వాసన...అతను దగ్గరికి వచ్చినప్పుడల్లా, దానిని భరించ లేకుండా ఉన్నాను"
"బినాకా గ్రీన్‌తో దానిని వదిలించుకోటం చాలా తేలిక. దుర్గంధమును కలిగించే సూక్ష్మ క్రిములను నిర్మూలించటానికి ప్రత్యేకంగా బినాకా గ్రీన్ తయారు చేయబడింది. అంతేకాదు, దుర్వాసన రాకుండా, నోటికి అధిక సంరక్షణను సమకూర్చే క్లోరోఫిల్ బినాకా గ్రీన్‌లో ఉంది".
"అతనంటే నాకు ప్రాణం. అతన్తో ఎట్లా చెప్పేది?"
"ప్రస్తుతం అతను వాడే టూత్ పేస్టు తీసేసి బినాకా గ్రీన్ పెట్టు"
నెల తరువాత—
"నీవు గమనించావో లేదో గాని, రాధా, నాలో ఏదో మార్పు వచ్చినట్లు అనిపిస్తోంది. ఆఫీసులో పనివారందరూ నాతో చాలా ఆప్యాయంగా ఉంటున్నారు. నా కిప్పుడు ఎంతో నిశ్చింతగా ఉంది".
"అవునండీ, నాకూ అలాగే కనిపిస్తోంది"
C I B A Cosmetics
60g
Bi Binaca
Binaca Green
రోజంతా, మీ శ్వాసను తాజాగా మధురంగా ఉంచగల, ప్రకృతి యొక్క స్వకీయ దుర్గంధ నివారిణి క్లోరోఫిల్ బినాకా గ్రీన్‌లో గలదు
/cg/13a tel

ముందుసీట్లో ఉన్నఇద్దరు—స్టూడెంట్లు"లోలు. తెలుగు చలన చిత్రసీమలో ఏ హీరో గొప్పవాడో తేల్చుకోడానికి హోరాహోరీ వాదించు కుంటున్నారు. వారి ముందు సీట్లో యువకుడు తన భార్యతో ఏదో గొణుగుతున్నట్లు మాట్లాడుతూ మధ్యమధ్య సిగరెట్ ఊదుతున్నాడు, 'పొగ తాగరాదు' అన్న నోటీసు దిగాలుపడి చూస్తోంటే. భుజంగ రాయుడుగారు నా మీదుగా దూరంగా చీకట్లోకి చూస్తూ మళ్లీ హఠాత్తుగా మాట్లాడటం మొదలు పెట్టారు. ఆయన కంఠంలో గాంభీర్యం ఆవేదన నన్ను ఆకర్షితుణ్ణి చేశాయి.


'మన ఇంటిని మరొకడు పాలించినంత కాలం మనకు స్వాతంత్ర్యం లేదని ఏడ్చాము. అహింసా కవచంలో ఇమిడి తరువాత ఎన్నో కష్టాల ఫలితంగా స్వేచ్ఛను సాధించాము. కానీ, బాబూ ! ఇవాళ మనకున్న స్వేచ్ఛ ఎందుకు ఉపయోగ పడుతోందో తెలుసా ? మన ఇంటిని మనం దోచుకోడానికి; మన వాళ్లకు తిండీగుడ్డా తగినంత దొరక్కుండా చేయడానికి; కొందరు మస్తుగా తిని త్రాగుతున్న తరుణంలో ఎందరో పస్తులుండడానికి !

సలభై ఏడుకి ముందున్న నిజాయితీ మనలో ఇవాళ ఎందుకు లేదు? ఆనాటి మన ఐక్యత యుద్ధసమయాల్లో తప్ప కన్పించదేం ? నేనూ నా కుటుంబం అనే వారే తప్ప నేనూ నా దేశం అనేవారు నేడు మృగ్యం.

దీనికంతకూ నాకు ఒకే కారణం కన్పిస్తుంది. అదే, మనలో జీర్ణించుకుపోయిన అవినీతి ! ఇవాళ మనమంతా అవినీతి ప్రవాహంలో దిక్కు తెలియకుండా కొట్టుకు పోతున్నాం బాబూ ! ఎన్నికల్లో పోటీ చెయ్యాలంటే పార్టీ టికెట్టు మంచి వాడికి దొరకదు; అవినీతి మార్గాలద్వారానే రావాలి. ఇక ఎన్నికల్లో గెలిచేవారెందరో నోటిచ్చి ఓటు కొంటున్న సంగతి రహస్యం మాత్రం కాదు. మన జీవితంలో సకల హక్కులూ ఆ ఓటుతో బాటుగా అమ్ముకొంటున్నాం మనము. అంతెందుకు ? ఇల్లు కట్టాలంటే మునిసిపల్ పర్మిషన్ కావాలి కదా ! అది లంచంలేకుండా, సిఫార్సు లేకుండా ఓ నెలలోగా నీవు తీసుకురాగలిగితే నాచెవి కోసుకుంటాను. పెద్ద ఆఫీసర్లకు బార్‌లో అభిషేకం చేయనిదే, బల్ల క్రింద చేతికి కట్టలు అందించనిదే నీకు ఏ కాంట్రాక్టు వచ్చినా నేను నా చర్మంతో నీకూ ఆ ఆఫీసర్‌కీ చెప్పులు కుట్టి ఇస్తాను. వైద్య డాక్టరు దయ తలచనిదే బీదవాళ్ళకి జనరల్ హాస్పిటల్‌లో బెడ్ దొరకడం గురించి నువ్వెప్పుడైనా విన్నావా? మనలో ప్రతివాడూ తను ఎవరినో మోసం చేస్తున్నా ననుకొంటున్నాడు. కానీ, మనను మనమే మోసం చేసుకొంటున్నాం అన్న నిజాన్ని మనమంతా విస్మరించాము ! మా రోజుల్లో బ్రతికిన నిజాయితీ నేడు దేశం పొలిమేరలు దాటింది.

ఒక్క విషయం బాబూ! మన దేశం—అంటే మనమంతా నేడున్న పతనపు తీరం వదలి ప్రగతి తీరం చేరాలంటే మధ్యనున్న భయంకర అవినీతి ప్రవాహాన్ని దాటాలి. దానికి వారధి అవసరం. ఆ వారధి కట్టడానికి ఒక్క గులకరాయి చాలదు; కోట్ల సంఖ్యలో కావాలి. అందులో ఎన్నో మునగటం కూడా తథ్యం. ఆ మునిగిన వాటి మీదనే వారధి నిలుస్తుంది! నేటి యువకులందరూ దేశాన్ని ఉద్ధరించడానికి అవినీతిని వదలి దీక్షతో నడుముకట్టాలి బాబూ! భారతీయులంతా నేడు ఆ గులకరాళ్ళు కావాలి ! అలా కానినాడు మేము నలభై ఏడుకి ముందు చేసిన త్యాగాలు నిరర్థకమౌతాయి.' ఆయన మాటల్లోని నైర్మల్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. దేశం నేడున్న పరిస్థితి గురించి నేనూ ఎన్నోసార్లు ఆలోచించి బాధ పడుతూంటాను; నా నన్నిహితుల్నీ, స్నేహితుల్నీ మంచి మార్గానికి మళ్లించడానికి తాపత్రయ పడటంలో నాకెంతో తృప్తి కనుపిస్తుంది...నాకు తెలియకుండానే ఆయన మీద నాకు పూజ్యభావం ఏర్పడింది, ప్రక్క నుండి ఆయన గంభీర కంఠస్వరం మళ్లీ విన్పించింది. ఆయన బయటకు చూస్తూ గాలిలోకి మాట్లాడుతున్నట్లు పలికారు...

'మనలో స్వార్థం పెరిగిపోయింది. మన జేబులు పెద్దవయ్యాయి. మనము తెలివి మీరాము...మచ్చుకి మన పిల్లల చదువుల సంగతే చూడు. రెండో తరగతి వాడికి ఇరవై రెండు పుస్తకాలు ! మేము చదివే రోజుల్లో ఫస్ట్ ఫారందాకా తెలుగుపుస్తకం, లెక్కల పుస్తకం తప్ప మరొకటి ఉండేది కాదు. ఇవాళ స్కూలుఫైనల్ పాసయిన వాడికి పట్టుమని పదెక్కాలూ ఇరవై దాకా సరిగ్గా రావు. తెలుగు పద్యాలు రెండైనా కంఠస్థం రావు. డిగ్రీ విద్యార్థు



లో చాలామంది వ్యాకరణబద్ధంగా సరైన వంక్తులు ఇంగ్లీషు వ్రాయలేరు.' అయన ఆగారు.

మా నాన్నగారు తమ స్కూలు ఫైనలు చదువుతో బి.కాం. చదివిన నాకంటె మంచి ఇంగ్లీషు వ్రాస్తారన్న సంగతి నాకు తెలియని విది కాదు. కానీ, తప్పంతా విద్యార్థుల మీదికే నెట్టడం నాకు నచ్చలేదు.

'నా ఉద్దేశ్యంలో అది వారి తప్పుకాదు. వారి కిచ్చిన శిక్షణ అలా వుంది. ఒక ఫారంలో ఎనభై పద్యాలుంటే అందులో యాభై మాత్రమే సిలబస్‌లో ఉంటాయి. వాటిలో పదింటికి పువ్వు గుర్తు ఉంటుంది! పరీక్షల దృష్ట్యా మాస్టరు అందులో రెండు చాలా ముఖ్యమంటాడు. మనవాళ్ళు అందులో ఒకటే చదువుతారు!' నా అభిప్రాయం వ్యక్తపరిచాను.

'నేను ఎవరి తప్పులూ విస్మరించడం లేదు. ఎవరి దృక్పథం వారికి సబబుగానే కన్పిస్తుంది. కాకపోతే, అందులో యెంత స్వార్థముందో నిష్పక్షికంగా ఎవరికి వారు తూచి చూడాలి. రెండవ తరగతి తెలుగు పుస్తకానికి కూడా గైడ్సు వ్రాశారు మన వాళ్ళు! మాస్టరు సరిగ్గా చెప్పి, విద్యార్థులు సరిగ్గా వింటే వీటి అవసరం ఎందుకుంటుంది? మన పిల్లల విద్యా ప్రమాణం ఇలా ఏడవడానికి కారణం ఈ గైడ్సే. వీటిని నిషేధించాలి. ఇవి వ్రాసేవారిని జైళ్ళలో పెట్టాలి. వారంతా దేశద్రోహులు...'

అంత పెద్దమనిషి అలా ఆవేశపడుతూంటే చూడ్డానికి తమాషాగా ఉంది. ఆయన నాకు కొంత 'క్రెడిట్' యిచ్చి మళ్ళీ సాగించారు తన వాక్ప్రవాహాన్ని.

'నువ్వు చెప్పింది కూడా నిజమేనే! ఇది ఏ ఒక్కరి తప్పూ కాదు. ఇందులో అందరికీ పాలుంది. గైడ్సు వ్రాస్తే డబ్బు వస్తుందని వ్రాసేవారికి తెలుసు; స్కూలు జీతం కట్టగానే పిల్లల చదువు బాధ్యత తాము పూర్తిగా నిర్వర్తించామని భావిస్తారు నేటి తల్లిదండ్రులు; పాఠాలు సరిగ్గా చెప్పినా చెప్పకపోయినా జీతాలు తమకు వస్తాయని ఎందరో ఉపాధ్యాయులకు నిర్దిష్టంగా తెలుసు; కాపీలు కొట్టినవారిని పాస్ చెయ్యడం తప్ప పరీక్షాధికారులు ఏమీ చెయ్యలేక పోతున్నారు. తాము చదవక పోయినా తమ తల్లిదండ్రులు డబ్బుతో

పిల్లలు-ఆరోగ్యము



అప్పుడే మరో పాప అవసరమా? ఆలోచించండి!

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వెంటవెంటనే పిల్లలు పుట్టడం అన్నది అటు తల్లి దేహస్థితికీ, ఇటు పిల్లల ఆరోగ్యానికీ కూడా మంచిదికాదు. కాబట్టి వెంట వెంటనే పిల్లలు పుట్టకుండా చూసుకోవడం, కనీసం ఒక బిడ్డకు మరో బిడ్డకు మధ్య మూడు సంవత్సరాలైనా తేడా ఉండేలా చూసుకోవడం, కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవడం అన్నవి దంపతుల ముఖ్య బాధ్యతలు.

అసలు కుటుంబ నియంత్రణ అంటే [illegible] బాగా చదువుకున్నవారిలో కూడా ఈనాటికీ చాలా మంది ఉన్నారు. కుటుంబాన్ని పరిమితం చేసుకోవడం అన్నది దంపతుల స్వవిషయమే. దానిని ఎవరూ కాదనరు. కానీ ఇప్పటి దేశ కాలపరిస్థితులను అనుసరించి వారి వారి ఆర్థిక స్తోమతని బట్టి కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవడం ఎంతైనా అవసరం.

వెంట వెంటనే పిల్లలు పుట్టడం తల్లి ఆరోగ్యం దెబ్బతింటుంది. పిల్లలు కూడా బలహీనంగా, అనారోగ్యంగా ఉంటారు.

ఎక్కువ మంది పిల్లల్ని కని, వారిని సరిగా పెంచలేక రోగాలతో, నొప్పులతో ఇతరత్రా వికారాలతో సతమతం కావడంకన్నా కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకుని పుట్టిన ఇద్దరు ముగ్గురు పిల్లలకే మంచి ఆహారం, చక్కని సౌకర్యాలు, తగిన వైద్య సహాయం సమకూరేలా చూసుకుంటే అంతకన్నా తల్లిదండ్రులకీ, పిల్లలకీ కావల్సిందేముంటుంది?

కుటుంబ నియంత్రణ ఉద్యోగుల్ని చూడగానే ముఖం చాటు చేసుకునేవారు, విసుగుని ప్రదర్శించేవారు ఎంతోమంది ఉన్నారు. కానీ వారేది చెప్పినా మన మంచికోసమేనని భావించేవారు చాలా తక్కువమంది, ఆచరించేవారు యింకా తక్కువ మంది ఉంటారు.

'పుట్టిన పిల్లలంతా బతికి బట్ట కడతారని నమ్మకం ఏముంది? కుటుంబాన్ని పరిమితం చేసుకుంటే అలాంటి అనుకోనిది ఏదైనా జరిగితే అప్పుడు మా గతేమిటి?' అనే వారు కొందరు ఉన్నారు. కాని పుట్టిన ప్రతి బిడ్డకు సరైన ఆహారం సమకూర్చి తరచు నిపుణుల చేత పరీక్ష చేయించి అవసరమైన సలహాలని సహాయాన్ని అందించి, అంటు వ్యాధులకు గురికాకుండా వారిని జాగ్రత్తగా కాపాడితే ఎలాంటి అవకతవకలు జరగకుండా నివారించవచ్చు. అదే ఎక్కువమంది పిల్లలు ఉంటే ఎంతోమంది తల్లిదండ్రులకి అలాంటి సౌకర్యాలు గగన కుసుమాలుగానే ఉంటాయి. అందువల్ల పిల్లల పోషణ విషయంలో నిర్లక్ష్యం జరుగుతుంది.

కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవాలంటే ఖచ్చితంగా ఆపరేషన్ చేయించుకోవాలనే నియమం ఏమీ లేదు. శస్త్ర చికిత్స అనే సరికి ఎంతోమంది విముఖత ప్రదర్శిస్తారు. దానివల్ల శరీరానికి ఏదో బాధ జరుగుతుందని చాలామంది అనుకుంటుంటారు. కానీ అలాంటివన్నీ పూర్తిగా నిరాధారాలు. శస్త్ర చికిత్సవల్ల ఆరోగ్యంలో ఎలాంటి మార్పూ రాదు. శస్త్ర చికిత్స అవసరం లేకుండానే కుటుంబాన్ని పరిమితం చేసుకోడానికి అనేక మార్గాలు ఉన్నాయి. కుటుంబంలోని పిల్లల సంఖ్య, తల్లి ఆరోగ్యం మొదలైన విషయాలపై అవి ఆధారపడి ఉంటాయి.

ఈ విషయంలో దంపతులిద్దరూ కలిసి నిపుణులైన వైద్యుల సలహా, సహాయాలని పొందాలి. వైద్యులు యిచ్చిన సలహాలని తప్పకుండా పాటించాలి.

మార్కులు కొనగలరనీ నేటి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా తెలుసు...

గురువులకు లేని శ్రద్ధ, క్రమశిక్షణ విద్యార్థులకెలా వస్తాయి? ఏ ఒకరిద్దరు మాస్టర్లో నిజాయితీ ప్రదర్శించి పిల్లల్ని బాగుచేద్దామనుకొంటే వారికి మిగిలేది నిరాశమాత్రమే. వారుమాత్రం ఏం చేస్తారు? ఒకప్పుడు ముప్ఫైమంది ఉండే క్లాసులో నేడు నూట ఇరవైమంది చేరారు. వీరిలో చాలామంది సరిగ్గా మాస్టారు కంటపడకుండానే సంవత్సరం గడిచిపోతుంది. నేటి పరిస్థితిలో 'గురుశిష్యుల' మధ్య వ్యక్తిగత సంబంధం అసాధ్యం! ఇవి ఇలా ఉండగా మన నాయకులు విద్యావిధానాలతో లెక్కలేని ప్రయోగాలు చేస్తున్నారు. ఇవాళ ఒక రెగ్యులేషను; రేపు ఉదయం ఇంకొకటి; రేపు సాయంత్రం మరొకటి. నేటి విద్యార్థులే రేపటి ఉపాధ్యాయులన్న విషయం జ్ఞప్తికొస్తే మాత్రం నాకు ఒళ్లు జలదరిస్తుంది!'

ఆయన చెప్పేమాటలు మనలో చాలామందికి తెలిసిన నిజాలే అయినా వాటిని వినడంలో ఏదో క్రొత్తదనం కన్పించింది నాకు. లాల్చీ జేబులోనుంచి తీసిన మల్లెపువ్వులాంటి రుమాలుతో ఎడమచేతిలో ఉన్న కళ్లజోడు తుడుచుకుంటూ నావైపు చూశారాయన.

'—మన నాయకులలో ఎవరైనా సరే నిరుద్యోగ సమస్యగురించి ప్రిపరేషన్ లేకుండా రెండుగంటలు ధాటీగా ఉపన్యాసం ఇవ్వగలరు. అంతకన్న వారు మాత్రం ఏం చేస్తారు? అగ్రికల్చర్ కాలేజీలో చదివి పాసయినవాడికి, తన స్వగ్రామంలో భూమి వగైరా ఉండికూడా సిటీలోనే ఉద్యోగం కావాలి. ఇంతమంది బి. ఇ. లు నిరుద్యోగులగానే ఉంటారు తప్ప ఏ గ్రామానికోపోయి చిన్నచిన్న పరిశ్రమలు మొదలుపెడదా మనుకోరు. నగరంలో డాక్టర్లు అదేవీధిలో ఆరోశాడిగా ఉంటారు కానీ, పల్లెసీమలవైపు కన్నెత్తి చూడరు. అన్ని ఉద్యోగాలూ సిటీలోనే కావాలంటే ఎలా వస్తాయి? మూడు పంచవర్ష ప్రణాళికలు, మూడు ఏకవర్ష యోజనలు మనము దాటాము. నాలుగవ పంచవర్ష ప్రణాళిక కూడా చివరికొస్తోంది.


ప్రతినిధి

కాగితాలమీద ఎంతో ఆశాజనకంగా కనుపించే ప్రణాళికలు ఆచరణలో ఎందుకంత అధ్వాన్నంగా తయారవుతాయి? ఎన్నో కోట్లు పెట్టుబడికి ఆశించినంత ప్రతిఫలం రావడంలేదు. కారణం మనలో ఉన్న తోడేళ్లగుంపులు!

హాస్పిటల్ గేటు మొదలు ఢిల్లీలో మంత్రుల కార్యాలయాలవరకూ లంచగొండితనం! హైస్కూల్లో సీటుదగ్గర నుండి హైకోర్టులో జడ్జిమెంటువరకూ కావలసినవి సిఫార్సులు! మనలో ఈ నైతిక పతనానికి కారణం ఏమిటి?'

ఒక్కక్షణం ఆగారాయన. చర్వితచరణంతో బాటు ఒకదాని కొకటి సంబంధం లేకుండా మాట్లాడటం ఆయనలో నేను గమనించిన మరో విశేషం. కానీ, ఆ మాటల్లో వ్యక్తమయ్యే ఆయన మనోవేదన నన్ను కరిగించక పోలేదు. బస్సులో చాలామంది మావైపే చూడటం నాకు కొద్దిగా ఇబ్బంది కలిగించింది. తన ప్రశ్నకు తనే జవాబు చెప్పుకున్నారు ఆయన.

'—ఆత్మ విమర్శలేక పోవడం; మన మీద మనకు విశ్వాసం సన్నగిలడం. సంస్కృతికంగా, ఆర్థికంగా, శాస్త్రీయముగా, సామాజికంగా మనకంటె చాలా దేశాలు ఉన్నతంగా ఉన్నాయంటే మనం తల వంచుకొంటున్నాము. తలవంచడం తేలిక, తలపైకెత్తి ఆత్మవిశ్వాసంతో దేశాన్ని ఉన్నతస్థానంలో ఉంచ ప్రయత్నించడం కష్టమే, ముఖ్యంగా మనదేశంలో."



ఆయన మాటలు నామీద బలమైన ప్రభావాన్ని చూపాయి. దేశంలోని అవినీతిని ఒక్కడిగా ఆపలేక, తాము చేసిన నాటి త్యాగాలు గుర్తుచేసుకొని బాధపడుతున్న ఆయన్ని చూస్తే జాలికూడా వేసింది.

'ఈయన ఎన్నికల్లో తప్పకుండా గెలవాలి. ఇటువంటి వారిసంఖ్య నాయకులలో ఎంత పెరిగితే దేశం అంత బాగుపడుతుంది. భగవాన్! ఈయన ఎన్నికల్లో గెలిచేటట్లు చెయ్యి' మనసారా కోరుకున్నాను.

దూరంగా విద్యుద్దీపాల వెలుగు కన్పించింది. ముందుసీట్లో ఇద్దరూ తను వాదాన్ని ఎప్పుడు ఆపారో, చెరొక 'శవసాహిత్యం' పుస్తకాన్ని పట్టుకొని దీక్షగా చదువుతున్నారు.

వారి ముందు సీట్లో యువకుడు తన భార్య భుజంమీద వాలి నిద్ర పోతున్నాడు. ఆమె కిటికీకి తల ఆన్చి దూరంగా చూస్తోంది. వెనుక ఎవరో ఈ ఏడు పంటల గురించి మాట్లాడుతున్నారు. కండక్టరు పంచీ ఒళ్లో పెట్టుకొని డబ్బు లెక్కపెట్టుకొంటున్నాడు.

బస్సు నగరం పొలిమేరల్లోకి వచ్చేసింది.

కండక్టరు నవ్వుతూ మా సీటు దగ్గర కొచ్చాడు. భుజంగరాయుడిగారి ఖద్దరు లాల్చీలో నుండి బరువైన పర్సు బయటికొచ్చింది. పెద్ద నోట్లు కన్ను గీటాయి.

కండక్టరుకు రెండు రూపాయలు ముట్టాయి!

నాకు బుర్ర తిరిగిపోయింది. అర్థంకానట్లు ఆయన ముఖంలోకి చూశాను.


ఆయన నవ్వారు. కండక్టరు నవ్వాడు. వాళ్ళిద్దరి నవ్వులో నాకు దేశంలోని కుళ్ళంతా కన్పించింది!

డిపో మరో రెండు ఫర్లాంగులు ఉండగా ఆయన కోసం స్పెషల్‌గా బస్సు ఆగింది.

'వస్తాను బాబూ' అంటూ బస్సు దిగి జనంలో కలిసిపోయారు కాబోయే ప్రజాప్రతినిధి!

ఏడుస్తూ మళ్లీ కదిలింది బస్సు.

మహిళలు – ఉద్యోగాలు – అర్హతలు



ముట్నూరి సంజీవమ్మ


పై విషయంపై వివిధరకాల అభిప్రాయాలు ఎందరో వెలిబుచ్చి వున్నారు. స్త్రీకి వుద్యోగం అవసరమా? కాదా? అనే విషయం పరిశీలనకు తీసుకొంటే చాలావరకూ అనవసరమే అని తేలుతుంది. మనదేశంలో నిరుద్యోగ సమస్య చాలా తీవ్రరూపం దాలుస్తున్నది. ఈ నిరుద్యోగుల్లో మూడువంతులు పురుషులే వుంటున్నారు. ఎన్ని అర్హతలున్నా మగవారికి ఉద్యోగం దొరకటం గగనమైపోతున్నది. అదే అర్హతలున్న ఆడవారికి సులభంగా ఉద్యోగాలు దొరికేస్తున్నాయి. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళల్లో చాలవరకు ఊసుపోక చేసేవారూ, చదివిన చదువు వృథా కారాదని చేసేవారూ, చీరలూ, సినిమాలకోసమే చేస్తున్నవారూ మెండుగా కనిపిస్తారు. ఒక స్త్రీ చేసే వుద్యోగమే ఒక పురుషుడు చేస్తే ఆ రాబడితో నతడొక కుటుంబాన్ని పోషిస్తాడు. కాని ఆడవారికా రాబడి వారి పై ఖర్చులకే సరిపోతుంది. దీనినిబట్టి ఒక పురుషునికి జీవన్మరణ సమస్యగా పరిణమించే ఉద్యోగం స్త్రీకి కేవలం విలాసానికీ కాలక్షేపానికీ పనికివచ్చేదిగా మారిపోతుంది.

స్త్రీలకు ఉద్యోగాలు అసలే అనవసరమనటంలేదు. ఉద్యోగం యిచ్చేటప్పుడు ఆ స్త్రీకి ఆ వుద్యోగం ఎంతవరకు అవసరం? అని తెలుసుకొని యివ్వాలి. ప్రతి దరఖాస్తు ఫారంలోనూ వారి ఆర్థిక పరిస్థితులనూ, కుటుంబ పరిస్థితులనూ పరిశీలించి మరీ యివ్వాలి. భర్త లేని వితంతువులకూ, కారణాంతరాలవల్ల భర్తచే త్యజింపబడిన వనితలకూ, పెళ్ళయ్యే అవకాశాలు లేని మధ్యతరగతి యువతులకూ, పెళ్ళయ్యీ చాలని భర్త సంపాదనతో సంసారాలను నెట్టుకురాలేని మహిళలకూ, ఉద్యోగం చాలా అవసరం. వీరికి ఉద్యోగాలు చేసే అర్హతలలో కొన్ని లోపించినా, పాటించకుండా వెంటనే యివ్వాలి.

ఉద్యోగాలుచేసే మహిళలలో వివిధరకాలున్నారు. గెజిటెడ్ ఆఫీసర్ల భార్యలుకూడ పరపతికోసం ఉద్యోగాలు చేస్తున్నారు. సంపన్న కుటుంబాలలోని వనితలు పేరు ప్రతిష్ఠలకోసం, ఆడంబరంకొరకూ ఉద్యోగాలు చేస్తారు. భర్త సంపాదనతో పొదుపుగా, నిరాడంబరంగా బ్రతకగలిగివుండి కూడ తమ జీవనప్రమాణం (స్టాండర్డ్ ఆఫ్ లివింగ్) పెంచుకోవటానికై వుద్యోగాలపై ఆధారపడుతున్నారు.

కేవలం కాలక్షేపానికి మాత్రమేననుకుంటే గెజిటెడ్ ఆఫీసర్ల భార్యలు, సంపన్న గృహిణులు ఆనరరీ ఉద్యోగాలు చేయవచ్చు. పెట్టుబడికి బాగా డబ్బు వుంటుంది గనుక పూసలతో, ప్లాస్టిక్ వైరులతో చేసే వ్యానిటీ బ్యాగులూ, బుట్టలూ, సంచులూ, ఊలుతో స్వెట్టర్లూ అల్లి తక్కువ ధరకు విక్రయించవచ్చు. ఎంబ్రాయిడరీ, పెయింటింగు, బొమ్మలు చేయటం లాంటి లలితకళలను అభ్యసించి యితరులకు నేర్పవచ్చు. కొందరు లెక్చరర్ల భార్యలు కూడ లెక్చరర్లుగానో, ట్యూటర్లుగనో పని చేస్తారు. తమకంటె ఎక్కువ అవసరం వున్నవారికొరకై ఆ వుద్యోగాలను వీరు త్యాగంచేసి, తమ భర్తల దగ్గరకు ట్యూషన్లకు వచ్చే విద్యార్థులకు తామే చదువు చెప్పవచ్చు. తద్వారా తమ భర్తలకు కొంత విశ్రాంతి కల్గించిన వారౌతారు గదా!

సంపన్న వనితలు తమ చుట్టూ ఒక పరిధి ఏర్పరచుకోకుండా, మధ్య తరగతి, క్రింది తరగతి మహిళలతో మసలుతూ, వారి సమస్యల పరిష్కారాలకు తోడ్పడేందుకు తమ విద్యను వినియోగించాలి. ప్రతి పేటలోను ఒక మహిళామండలి స్థాపించి, అందులో వొక గ్రంథాలయం, చేతి పనులూ, లలితకళలూ ఉచితంగా నేర్పే సదుపాయాలూ కల్పించాలి. పాశ్చాత్య దేశాల్లో సంపన్న గృహిణులు ఉద్యోగాల కోసం ప్రాకులాడరు. సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో రకాలుగా సంఘసేవ చేస్తారు. ఏపనినీ కూడ వారు తమ అంతస్తుకు తగదని భావించరు. లేడీ రూజ్‌వెల్టు ప్రజలకు సన్నిహితం కావటానికై ఎన్నో వ్యాపకాలు కల్పించుకునేదట. విశ్వకల్యాణానికై నిస్వార్థసేవ చేసిన ఉత్తమ వనితలు కోకొల్లలు. మన దేశంలో కూడ దుర్గాబాయి దేశముఖ్ వంటి ఆదర్శ మహిళలు సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలూ కృషిచేస్తున్నారు. కాని వీరి సంఖ్య బహుస్వల్పమైనది. ఉన్నత స్థితులలో వున్న మహిళలందరూ ఉద్యోగాల కోసం ఉరకలు వేయకుండా, సంఘసేవ వైపు తమ దృష్టిని మళ్ళించాలి.



జరిగిన కథ

ఒక వ్యక్తిమీద అనేక అభిప్రాయాలు వున్నట్టే — ఆ ఆస్పత్రిమీద కూడా అనేకానేక మంచీ — చెడూ అభిప్రాయాలున్నాయి. సూర్యానికి ఆ ఆసుపత్రి అంటే ఒకరకమైన భయం. తీరా అతను కూడా అందులోనే చేరాల్సి వచ్చింది. ఆ వార్డులో ఇంకా శెట్టిగారు, శ్రీనివాసు వున్నారు. ఆసుపత్రిలో చేరాక సూర్యానికి గత మంతా కళ్ళముందు కదలింది. అతను యవ్వనంలో ప్రవేశించగానే మొట్ట మొదటిసారిగా విశాలాక్షి మీదకి మనసు పోయింది. ఇదంతా జ్ఞాపకం వచ్చి కాస్సేపు ఆ వాతావరణాన్ని మరచిపోయాడు. విశాల శ్రీనివాస్ భార్య అని తెలుసుకున్న సూర్యం తన గమ్యాన్ని నిర్ణయించుకుంటాడు. శెట్టిగారు పదివేలు రొక్కం, తన దగ్గర వున్న రామం బాధ్యత సూర్యంకు అప్పచెపుతారు. విశాల బాధ్యతని సూర్యానికి అప్పగిస్తాడు శ్రీనివాస్. విశాల తన కోసమే జీవిస్తున్నట్టుగా విని ఆశ్చర్యపోయాడు సూర్యం. అతను విశాల కోరుకున్నంత దగ్గరగా రాలేకపోతున్నాడు.

16

వెళ్ళలేక వెళ్ళలేక ఢిల్లీ వెళ్ళాడు. ఒక సారి బదిలీ ఆర్డర్లు వచ్చాక అవి రద్దు పరచమనటం భావ్యం కాదని బలవంతాన కదిలాడు. ఢిల్లీ వెళ్ళాక మళ్ళీ తిరిగి రావా లన్న తలపు రోజూ వేధించేది. ఎక్కడ తిరిగినా యేది చూసినా విశాల తనతో వుంటే యెంత బావుండేదనిపించేది. అలా అనుకుంటూనే ఆమె మీద కోపంతో కూడ మనసు మండిపడేది. ఆమె వుత్తరం రాస్తుం దని యెదురు చూశాడు. ఆ వుత్తరంలో తియ్యని ప్రేమ కవిత్వం, గంభీరంగా అగ పడుతుందని కాంక్షించాడు. ఆమె హృదయం విప్పి వుత్తరంలో పెడుతుందని ఆశించాడు. ఈ కాంక్షలూ ఆశలూ తీర్చుకోక పోగానే ఆమెపై కోపం కలగసాగింది. మంచి చెడ్డలు రామం రాస్తున్నాడు గానీ విశాల రాయటం లేదు. విశాలను వుత్తరంలో నైనా చూడాలని వేగిపోతున్న మనసు వెర్రి ఆలోచనలకు లోనైంది.

మనసులో అదొక విధమైన వేదాంతం అల్లుకుంది. లోకంలో మనిషి నటించే చివరి అంకం చావు అయినప్పుడు మానవ జీవితం ఒక ట్రాజడీయే అనుకున్నాడు. ఎన్ని ఆశలు, ప్రేమానురాగాలు, బంధాలు పెట్టుకున్నా అవి చివరి క్షణంలో తెగి పోతాయి. ఇన్ని ఆశలతో అభిమానాలతో కట్టిన మేడలు కూలిపోతాయి. మిగిలింది మట్టి. అలాంటప్పుడు కనిపించే మనోహర మైన వాటికోసం, క్షణికమైన అనుభూ తుల కోసం అర్రులు చాచట మంత తెలివితక్కువ తనం యింకొకటి లేదు. ఈ తాత్కాలికమైనవి కాకుండా మనిషి సాధించవలసిన శాశ్వతమైనదేమైనా వుందా అన్న జిజ్ఞాస అతనిలో చొచ్చుకుంది. నల్లమేఘాలు రాపాడటం వలన మెరుపెలా వుద్భవిస్తుందో మనిషి అజ్ఞానాన్ని రాపాడించటం వలన జ్ఞానోదయం కలుగుతుంది. చీకటిలోనికి వెలుగు ఎలా చొచ్చుకుంటుందో మనసులోనికి ఆత్మ అలా చొచ్చుకుంటుంది. అలా ఆత్మ చొచ్చు కునేటట్లు చేసే ప్రజ్ఞ సామాన్యమైనది కాదు. ఆ ప్రజ్ఞనే తపస్సుగా పెద్దలు చెప్పారు. ఆ తపస్సు తనెందుకు చెయ్యకూడదు ?

ఒకమఠంకు వెళ్ళాడు. మూడు నాలుగు సార్లు గురూజీ చెప్పిన వుపన్యాసాలు విన్నాడు. అతను చెప్పినదానిలో తనకేమీ క్రొత్త కనిపించలేదు. ధ్యానం ముఖ్య మంటాడు. ఇంటికివచ్చి భగవద్గీత పట్టు కుని అక్కడక్కడ తిప్పితే—

'ఎవడు దేనిని ద్వేషించడో
ఎవడు దేనిని కోరడో
అతడు నిత్యసన్యాసి అని నమ్ము
ఏమంటే సుఖదుఃఖాలు
మొదలైన ద్వంద్వాలనించి
వేరైనవాడు అనాయసంగానే
బంధాలు వొదుల్చుకుంటాడు.

విశాలకూ తనకూ బంధాలు వదలా లంటే ఆమెను ద్వేషించకుండా వుండాలి, కోరకండా వుండాలి. ఇదేదీ చెయ్యన్నాడు తను బ్రహ్మభావం పొందలేడు. ప్రసన్న చిత్తుడు కాలేడు. సమస్త ప్రాణుల్నీ సమంగా చూడలేడు. భక్తిలేనిది దేముడు యెవడో యెంతటివాడో తెలుసుకోలేడు.

ఒకవస్తాదు ఎదుటి వస్తాదు బలం తన బలంతోనే తెలుసుకుంటాడు. అది పోరాటంవలన తెలుస్తుంది. మనసనే వస్తాదు ఆత్మ అనే యింకో వస్తాదు బలం తెలుసుకోవాలంటే యీ రెండింటి పోరాటం మనిషిలో జరగాలి. మనసు

అహంతో నిండ తొడలు చరచి మొరదుగా పోరాటానికి పిలుస్తుంది. అలా పిలవగల మనస్సే వేగం ఆత్మకు లొంగిపోతుంది. ఇంకోసారి 'ధర్మసంస్థాపనకోసం యుగ యుగానికి అవతరిస్తానని' దేవుడు చెప్పటం చదివాడు. • ఒకవ్యక్తి యెల్లవేళలయందు ఒకేవిధంగా పోడు. ఈనాడు ధర్మంగాపోయిన వ్యక్తి యింకోనాడు పరిసరాల ప్రభావంవలన అన్యాయానికి దారితీయవచ్చు. అలాంటప్పుడే ఒక వ్యక్తిలో ధర్మం మళ్ళీ స్థాపించడానికి దేవుడు ఆత్మరూపంలో వెలుగుతాడు. ఆ ఆత్మ వెలుగు పడనిది మనసులో ఒక మంచి ఆలోచన, తిరిగి మారాలన్న ఆతృత కలగదు.

'మనసు చంచలమైనది
నిగ్రహించడానికి సాధ్యంకానిదే
సందేహంలేదు. కానీ
అభ్యాసంవలన, వైరాగ్యంవలన
దానిని స్వాధీనం చేసుకోవచ్చు.'

భగవద్గీతలో మళ్ళీ యిది చదివి తన చంచలమైన మనస్సును స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు మనసు అంత సులువుగా స్వాధీనం కాకపోడానికి కారణ మేటిలేని తలోవిరిచేకోతగు. నేను అన్న అహంతో నిండి పరుగెత్తే పందెపు గుర్రంలాంటిది మనసు. ఆ గుర్రం కళ్ళెలు మనసుయొక్క కోరికలైతే అవి లాగి విడిచి పెట్టటంవలన వచ్చే వుద్రేకంలోనే మనిషి ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆ ఆనందం వదులుకోవటం అంత సులువైనది కాదు.

'నేనే చేస్తున్నాను' అనేభావం యెవడికి లేదో వాడు యీ లోకంలోని ప్రాణులందరిని చంపినా చంపనట్టే లెక్క. ఆ హత్యాకర్మకి అతడు బద్ధుడుకాడు' అని చెప్పిన శ్రీ కృష్ణభగవానుడు అక్కడక్కడ తన దర్శనం యిలా యిచ్చాడు.

'ఈ చరాచరమైన భూతకోటిలో నేను లేనిది యేదీ లేదు. నాదివ్యవిభూతులకి అంతం లేదు. నా ఒక్క అంశతోనే నేను జగత్తంతా వ్యాపించి వున్నాను. నేనే అధ్యక్షుణ్ణి; నాతోనే ప్రకృతి యీ చరాచర సృష్టినంతా కంటున్నది. భూతకోటి కంతటికీ నేనే నియంతని.

ఈ జగత్తుకు నేనే తండ్రిని నేనే తల్లిని, దాతని తాతని, నన్నేభజించు, నన్నే వుపాసించు, నన్నే నమస్కరించు."

ఈ దైవాంశనించి వుద్భవించిన మనిషి దేవునియొక్క 'నేను'ను కూడా పొందాడని సూర్యం అనుకున్నాడు. ఆ అహం లేకపోతే తను లేడు. తనుచేసిన యే పని 'నేను చేస్తున్నాననే చేస్తున్నాడు.' నావలనే మాయింటికి పేరు వచ్చింది. నానుంచి నా తలిదండ్రులు గర్విస్తున్నారు. నేనే నా తమ్ముళ్ళా చెల్లెళ్ళ బాగు చూస్తున్నాను. నేను అందగాడ్ని, నేను లేకపోతే విశాల బ్రతుకు యేమయ్యేది'— ఈ నేనును మనిషి విడిచిపెట్టే చర్మంలేని మనిషిగా రూపొందుతాడేమోనని సూర్యంకు తట్టింది.

దేవుడు నిత్యం వెలిగే సూర్యుడైతే ఆ సూర్యుని అంశయైన భూమిలాంటి వాడు మనిషి. భూమి సూర్యునిచుట్టూ ప్రదక్షిణ చేసినట్టే మనిషి దేవునిచుట్టూ ప్రదక్షిణ చేస్తాడు. భూమి సూర్యుని వేడీ, వెలుగూ కొంత నిలుపుకున్నా సూర్యుడు కాలేదు. అలాగే మనిషి దేముని అంశ వున్నా దేవుడు కాలేడు. సూర్యుడు నిత్యం మండి శక్తిని విరజిమ్ముతాడు.



ఆశక్తి వెలుగై భూమిమీద పడి చరాచర జీవులకు ప్రాణం యిస్తుంది. యీ ప్రేమాభిమానాలు, బంధాలు, కోరికలూ, ఆశలూ, సుఖసంతోషాలు, అనురాగాలు ఆశయాలూ — యివన్నీ యీ మనిషనే భూమ్మీద వచ్చుని అడవులు మంచుతో కప్పిన కొండలు, వుద్యానవనాలూ, సెలయేరులు లాంటివి. ఇవి లేకపోతే భూమికి అందంలేదు. ఈ ప్రేమలూ ఆశలూ వగైరా లేకపోతే మనిషికి అందం లేదు. ఆ పచ్చదనం సూర్యుని శక్తివలన యెలా విర్చిందో యీ ప్రేమానురాగాలు దేవుని ఆశీర్వాదంవలన మనిషికి అబ్బాయి. అంచేత యివి వదలుకోవటం భావ్యంకాదు. అనుభవించటంలోనే తృప్తి వస్తుంది. అవి సృష్టించినవానికి ఆనందాన్ని కలుగజేస్తుంది.

సూర్యం యిలా యెన్నెన్నో తర్జన భర్జనలు చేసుకున్నాడు. తన తలపులను వున్నేశాలు సమర్థించుకోడానికి మనస్సును మధిస్తున్నాడు. సముద్రపు లోతులు, హిమగిరి శిఖరాలు, గంగాప్రవాహం, పొలాల పచ్చదనం, పూలపరిమళాలు, పళ్ళ తోటల కమ్మపువంటతోపాటు అతని మనసులో అగ్నిపర్వతాలు, తుఫానులు, బాంబుల వర్షాలు, భీకరయుద్ధాలు, రక్తపుటేరులు కూడా కదలిపోతున్నయ్. ప్రశాంత చిత్తంకోసం అతని ప్రాకులాట తగ్గలేదు. తన అన్వేషణ నిత్యం జరుగుతునే వుంది. తనలో తనే కాకండా యెదుటి వారిలో కూడా తను నివశించాలన్న కోర్కె బలీయం కాసాగింది. పదిమందిలో నివశించగలిగినవాడు దేవునివేపే ప్రయాణం చేస్తుంటాడు. దేవుడు అన్ని ప్రాణులయందు వున్నాడు, దేవునిబిడ్డ మనిషి యెంత హెచ్చుమంది ప్రాణుల మనసులో భక్తిభావంతో మెసలుతాడో వాడే దేవునికి దగ్గరదగ్గరగా పోతుంటాడు. ఈ చక్రంలో నిల్చున్న యిన్ని ప్రాణులు ఒకదగ్గర దైవాంశ పొంది, పుట్టి ఆ చక్రంచుట్టూ తిరిగి మళ్లీ ఆ వెలుగు దగ్గరకే చేరటానికి ప్రయత్నిస్తాయ్. కొందరు మెల్లిగా నడుస్తారు. మరికొందరు పరుగెత్తి పోతారు. అలా పరుగెత్తేవాళ్ళు యెందరినో మానసికంగా జయించి పోవాలి. మానసికంగా జయించటమంటే వాళ్ళ మనసుల్లో గొప్పగా నిల్చిపోవాలి, అలాంటి

నాలుగు మంచాలు

వాడే అడ్డంకులు లేకుండా పోతుంటాడు. అదే తనధ్యేయం అనుకున్నాడు సూర్యం.

'ధ్యేయం నిర్ణయించుకున్నంత మాత్రాన అనుసరించటం అంత సులువు కాదు. ఏకాగ్రతకోసం ప్రాకులాడాడు. తనకుతానే గురువు కాలేక పోయాడు. వేదాంతగ్రంథాలు చదివాడు. అవి చెప్పిన వేదాంతులను గురువులుగా భావించటానికి ప్రయత్నించాడు. విశాలను యిప్పుడు వూహించినట్లే వాళ్లను వూహించుకుని వాళ్ళ మేధస్సులను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. విశాల యెదరగా పొందిన వుత్తేజం ఆమెను తలచుకోగా రాదు. గురువుకోసం వెదుకుతూ దేవప్రయోగ వెళ్లాడు. ఇంకా కొన్ని స్థలాలు వుత్తరాదిని చూసాడు. భూమి యింత అందంగా రూపొందడానికి యెన్ని పరిణామాలు చెందిందో? అన్ని పరిణామాలూ చెంది మనిషి యిప్పటివాడయ్యాడు. ఆ పరిణామం చెందిన మనస్సుతో ప్రకృతిలోని ప్రతి పాటలోని రాగాలను వినగలుగుతున్నాడు, ప్రతి అందంలో ఆనందాన్ని పొందగలుగుతున్నాడు.

హిమాలయాలపై సూర్యోదయం, నీలి నీటిపై వుదయకాంతులు, పచ్చని చెరియలపై వెన్నెల ఆ వెన్నెలరేడు సామంతుడనే వూహ రాగానే తనలో పొందే నిస్పృహ. ఆధారపడటమనే తత్వం భూమినిబట్టే మనిషికి వచ్చింది. ఆ తత్వాన్ని తను వదలాలంటే తనో సూర్యుడు కావాలి? స్వయం ప్రకాశం రావాలి. ఆత్మ వెలగాలి. వెలిగించడానికి ఏం చెయ్యాలి?

'సంకల్పంవల్ల పుట్టే కోర్కెలు యావత్తూ పూర్తిగా వొదిలిపెట్టాలి.

ఇంద్రియాలన్నిటినీ, అన్ని దిక్కులనించీ మనస్సుతో మళ్ళించాలి.

ధైర్యం చిక్కబట్టిన బుద్ధితో మెల్ల మెల్లగా శాంతి పొందాలి.

ఆత్మలోనే మనస్సు కుదుటపర్చుకుని ఏ విచారమూ మనసులోనికి రానివ్వకండా వుండాలి. నిలకడ లేని మనసును ఆత్మవశం చెయ్యాలి'

ఈ ధ్యానయోగం ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆది శంకరులు కూడా ఆత్మగురించే చెప్పారు: 'ఆత్మ తప్పించి యింకెవ్వరు యీ అజ్ఞానం, కామం, స్వలాభంతో చేసే కార్యాల బంధాల నుంచి విముక్తి చెయ్యగలరు?'

ఆత్మ అంటే యేమిటి? అతనే నిర్వచించారు.

'ఆత్మ మనసుకు అది చేసే కార్యాలకు సాక్షి. అది పరిపూర్ణమైన జ్ఞానం. మనిషి అజ్ఞానంవలన ఆత్మపరంకాని యీ శరీరం, అహం, యింద్రియాలతో తన్ను పోల్చుకుంటాడు. ఆత్మపై భక్తిచూపించి తెలివైనవాడు యీ అజ్ఞానంనించి బయటకు వస్తాడు.'

ఆత్మపై భక్తిచూపించటానికి ఆ పరిపూర్ణ జ్ఞానం సంపాదించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. కళ్ళు మూసుకుని కొద్ది నిముషాలపాటు తన్ను మరచిపోవటం నేర్చుకుంటున్నాడు. కాలానికీ మనసుకు సంబంధం. ఆత్మకు కాలంతో సంబంధం లేదు. మనసుకు సరిహద్దులుంటాయి. ఆత్మ సరిహద్దులెరగని ఆకాశంలాంటిది. కాలంతో సంకెళ్ళు వేసుకుని సరిహద్దుల్లో నివశించే మనిషి ఆత్మపరం కావాలంటే అంత సులువు కాదు. రెక్కలతో ఎగిరిపోయే పక్షికూడా భూమిమీద యెప్పుడో ఒకసారి వాలకండా వుండలేదు. అంతరిక్ష నావలో ప్రయాణం చేసిన మనిషి భూమిమీదకు యెప్పుడు తిరిగి వస్తానా అని కోరుకుంటారు. కారణం — మన్నుతో ప్రాణులకున్న సంబంధం. శరీరం మన్ను — ఆత్మ ప్రాణం. ప్రతి ప్రాణిలో ఆత్మ లేకపోతే కదల్లేదు. ఈ ఆత్మ యీ రోజు పక్షిలో వుంటే ఆ పక్షి చావగానే యింకో మనిషిలో వుండవచ్చు. చావులేని ఆత్మను అందుకోవాలన్న ప్రయత్నంలోనే మనిషి ముందుకు పరుగెత్తాడు. ఎప్పుడైతే అందుకో గలిగాడో అతనికి ఆకారం వుండదు. అతను ఆత్మ వెలుగులో ఐక్యమైపోతాడు.


ఆత్మజ్ఞానంపై ఒక ఆవేశంతోకూడిన అభిలాష సూర్యంకు పట్టుకుంది. ఇది ఒక విద్య అనుకుంటే గురువులేని విద్యలానే తనకు పట్టుబడింది. బాట తెలుసుకోలేని అడవిలో తను వెళ్తున్నట్లున్నాడు. ఒకసారి ధ్యాననిష్ఠ, యింకోసారి వైరాగ్యం, మరోసారి యోగాభ్యాసం — ఒక్కతోవకాదు. వేరువేరు తోవల్లో పడ్తూ యే తోవనూ


విజయ్ అమృతరాజ్, ఇండియా డేవిస్ కప్ ఆటగారు — దేహదారుఢ్యాన్ని కాపాడుకోడానికి ఫిలిప్స్ సైకిలు త్రొక్కుతారు

టెన్నిస్ మ్యాచ్‌లో, అమృతరాజ్ రిటర్న్స్ శీఘ్రము, నిశ్చితము. టెన్నిస్ కోర్టులో అతడి శౌర్యం, పౌరుషం కూడా సుసంపన్నమైన దేహ సౌష్ఠవంమీద ఆధారపడి ఉన్నాయని అతడికి తెలుసు. అందంగా నిష్పన్నంగా ఉండడానికి ఫిలిప్స్ ప్రతిదినం అతడు త్రొక్కుతూనేవుంటాడు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఫిలిప్స్ సైకిల్ ఉత్సాహవంతులైన యువకులకు సైకిలు. దానికి మంచి రూపం ఇది అతిమృదువుగా సునాయాసంగా తిరుగుతుంది

మా ఫిలిప్స్ రకాలు:

ఫిలిప్స్ ఒలింపియా (సూపర్బ్ మోడల్)
ఫిలిప్స్ లేడీస్ మోడల్
ఫిలిప్స్ ఉత్సాహవంతులైన యువకులకు





ఇండియాలో తయారీ.
టిఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా
అంబత్తూరు, మద్రాసు-53.
ప్రొప్రైటర్లు:
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
మద్రాసు
● ఉపయోగించుటకు రిజిష్టరు కావింపబడినవారు.

TICPH-7038

నమ్మేపరిస్థితిలో లేడు. కాని మనస్సులో కోర్కెలు అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నం జరుగుతోంది. అలా పెట్టుకునే అవసరం యేమొచ్చిందన్న ప్రశ్నలు కూడా వుదయించకపోలేదు. అతను యింకా సంసారి కావాలా సన్యాసి కావాలా అన్న సందేహాన్ని తీర్చుకునే పరిస్థితిలో లేడు. అందరిలో తన ప్రతిబింబాలు చూడాలిగానీ తనలో అందరి ప్రతిబింబాలు యిముడ్చుకునే సహనం లేదు. ప్రేమబాటన్నే పరుగెత్తే శక్తి అతనికింకా రాలేదు. ఆ శక్తిగలవాడే త్యాగానికి సిద్ధం కాగలడు. పరిస్థితుల ముందు పలాయనత్వం సాగించే మనిషి దేవుని ముందు నిల్చొని 'నిన్నొకటి అడగటానికి వచ్చాను. నీలో కలిసిపోయే వరం యివ్వు' అని అడిగే ధైర్యాన్ని పొందలేదు. అందరినీ ఒకే దృష్టితో చూచి ఒకే ఆత్మను చూడగలిగే అభ్యాసం తనకింకా రాలేదు. ప్రాపంచిక సుఖాలు, వస్తువుల మీదనించి దృష్టి మరల్చే సాహసం తను అలవరచుకోలేదు. బ్రహ్మాండమైన తపస్సుచేసే స్థిమిత నింకా పొందలేదు. అతనిలో సందేహాలకు కొదవ లేదు. అందుకే మనసులో యేకాగ్రత లేదు.

ఈ యేకాగ్రత, స్థిమిత వగైరా అన్నీ తనకు లేవన్న వూహ అతనినించి పోలేదు. తన లోటుపాట్లేవో తెలుసుకోగలిగే జ్ఞానం గల మనిషి ఆత్మవేపు ప్రయాణం చేస్తుంటాడన్న నమ్మకం అతనికి కలిగింది. ఒంటికి యేలికలు పెట్టేకన్నాల్లా మనిషికి కోరికలు కన్నాలు వేస్తాయి. ఇవి వున్నాయని తెలుసుకుని ఆ కన్నాలను కప్పడానికి చేసే ప్రయత్నమే తనలో జరుగుతోంది. చివరకు అతనికొక గురువు యమునఒడ్డున తారసపడ్డాడు. అతను ఒక్కమాటే చెప్పాడు. 'దేవుని ప్రతినిధి ఆత్మ. దేవుడు సృష్టి స్థితి లయకారకుడు. అతనెవడో స్పష్టంగా తెలుసుకోవటంతో ప్రతివ్యక్తి చరితార్థుడవుతాడు.'

ఈ స్పష్టంగా తెలుసుకోవటానికి యెన్నెన్నో త్రోవలను యెందరో వేదాంతులు వెతికారు. ఆత్మకు ఆ వెలుగు రావటానికి కారణం దానికి వుండే యేకాగ్రత. మనసుకు యేకాగ్రతవలన వెలుగు వస్తుంది. కట్టుబాట్లకు లోనైన మనసే బ్రేకులున్న సైకిలు లాంటిది.

నాలుగుమంచాలు

ఇలాంటి పరిస్థితిలో విశాలనించి వుత్తరం వచ్చింది. వాళ్ళిద్దరూ జీవితంలో కలుసుకున్నాక తొలిసారి వచ్చిన వుత్తరం అది. అతను ఈ వుత్తరం రాలేదనే యిన్నాళ్ళూ విరాగి కావాలని యిన్ని తాపత్రయాలు పడ్డాడు. ఎన్నో వేదాంత గ్రంథాలు చదివాడు. యెందరో సన్యాసుల్ని కలుసుకున్నాడు. ధ్యానంలో పడ్డాడు. ధ్యానమూ వదల్చుకోలేక పోయాడు.

'మీరు క్షేమంగా చేరానని రాస్తారని ఒక యేడాది యెదురు చూశాను. ఒకనాడు నేను మీతో అన్నమాటలు గుర్తుకు వచ్చాయి. అవును నేనే మాటాడాలి. నేనే బయటపడాలి! — ఆవేళ నేను వుత్తి పిరికి దాన్ని విశాల అని ఒప్పుకున్నారు. వయసు హోదా పెరిగిన మీరు యింకా పిరికివారుగా వున్నారంటే నమ్మలేకపోతున్నాను. మార్పు మంచిని తెస్తుందన్న నమ్మకం నాకుంది. నాకు కష్టం కలిగించి కన్నీరు తెచ్చిన మార్పుపై కూడా అట్టే నమ్మకం పెట్టుకునే నిలవగలిగాను. మీ యీ ప్రదేశం మార్పు మీకు మంచిని తెస్తుందన్న వూహతోనే యేకాంతాన్ని అనుభవించడానికి సాహసిస్తున్నాను.

'విశాల'

ఈ వుత్తరం చదివాక ఆత్మకు వేడుకే కాదు, బ్రహ్మానందాన్ని పొందడమే కాదు - యిద్దరి ఆత్మలూ అతుక్కుని మంత్రముగ్ధుని చేసినట్లు యేదో తెలుసుకోలేని దివ్యానుభూతిని పొందాడు. వాళ్ళ ప్రేమ, పుట్టుకముందే చావలేదు. ప్రాణంతో బయటపడ్డ యీ ప్రేమ పెరిగి యిదివరకు కళ్ళతో చూసి, చెవులతో వినే స్తోమతే కలిగి వుండేది. ఇప్పుడు విచక్షణాజ్ఞానంతో విజ్ఞానం విరజిమ్మే ఆత్మతో వెలిగిపోతోంది.

అతను యిన్నాళ్ళ వేదాంతం, ధ్యానంలో విశాల ప్రేమ అనే ఆత్మను దరిచేరుతున్నాడు. ఆ ప్రేమాగ్నిలో అనుభవించటం అనే ఆజ్యం పొయ్యకుండా ఆ ప్రేమని యెన్నాళ్ళు వెలిగించగలడు ?

* * *

అతని ధ్యానంలోకూడా ఆమె ప్రతిబింబమే అగపడటంతో సూక్ష్మం ఒక నెల రోజులు శలవు తీసుకుని విశాలదగ్గరకు బయలుదేరాడు. త్రోవలో కనిపించిన ప్రతి మనిషి చేష్టలలోను తాపత్రయమే అగపడింది. రోగాలతో బాధపడేవాళ్ళూ, కడుపు బాధతో అలమటించేవాళ్ళు, ప్రేమకోసం పెనుగులాడేవాళ్ళు, సుఖంకోసం సతమతమయ్యేవాళ్ళు — యెవరిని తీసుకున్నా యేదో బాధ అగుపిస్తుంది. 'నేను' అనే అహం నీడలా మనిషిని వదలనివాడు అతడు నిజం తెలుసుకోలేడు. నిజం స్వరూపం ఆత్మలో యిమిడి వుంది. ఆత్మను చూడాలంటే నిజానికి కట్టుబడాలి. తను నిజానికి కట్టుబడేనా యిప్పుడు విశాలదగ్గరకు వెళ్తున్నాడు? ఈ ప్రశ్న గతాన్నంతా తవ్వింది. రైలు కదులుతుంటే ప్రకృతి పరుగెత్తినట్లు యెలా కనిపిస్తుందో తన జీవితంలో ఘట్టాలు కదలసాగినయ్. విశాల తనది కావలసిన్నంటే అది తొలిరోజుల్లోనే కావలసింది. ఇప్పుడు ఆవేశం అప్పుడప్పుడు అతని గతస్మృతులను జ్ఞప్తికితెచ్చి కోరికలకు లొంగిపోతుందిగానీ నిజంగా తను విశాలను వాంఛిస్తున్నాడా? ఆమెను తలచుకున్నప్పుడు వచ్చే ఆనందంతోపాటు హృదయాంతరాళంలో బాధతోకూడిన స్పందన కూడ వినిపిస్తుంది.

ఇన్ని విధాలుగా అనుకోడానికి కారణం తను యింకా బంధాలను త్రెంచుకోలేక పోతున్నాడు. కట్టుబాట్లపై వుగ్గుపాలతో వచ్చిన విశ్వాసంతోపాటు తల్లిదండ్రులకు తను యిచ్చిన హామీలుకూడా తను త్రోవలో చేసుకున్న నిర్ణయాలకు కారణమయ్యాయ్. తను ఒక గమ్యం చేరడానికి ఒకబాటలో యేలానా పడ్డాడు. ఆత్మను చేరాలని తను పడ్డ బాటనించి మళ్ళీ వెనుకకు తిరిగి రావటానికి అతనికి యిష్టంగా లేదు. ఆత్మను చేరాలన్న తాపత్రయం వున్నవానికి ఐహిక సుఖాలతో పనేముంది? వెలుగుకోసం పరుగెత్తేవాడికి యీ చీకటి కోణాల్లో కూర్చునే అవసరం యేముంది? అతను తన మనస్సుచేసే ఆలోచనలు, కళ్ళు చూసే కాంతులు, చెవులు వినే శబ్దాలు, నాలికకు తగిలేరుచులు, ముక్కు చూసే వాసనలు — వీటన్నిటిలోనూ మార్పులను కాంక్షిస్తున్నాడు. సామాన్యమైన శక్తిగల విద్యుచ్ఛక్తిని యెయ్యగలిగే యీ తీగలను మార్చి అధికమైన శక్తిని యెయ్యగలిగే తీగలను వెయ్యాలని తాప

త్రయ వస్తున్నాడు. అప్పుడు వెలిగించే వెలుగును చూడగలిగే కళ్ళు తనకు వుంటాయ్. అయితే ఆ శక్తి యెలా వస్తుంది? ధ్యానం ఆత్మపరమౌతుంది. మనసులో ఆత్మ ధ్యానం తప్పించి ఐహికమైన విషయాలు తిరిగితే మనసు ఆత్మదరి చేరలేదు.

ఒక నిర్ణయానికి వచ్చిన మనిషి విశాలను చూడగానే అంతా మరచిపోయాడు. ఆమె యిదివరకు కంటే చిక్కిపోయింది. ఒంటిమీద అట్టే శ్రద్ధ తీసుకోవటంలేదని ఆమెజుత్తు, వాటం అంతా చెప్తూనే వుంది.

'ఏం యిలా తయ్యారయ్యావ్?'

'ఇంకెలా వుండాలి?'

'తింటున్నావా లేదా?'

'తినకపోతే యెలా బతికున్నాను?'

'చదువెలా సాగుతోంది?'

'సాగవలసినట్లు సాగుతోంది'

'ఈ నవలలుకూడా స్కూలు పుస్తకా లేనా?'

'స్కూలు పుస్తకాలొక్కటే చదివితే విజ్ఞానం యెలా వస్తుంది?'

ప్రతిప్రశ్నకూ జవాబు వెంటనే రాగానే సూర్యంకు విశాల మారిపోయిందని తట్టింది. ఆమెలో యిదివరకువున్న సిగ్గు, బెదురు యిప్పుడు ససేమిరా అగపడలేదు. ఏదోవ్యక్తిత్వం వచ్చిన మనిషిలా కనపడింది. అవేళ మధ్యాన్నం ఆమె వండిన వంటలో క్రొత్తరుచులను చూపించింది. సాయంత్రం సరికి ఆమె ఒక నవనాగరికంతో పుట్టిపడుతున్న స్త్రీలా తయారయింది. చదువు ఆమె నడకలో, మాటల్లో, నడతలో, చూపులో, శరీరంలో కూడా క్రొత్తదనాన్ని తీసుకువచ్చింది. తపస్సులో నున్న విశ్వామిత్రుని కంటికి మేనకలా విశాల అగపడింది.

'సముద్రపొడ్డున కొత్తగా ఒక పార్కు కట్టారు. పదండి వెళ్దాం' అంది.

సూర్యం సంశయించాడు. సాయంత్రం కిటకిటలాడే జనం మధ్యకు ఒంటిగా ఆమెతో వెళ్తే వచ్చే గుసగుసలు తల్చుకుని వెంటనే వెళ్దాం అని అనలేకపోయాడు.

'నాతో రావటానికి కూడా సంశయమేనా?' అంది.

'అబ్బే...అబ్బే'

'నాతో మాటాడ్డానికి సంశయం, నావేపు చూడటానికి మరీ భయం మీకు. నేనేం బ్రహ్మరాక్షసినా కామినినా? చెప్పండి.'

'ఎందుకలా అనుకోవాలి?'

'చూస్తున్నాగా! మీకున్నకోపం అంతా నామీదే చూపిస్తున్నారు?'

'ఎప్పుడు చూపించాను?'

'మీ మనసుకు మీరే సాక్షి. నామీద కోపంతోనే మీరు ఢిల్లీ బదిలీ చెయ్యించుకున్నారుగా!'

సూర్యంకు విశాల బల్లగుద్ది చెప్పే వైఖరి నచ్చలేదు. ఇదివరకటి విశాలకు యిప్పటి విశాలకూ యెంతో తేడా కనిపించినట్లయి 'నీకు తెలీదు విశాలా' అన్నాడు.

'తెలియనిమనిషి ననే యిన్నాళ్లు దయ తలచారు'

'ఎందుకు లేనిపోని అర్థాలు తీస్తావు?'

'అయితే నాతో రోడ్డుమీద మీకు నడవటానికి చిన్నరికమా?'

'నాకు కాదు—నీకు చికాకు తెస్తుందని.'

'నాకేం చికాకు రాదు. నన్నెవరూ యేమీ చెయ్యలేరు— మీరు తప్పించి.'

'అయితే పద—' అన్నాడు కాస్సేపు మౌనంవాల్చాక.

ఇద్దరూ రోడ్డువెంబడి పోతుంటే సూర్యానికి పరిచయంవున్న మిత్రులు పదిమందైనా పలుకరించారు. కారుమీద వెళ్లిపోతున్న వ్యక్తి విశాలవేపు తిరిగి చూస్తూ యింకో మోటరుసైకిలుకు ఢీకొనవలసింది. మోటరుసైకిలుమీద వస్తున్నవ్యక్తి ఆమె జడలోని పూలవేపు దృష్టి పెట్టుకున్నట్లుంది. ఒక వయసు మళ్లినాయన— అతనికి నెరసినజుత్తుకు రంగురాసే అలవాటుందిలెండి — వాళ్లవెంట చాలదూరం నడిచాడు. అతను అప్పుడప్పుడూ ఓరచూపులు చూసేవాడు. పదిమంది స్టూడెంట్సులో మెడిసిన్ చదువుతున్న వాళ్లు ముగ్గురు — వెళిపోతూ వెళిపోతూ ఆగి ఆమెవేపు చూసిన తరవాత శరీర శాస్త్రం గురించి చర్చించుకున్నారు. వలుగురు యూనివర్సిటీ స్టూడెంటుతో ఒకాయన ప్రేమపాట కూనిరగింగ వదిలాడు. ఒక కాలేజీ స్టూడెంటు 'జోక్' విసిరాడు.

బీచ్‌దగ్గర యెవరో పిలిచినట్లయింది. బాగా పరిచయంవున్న శర్మ 'అరే రాస్కెల్— మాకు చెప్పకుండా పెళ్లిచేసుకున్నావురా' అన్నాడు.

'ఇంకా పెళ్లికాలేదు భాయ్.'

'ఐయామ్ సో సారీ...విష్‌యు బెస్టాఫ్ లక్.'


అతనిని తప్పించుకుని వస్తుంటే 'థేంక్స్ అనలేదేమండి' అంది విశాల.

'దేనికి?'

'మర్యాదకు'

'ఇదంతా వేషం — బ్రతుకంతా ఒక నటన విశాలా.'

'ఢిల్లీ వెళ్లి పంజాబీల ప్రాపంచిక



విశేషయోగాలు"" అబ్బుతాయనుకున్నాను. వేదాంతం యెలా అబ్బింది?'

'ఢిల్లీలోనే కూర్చోలేదు. హిమాలయాలను గాలించాను.

'ఆ హిమాలయాలు చూస్తుంటే— ఆ మంచుపై సూర్యోదయం, నీలినీటిపై అరుణకాంతులు — మన ప్రతిబింబాలు మనలనే ప్రశ్నిస్తాయ్'

'పదే రండి కూర్చుందాం!'

ఇద్దరు పార్కులో బదులు కాస్త దూరంగా ఒంటిగా యిసకమీద కూర్చున్నారు. పశ్చిమాకాశంలోని అరుణ కాంతులు తూర్పునవున్న పొడిమేఘాలపై పడి యెరుపు చేస్తాయ్. సంధ్య వెలుగులో నురగలు గ్రక్కుతూ పరుగెత్తున్నగుర్రాల్లా కెరటాలున్నయ్. ఒక ఓడ, రేవునించి పొగలు గ్రక్కుతూ కదలిపోతుంది. ఇంకో ఓడ, రేవుకు పోడానికి సిద్ధంగా వుంది. కొండమీద కోటికాంతులతో తిరుగుతున్న దీపస్తంభంవేపు విశాల చూపిస్తూ,

'జీవితం అలా వుంటేనే ఆనందం' అంది చప్పున. మౌనం యిలా భంగపరచేటప్పటికి ఆకసంపై చుక్కల దండు దాడి చేసాయ్.

'ఆనందానికి కొలతలులేవు, ఉపమానాలు లేవు విశాలా— నీ ఆనందం యింకొకరికి మిధ్య, ఇంకొకరి ఆనందం నివ్వు చూడలేవు అనుభవించలేవు. ఆత్మపరమైన ఆనందం అనుభవించటంలోనే మనిషి చరితార్థుడౌతాడు.'

'ఈ ఆత్మజ్ఞానం యెప్పటినుంచి నేర్చారు?'

'ఆత్మను తెలుసుకోడానికి ప్రయత్నిస్తే నీలో అహం పోతుంది.'

'బాగుంది మీవరస. ఆ అహంలేకపోతే మనిషెలా బ్రతుకుతాడు? అహం మనిషి ఆహారం కదండీ!'

'ఆ ఆహారంలా అహంకూడా హరించుకపోతుంది. చివరకు మనిషి హరించుకపోతాడు. హరించుకపోనిది ఆత్మ. దానిని తెలుసుకున్న మనిషే...'

అతనిని పూర్తిచెయ్యకుండా విశాలవెంటనే

'అలా తెలుసుకోడానికైనా మనిషిలో అహం వుండొద్దా?'

'అహంకాదు — ధ్యానం కావాలి'

'అంటే ముక్కుమూసి జపం చెయ్యమంటారు— ఏంటో యీ జపాలు తపాలు చెయ్యవలసింది పిరికివాళ్లుగానీ ధైర్యవంతులుకాదు. మనిషి విలువ అతనికున్న ధైర్యంబట్టి కట్టాలిగానీ అతని పలాయనత్వంబట్టి కాదు.'

'ధ్యానం పలాయనత్వమా?'

'సంసారికి ధ్యానం అంతే. ధ్యానంతో అతను నిజానికి దూరంగా పోతున్నాడు. సమస్యలు నిజాలు. అవి పరిష్కరించే తీరే విజ్ఞానం. సమస్యలు సృష్టిస్తాడు, పరిష్కరిస్తాడు కాబట్టే మనిషి జంతుజాలంలో గొప్పవాడయ్యాడు. ఈ విజ్ఞానం వదలి నిరాకారంలో తేలిపోమంటున్నారు. కోట్లకొలది పనిచేస్తున్న తీగల్లాంటి యీమెదడులోని నరాలను త్రెంపి ఆలోచనలని ధ్యానంగా మార్చమంటున్నారు?'

'బయట పుస్తకాలు చదివి చాలా నేర్చావే?'

'నా వూహాలు వ్యక్తపరచటం మీకిష్టంలేదా?'

'లేదనికాదు. నిన్ను నివ్వు ప్రేమించకు— యెదుటివాళ్ళను ప్రేమించు'

'బాగుంది నన్ను నేను ప్రేమించుకోలేనిది నాకు గర్వం యెలా వస్తుంది? నన్ను నేను ప్రేమించనిది యెదుటివాళ్ళను ప్రేమించడానికి ప్రేమ ఎక్కడిది? నన్ను నేను ప్రేమించుకోవటం వల్లనే బ్రతికున్నానండీ. లేకపోతే యీ సరికి ఆత్మహత్య చేసుకునే వుందును.'

'నిన్ను నివ్వు ప్రేమించుకోవటం వలన వచ్చిన సంతోషం యెన్నాళ్లో వుండదు. ఎదుటి వాళ్ళను ప్రేమించగా వచ్చిన తృప్తి కలకాలం వుంటుంది.'

'ఏంటో మనం యిలా వాదనలోనికి దిగిపోతున్నాం— నామట్టుకు నేను ఆత్మజ్ఞానం గూర్చి ఈ వయసులో తల పాడు చేసుకొనదల్చుకో లేదు. ప్రేమిస్తాను — ప్రేమను పొందుతాను —ఇదే నా ధ్యేయం.'

'ఎవర్ని ప్రేమిస్తావ్?'

'ఏమిటీ యిలా ప్రశ్నిస్తున్నారు? ఆడది యెవరిని ప్రేమిస్తుంది? మీ తల్లి ప్రేమ లేకుండా మీరు పెద్దవారయ్యారా?'

'ఆ ప్రేమే నటన అంటాను. నేను అన్న అజ్ఞానంవలన మనిషియివన్నీచేస్తాడు.'


'బహుశః మీరన్న మనిషి అజ్ఞానం వల్లనే దేవుడు నిల్చున్నాడేమో! ప్రేమ నటనని మీరంటే— నటించి ప్రేమించటం వలనే మనిషి మోక్షం పొందుతాడు.'

'కాదు. ఆత్మను తెలుసుకోవటం వలన మోక్షాన్ని పొందుతాడు.'

'మనిషి ఆత్మను తెలుసుకోడానికి బ్రతకాలా? మనిషి బ్రతకాలంటే తినాలి, తిండివలన పెరగాలి, ప్రేమించాలి, ప్రేమ వలన సృష్టించాలి, సృష్టివలన తనో దైవాంశను పొందుతాడు. అప్పుడు ఆత్మను తెలుసుకున్నట్లే లెక్కకాదూ?'

కాస్సేపు సూర్యం మౌనం దాల్చాడు. ఇలాగే గోవిందరావుతో వాదించి వెనుకబడ్డాడు.

(ఇంకా ఉంది)



మేషం: వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో ప్రయాస కలుగుతుంది. విలాస వస్తువులు కొంటారు.

వృషభం: అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో కొంత మంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. అధిక వ్యయం జరుగుతుంది.

మిథునం: రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది. మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం: ప్రయోజనం లేని ప్రయాస కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూల వార్తలను వింటారు. మిత్రులకు సహాయం చేస్తారు. అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగుంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. దైవ కార్యాలు నెరవేరతాయి.

సింహం: ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వ్యతిరేకత యేర్పడుతుంది. సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అననుకూలమైన వార్తలను వింటారు.

కన్య: అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి కావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం ఆఖరులో ఆందోళనకు గురికాగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది పోటీదారితో వాదప్రతివాదాలు తగవు.

తుల: వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. వ్యాపారంలో పోటీదారి పోటీ పెరుగుతుంది వారం ఆఖరులో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు.

వారఫలం

30-6-1972 శుక్రవారం మొదలు
6-7-1972 గురువారం వరకు

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృశ్చికం: ఆదాయం కంటే అదావుడి అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో ఏ వ్యవహారంలోను ఇతరులమీద ఆధారపడడం తగదు

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

ధనుస్సు: మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు. మీకు ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు అలంకార వస్తువులు కొంటారు.

మకరం: మీ ఆలోచనలు ఫలిస్తాయి. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కుంభం: వృత్తివ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి ప్రయాణాలోచనలు చేస్తారు.

మీనం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. మీ ఇంట్లోకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం మధ్యలో అనుకూలత లభిస్తుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్

గమనిక

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ కింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

మరువలేను నీ చిరునవ్వు

మరువలేను నీ చిరునవ్వు
మనసును తెల్లగా కరిగించిపోసిన నవ్వు
మమతను జల్లుగా కురిపించిన ఆ నవ్వు
అంత మాత్రాన—
ఆ నవ్వును హిమరమణీయంగా కొలిచి
నంత మాత్రాన—
అదే నాకు పరమావధికాదు.

రక్తాన్ని కన్నీళ్లుగా మార్చుకొని
కన్నీళ్లలో రక్తజ్వాలలు పేర్చుకొని
ఏడవలేక నవ్విన వేడినవ్వు ఒకటుంది
అదీ నా గుండెలో అవిరి పుట్టిస్తుంది.

కృత్రిమ జీవితంతో కుస్తీపట్టి
కొడిగట్టిన దివ్వెకు కొత్త ఊపిరులు కుట్టే
అతుకుల బతుకు విసిరేసిన అలిపిరి నవ్వు ఒకటుంది
అదీ నా కణతల్లో గదాయుద్ధం చేస్తుంది.

అనుకున్నవన్నీ పోగొట్టుకొన్న
దిగజారుతున్న విలువలను ఎగగట్టుకొన్న
ఎడలిన పెదవులు చిమ్మిన పొడినవ్వు ఒకటుంది
అదీ నా అంతశ్చేతనలో ఎడారిలా కమ్ముకుంటుంది.

నీ నవ్వు ప్రాణాలను లాగేస్తున్నా
ఈ నవ్వులను విస్మరించలేను.
ఏమనుకున్నా సరే నువ్వు
ఈ నవ్వులను తిరస్కరించలేను.

—డా. సి. నారాయణరెడ్డి



శ్రీ శంభుప్రసాద్

పరీధావినామ సంవత్సర నిజవైశాఖ బహుళ ద్వాదశీ గురువారం నాడు (8–6–72)
రాత్రి 8–15 గంటలకు శివసాయుజ్యం పొందారు.

పెద్దకథ:

నేను మామూలు మనిషిని



ఉన్నవ విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

కాస్త కునుకు తీసి లేచిన సావిత్రమ్మ టైము ఇంకా ఒంటిగంటే అవటంతో అప్పటినుంచీ చేసేపని ఏమీలేక ఇంత ప్రత్తి తెచ్చుకుని, విడదీసి దీపారాధనకి వత్తులు చేసుకుంటూ కూర్చుంది.

మరోగంటకి మోహన్ లేచి ఇవతలకి వచ్చాడు. నిద్రమత్తు వదిలిపోయేలా చన్నీళ్ళతో మొహం కడుక్కురావటానికి అతను బాత్‌రూమ్‌వేపు వెళుతూంటే సావిత్రమ్మ చేతిలో సరంజామా అంతా విత్తిపెట్టి, ఫలహారం అదీ తయారు చెయ్యటానికి వంటగదిలోకి వెళ్ళింది.

మోహన్ టవల్‌తో మొహం తుడుచుకుంటూ వంటగదిలోకి వెళ్ళాడు. పకోడీలు చెయ్యటానికి ఉల్లిపాయలూ పచ్చిమిరపకాయలూ తరుగుతోంది సావిత్రమ్మ. మోహన్ తల్లి ప్రక్కనే పీటవాల్చుకుని కూర్చున్నాడు.

సరళ ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కళ్ళు తెరిచింది. 'నిన్న మాలతి మనింటికి వచ్చిందిటకదూ' మోహన్ మాట వినిపించి సరళమత్తు వదిలిపోయింది. చటుక్కున లేచి రెండడుగులువేసి గుమ్మందాటి వంటగదిలోకి వెళ్ళాలనిపించింది—కాని తనువెళ్తే బావ చెప్పటం మానేస్తాడేమో అనుకుని, అతను చెప్పేది వినాలనే పట్టుదలతో

అక్కడే కదలికుండా పడుకుని కళ్లు మూసుకుంది నిద్రనటిస్తూ.

'అవును. వచ్చింది—నీకెవరు చెప్పారు.' గుంభనంగా అడిగింది సావిత్రమ్మ.

'నాతో చాలా మాట్లాడాలనీ సాయంకాలం ఓసారి తప్పకుండా వాళ్లింటికి రమ్మనమనీ మూర్తిచేత ఉదయం కబురు పంపించింది.' తనకీ మాలతికిగల స్నేహాన్ని గూర్చి మొట్టమొదటిసారిగా తల్లితో చెప్తున్న మోహన్ గొంతులో అదోకలాంటి ఒదుగు వ్యక్తం అయింది.

'నువ్వు ఏవేవో చాలా విషయాలు చెప్పావుటకదూ' తల్లి ఏమంటుందో వినాలన్నట్లు తను చెప్పటం ఆపాడు.

సావిత్రమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. కొద్దిక్షణాలు మౌనంగావుండి మళ్లీ మోహనే మొదలుపెట్టాడు.

'నేను ఈవూరు వచ్చేదాకా సరళని పెళ్లిచేసుకోవాలనే మనస్ఫూర్తిగా కోరుకున్నాను — చదువయిపోగానే మావయ్య లగ్నం పెట్టిస్తానంటే వుద్యోగం వచ్చేదాకా ఆగమని చెప్పినప్పుడుకూడ నాకు మరో అభిప్రాయం లేదు. అయితే ఇక్కడికివచ్చి ఉద్యోగంలో చేరిన మొదటిరోజే మూర్తి వెంట వాళ్లింటికివెళ్లి అక్కడ మాలతిని చూసినప్పుడుమాత్రం నా మనస్సు ఏదోగా అయిపోయింది. క్రమంగా ఆ అమ్మాయితో స్నేహం పెంచుకుని మావయ్య ఉత్తరాలకి ఏవో సాకులుచెప్పి తప్పించుకుంటూండేవాడిని. రాను రాను నీవత్తిడికూడ ఎక్కువయ్యింది. నేనయినా ఆ ముసుగులో వ్యవహారం ఇంక ఎంతోకాలం కొనసాగించకుండా తేల్చిచెప్పేద్దామనుకున్నాను. అందుకే అవాళ మాలతిని మనింటికి తీసుకురమ్మన్నాను. రెండుమూడుసార్లు అలా వచ్చాక నీకు తనమీద మంచి అభిప్రాయం ఏర్పడ్డాక తనవిషయం చెప్పాలనుకున్నాను. నన్ను అల్లుడిగా చేసుకోటం ఆ యింట్లో అందరికీ అంగీకారమే — మావయ్యకీ, సరళకీ ఏం సమాధానం చెప్పాలి అనే సంశయం ఒక్కటి తప్పితే నీకు అంగీకారం కాకపోవటానికి తగిన కారణం ఏదీ లేదు. మాలతిమీద మంచి అభిప్రాయమూ, అభిమానమూ ఏర్పడ్డాక నా కోర్కె బయటపెట్టి నిన్ను ఒప్పించటం ఏమంత కష్టం అయినపని కాదనుకున్నాను...నీక్కు మావయ్య కుటుంబంపట్లా సరళపట్లా నేను వూహించినదానికంటే ఎక్కువ గౌరవం అభిమానమూ వున్నాయని తరవాత గ్రహించుకున్నాను. లేకపోతే నా మనస్సు ఓ ప్రక్కనుండి కొస్త కొస్త అర్థం అవుతూనే వున్నాకూడ అలా హఠాత్తుగా వుత్తరం వ్రాసి సరళని పిలిపించవు. వరే సరళని తీసుకుని మావయ్య వచ్చాడు. ఆయన వున్న రెండురోజుల్లోనూ ఈ పెళ్లి ప్రస్తావన వచ్చినా నేను అదివరకు లాగే తప్పించుకున్నాను. ఇంక సరళకి అసలువిషయం చెప్పేయాలి. లేకపోతే నీచేత చెప్పించాలి అనుకుంటుండగా మాలతి పుట్టినరోజు పిలుపు వచ్చింది. అవాళ కావాలనే తననీ బలవంతంగా ప్రయాణం చేయించాను. తను నా మనసు అర్థం చేసుకుంటుంది ఇంక ఆమెకి చెప్పటం కష్టం కాదు అనుకున్నా. ఇవాళో రేపో నీతో ఈ విషయాలు ముచ్చటించాలనుకుంటుండగానే మాలతి నిన్న మనింటికి రావటం సరళగురించి తెలుసుకోటం జరిగిపోయింది.' మోహన్ గొంతులో ఎలాంటి ఉద్వేగమూ బాధా కనిపించటంలేదు. చాలా సహజంగా మాట్లాడేస్తున్నాడు.

'అవును. తనకీ విషయాలన్నీ చెప్పాలనే ఒకసారి మనింటికి కాస్త సావకాశంగా రమ్మనమని నేను చెప్పాను అవాళ పుట్టినరోజు పార్టీకి పిలవటానికి వచ్చినప్పుడు.' సావిత్రమ్మ గొంతు గంభీరంగా వుంది.

'అవునుట... సరే సంగతంతా తెలుసుకున్న మాలతి ఇప్పుడు ఏమంటుందో తెలుసా ?'

'ఏమంది ?' సావిత్రమ్మ గొంతులో వణుకు కనిపించనీయకుండా ప్రశ్నించింది— కాని సరళ కంపిస్తున్న అంతరంగంతో చెవులురిక్కించుకుని మోహన్ సమాధానం కోసం ఎదురు చూడసాగింది.

'మీరిద్దరూ మేనత్త మేనమామ బిడ్డలు ఒకరికోసమే మరొకరు పుట్టినట్టు పసితనంనుండి అన్యోన్యంగా పెరిగారు— ఇన్నాళ్ల తరువాత ఇవాళ హఠాత్తుగా నాతో పరిచయం అయి ఆ అమ్మాయికి అన్యాయం చేస్తాననటం ధర్మంకాదు— చిన్నతనంనుండి ఆశలు పెంచుకున్న సరళనే చేసుకోండి. నన్ను మరిచిపోండి అంది ... ఇలా చెప్పటానికి నీకేమీ బాధ అనిపించటంలేదా అని అడిగాను— నేను. మాలతి చెమరుస్తున్న కళ్లు ఒత్తుకుని మళ్లీ చెప్పటం మొదలు పెట్టింది. మనకి పరిచయం అయి కొద్దికాలమే అయినా, మనం స్నేహం పేరిట అతి చనువుతో ప్రవర్తించకపోయినా ఒకరి మనసు ఒకరికి తెలుసు. నేను ఎన్నో బంగారు కలలు కన్నాను. మరెన్నో వూహాలోకాలలో విహరించాను. నా కలలు నిజం అయేరోజుకోసం ఎదురు చూస్తున్నాను. ఇంతలో మీ విషయాలన్నీ తెలిశాయి. అవి వినగానే భరించలేనంత బాధకలిగిన మాట నిజమే. కాని నిదానంగా ఆలోచించిన మీదట నా కర్తవ్యం ఏమిటో తెలిసి వచ్చింది. మనం స్నేహితులంగానే విడిపోదాం అంది. నేను నచ్చచెప్పాను. నా పెళ్లి విషయంలో అన్నినిర్ణయాలూ నావే. ఇందులో మరొకరి ప్రమేయంలేదు అని ఎన్నోవిధాల చెప్పాను. కాని మాలతి వినలేదు. తనపట్టు విడవలేదు. అంతేకాదు 'మీరు ఇంతగా చెప్పక్కర్లేదు, ఇవాళ నేను మిమ్మల్ని వదల్లేను అని ఒక్కమాట అంటే చాలు మీరు ఎంతమందినయినాసరే ఎదిరించి నా మెడలోనే తాళికడతారని నాకు తెలుసు. కాని నా సంతోషంకోసం. నా సుఖం కోసం మరో అమ్మాయి ఆశలని కూలదోసే స్వార్థం నాలో లేదు.' అంది. తను అంత నిష్కర్షగా చెప్తుంటే ఆ సమయంలో నాలో ఎంతటి దుఃఖమూ. మీ అందరిమీదా చిరాకూ కోపం కలిగాయో నేను మాటలలో చెప్పలేను. అలాంటిస్థితిలోనే యింటికి తిరిగివచ్చాను. అన్నం తినాలనిపించలేదు. నిద్రపట్టలేదు. రాత్రంతా ఒకటే ఆలోచన. ఒకటే తపన. చివరికి తెలతెల్లవారుతూండగా ఒక నిర్ణయానికి రాగలిగాను...మాలతి సూచించిన పరిష్కారం ఎంతో వుత్తమంగా వుంది అనిపించింది...'

'నిజం మోహన్.' తను వింటున్నది తనకే నమ్మశక్యం కానంత విస్మయంలో నుండి చటుక్కున తేరుకుని అపరిమితమయిన సంతోష సంభ్రమాలతో అంది సావిత్రమ్మ. 'మాలతి చిన్నపిల్ల అయినా దొడ్డగుణం కలది. ఆ అమ్మాయిని మొదట నేనూ అర్థం చేసుకోలేకపోయాను. అయినా చెప్పి చూద్దామనిపించి అన్ని విషయాలూ తెలియజేశాను... అదే మరొకరయితే చిన్ననాడు లక్ష్మమాటలనుకుంటాం అవన్నీ

నేను మామూలే...

అక్షరాలా పాటించాలనే రూలు ఎక్కడుంది అంటూ భీష్మించుకుని కూర్చునేవారు. తననే పెళ్ళిచేసుకోమని నిన్ను బ్రతిమాలు కొనేవారు. తన పట్టు నెగ్గించుకోటం కోసం ఏడుపులూ అలిగి కూర్చోటాలూ అన్నీ చేసేవారు. కాని మాలతి పరిస్థితి అంతా అర్థంచేసుకుని నీకే ఆవిధంగా నచ్చ చెప్పింది అంటే ఆ పిల్ల వివేకం ఎంత వున్నతస్థాయిలో వుందో అర్థం అవుతోంది.' ఆవిడ మాటల్లో గొంతులో మాలతిపట్ల అభిమానమూ సదభిప్రాయమూ పొంగి పొర్లుతున్నాయి.

'అవునమ్మా, తను మనసారా కోరుకున్న గానిని మరొకరికోసం త్యాగం చెయ్యగలగటం మాలతిలాంటి వాళ్ళకే సాధ్యం అవుతుంది ... పసితనంనుండే మీరంతా ఏమేమో అంటూవుంటే ఆ తెలిసీ తెలియని వయస్సులోనే అమాయకంగా సరళపట్ల మమతని పెంచుకున్నాను... మనస్సు వికసించాక, మాలతిని చూశాక నాకు ఏది కావాలో తెలిసినట్లనిపించింది. ఆ సంగతే మాలతికి కూడ చెప్పాను. కాని తను అంతగా చెప్పినమీదట. తరువాత ఆలోచిస్తే పెద్దయాక ఏర్పడిన ఆకర్షణ కంటె, చిన్ననాటి చెలిమికి మమతకీ ప్రాధాన్యం ఇవ్వాలనిపిస్తోంది— మామయ్య మనకిచేసిన సహాయానికి కనీసం కృతజ్ఞత చూపించుకోవటం, అమాయకంగా ఆశలు అల్లుకున్న సరళ మనస్సు గాయపడకుండా చూడటం. ఇది నా కర్తవ్యం అనిపిస్తోంది.' అని మోహన్ అంటూంటే,

'ఇవాళే మామయ్యకి వుత్తరం వ్రాయి. సుహూర్తం పెట్టించమని.' అంది సావిత్రమ్మ, ఆవిడ గొంతులో కొడుకు నిర్ణయంపట్ల సంతోషం. ఇంకా ఆలస్యంచేస్తే అబ్బాయి మళ్ళీ మనస్సు మార్చుకుంటాడేమోననే ఆదుర్దా వ్యక్తం అయాయి.

'నేనా — నేను వ్రాస్తే ఏం బాగుంటుంది. నువ్వే వ్రాయి' అన్నాడు మోహన్. అతని గొంతుపోని ఎదుగుకి నవ్వుకుంది సరళ.

'పోనీ నేనే వ్రాస్తాలే — సరేకాని, సరళ హాల్లో నిద్రపోతోంది. మన మాటలకి మెళుకువ రాలేదుకదా?' ఆ అమ్మాయికి అన్ని విషయాలు తెలియటం బాగుండదేమో' అన్న సందేహంతో ఆవిడ అంటూంటే,

'మెళుకువ వచ్చి విన్నాకూడ మనం మాట్లాడుకున్నదాంట్లో తప్పేమీ లేదు— తనకి వినిపించకపోయినా ఏదో ఒకనాడు అన్ని సంగతులూ నేనే తనకి చెప్దామను కుంటున్నాను' అన్నాడు మోహన్.

చాలాసేపటి తరువాత, అతను కాఫీ త్రాగి గదిలోకి వెళ్ళిపోయాడనిపించాక సరళ లేచి బాత్‌రూంలోకి వెళ్ళి, మొహం కడుక్కొని వచ్చింది.

ఆ అమ్మాయిచేతికి కాఫీ గ్లాసుతోపాటు తను అంతకితమే వ్రాసివుంచిన వుత్తరం కూడ అందించింది సావిత్రమ్మ.

ఉత్తరం చదువుకుని కాగితం మడిచి ఆవిడచేతికిస్తూ, 'నేను రేపు మావూరికి వెళ్ళిపోతా నత్తయ్యా, నన్ను పంపించేసెయ్' అంది సరళ.

'అదేం?' తెల్లబోతూ ఆ అమ్మాయి వంక చూసిందావిడ.

సరళ కళ్ళు వాల్చుకుని, తలవంచుకుని కాఫీ త్రాగుతూ వుండిపోయింది.

'పిచ్చి పిల్లా, ఇంతట్లో ఎంత సిగ్గు ముంచుకు వచ్చిందే.' అంటూ వాత్సల్యం తొణికిసలాడుతున్న కళ్ళతో అపురూపంగా మేనగోడలిని చూసుకుంటూ, ఆదరంగా ఆపిల్ల తలనిమురుతూ, 'సరే, అలాగే వెళ్ళు. మళ్ళీ నెలనాటికి కొత్త కోడలిగా ఈ ఇంట్లో అడుగు పెడుదువు గాని.' అంది.

సరళ మాట్లాడకుండా ఖాళీగ్లాసు ప్రక్కన పెట్టి లేచివచ్చి స్టౌ ముందు కూర్చోబోతూంటే,

'ఇప్పట్నుంచి నీకెందుకే ఆ బెడద ఈ నాలుగు పకోడీలు నేను చెయ్యగలనులే. నువ్వు తలదువ్వుకో—రేపు ఎలాగా వెళ్ళి పోతా నంటున్నావు. ఇవాళ సినిమా అయినా చూసి వద్దురుగాని.' అంది.

'తలనొప్పిగా వుందత్తయ్యా. ఇవాళ ఎక్కడికీ వెళ్ళాలని లేదు.' అంది సరళ కణతలు ఒత్తుకుంటూ.

తరువాత ముగ్గురూ కూర్చుని ఫలహారం చేస్తుండగా సావిత్రమ్మ 'సరళ రేపే వెళ్ళి పోతానంటోంది, నేనూ సరే అన్నాను. రేపు తప్పితే మళ్ళీ నాలుగురోజులదాకా మంచిరోజులు కూడ లేవు' అంది.

క్రీగంట సరళవంక చూసిన మోహన్‌కి ఆ అమ్మాయి మొహంలో_ ఏ భావమూ

వ్యక్తంకాలేదు. ఆ సమయంలో తల్లి ఎదురుగా ఆ అమ్మాయిని పలకరించాలంటే కూడ అతనికి ఎలాగో అనిపించి మౌనంగా వుండిపోయాడు.

ముగ్గురి బదులూ కూడ సావిత్రమ్మే ఏవేవో మాట్లాడేస్తోంది.

ఫలహారాలు పూర్తయాయి. మోహన్ లేచి గదిలోకి వెళ్ళి పోయాడు.

'ఇంక సరళ రేపు సాయంకాలం వెళ్ళి పోతుంది. రేపు ఉదయం లేచిన దగ్గర నుండీ తనకి ఒకటే హడావిడి. ఈ రాత్రి లోగా సరళని ఏకాంతంగా కలుసుకుని, నాలుగుమాటలు మాట్లాడాలి.' అని అతని మనస్సు పురకలు వేస్తోంది. కాలక్షేపానికి చేతిలోకి తీసుకున్న పుస్తకం పుటలు తిరగ వేస్తూ సరళతో ఏం చెప్పాలి, తన ఇన్నాళ్ళ విముఖానికి ఎలా క్షమార్పణ చెప్పుకోవాలి అని ఆలోచిస్తున్నాడు.

సాయంకాలం గడిచి రాత్రి అయింది. భోజనాలు ముగించి అంతా నిద్రలకి వుప క్రమించే వేళకూడ అయింది. కాని మోహన్ కోరుకున్న సమయం మాత్రం రాలేదు.

తెల్లవారింది మోహన్ లేబరేటరీకి వెళ్ళే వేళ అయింది. అతను భోజనం ముగించి టవల్‌తో చేతులు తుడుచుకుంటూ ఇవతలకి వచ్చాడు. మధ్యగదిలో జడ అల్లుకుంటూ నిలబడివుంది సరళ. సావిత్రమ్మ పెరట్లో, ప్రక్కింటావిడతో మాట్లాడుతోంది.

తిన్నగా అతనిగదిలోకి వెళ్ళిపోతాడు అనుకున్న మోహన్ తనదగ్గరగా వచ్చి నిలబడటంతో సరళ ఒక్కక్షణం తొట్రుపడి తనూ పెరటిలోకి వెళ్ళిపోవాలనుకుంది అది కనిపెట్టిన మోహన్, 'నన్ను చూస్తే భయం వేస్తోందా ఏమిటి, అలా దూర దూరంగా పారిపోతున్నావు' అన్నాడు నవ్వుతూ.

'ఉహూ — భయం ఎందుకూ?' సరళ కూడ నవ్వేస్తూ సమాధానం చెప్పింది. అయితే ఆ అమ్మాయి ఎన్నడూలేని బిడియంతో సంకోచంతో ముడుచుకుపోతోందని మోహన్‌కి కూడ అర్థం అయింది — అది వరకుదాకా ఎంత చనువుగా తిరిగిన వ్యక్తి అయినా తీరా పెళ్ళి నిశ్చయం అయిందని అనేసరికి ఆడపిల్లలకి ఎక్కడలేని సిగ్గు ముంచుకు వస్తుంది కాబోలు అనుకుంటూ నవ్వుకున్నాడు.

'నేను నిన్నటినుండీ, నీతో నాలుగు మాటలు మాట్లాడాలని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాను. నువ్వేమో కావాలనే నన్ను తప్పించుకుని తిరుగుతున్నావుకదూ' అతని నిష్ఠూరంతోకూడిన ఆప్యాయత తొణికిసలాడింది.

ఏదోవంక పెట్టుకుని అక్కడ్నించి వెళ్ళి పోవాలనుకున్న సరళ ఆమాటలతో ఆగి పోయి 'నేనా, అబ్బే అదేం లేదే' అంది చిన్నగా నవ్వుతూ.

'సరేలే — నాకు టైమయిపోయింది. వెళుతున్నాను. నేను మళ్ళీ వచ్చేసరికి రైలు టైమూ అవుతుంది. నువ్వు రెడీగా వుండు ... మరి వెళ్ళగానే వుత్తరం వ్రాస్తావా...' అని అతను అడుగుతూంటే 'వ్రాస్తాను' అన్నట్లు తల వూగించింది.

ఆ తరువాత ఏదో చెప్పాలనుకుని, అది ఎలా చెప్పాలో తెలియనివాడిలా తటపటా యిస్తూ ఒక్కక్షణం నిలబడిపోయాడు మోహన్.

'స్టౌమీద పాలుపెట్టాను. పొంగు తున్నాయేమో చూసి స్టౌ ఆర్పేయమ్మా' పెరట్లోంచి సావిత్రమ్మ కంఠం విని పించింది. అలాంటి అవకాశం కోసమే చూస్తున్నదానిలా వంటగదిలోకి తుర్రు మంది సరళ.

మోహన్ రేతివాచీకేసి ఒకసారి చూసు కుని, స్కూటరు స్టార్టుచేసుకుని లేబ రేటరీకి వెళ్ళిపోయాడు.

సాయంకాలం సరళని రైలు ఎక్కించి వచ్చిన దగ్గరనుండీ సావిత్రమ్మ అన్నగారి వుత్తరం కోసమూ, మోహన్ సరళ వుత్తరం కోసమూ ఎదురుచూస్తూ నిమి షాలు, గంటలూ లెక్కపెట్టుకోసాగారు.


*   *   *

మూడురోజుల తరువాత సాయంకాలం మోహన్ లేబరేటరీనుండి రాగానే, అంత క్రితమే పోస్టుమేన్ ఇచ్చివెళ్ళిన కవరు అందించి అవతలకి వెళ్ళిపోయింది సావి త్రమ్మ. అది సరళ వ్రాసిన వుత్తరం అని ఆవిడకి తెలుసు. కాబోయే భార్య వ్రాసిన ప్రేమలేఖ చదువుకుంటూ తన్మయత్వంతో మురిసిపోయేవేళ, కొడుకు ఎదురుగా నిలబడి అతని మొహంలో కళ్ళలో ప్రతిఫలించే భావాలని చదవటం సభ్యత కాదనిపించిందా విడకి.

వెళ్ళిపోతున్న తల్లివంక ఒక్కసారి చూసి హుషారుగా కుర్చీలో కూర్చుని వుత్సాహంగా కవరువిప్పి కాగితాలు పైకి తీశాడు మోహన్.

బావా,

నిన్న ఉదయం నేను ఇక్కడ క్షేమంగా చేరాను. నువ్విచ్చిన టెలిగ్రాం అందుకుని నాన్నగారు స్టేషనుకి వచ్చారు, ఇంటికి రాగానే పెట్టెతీసి, నువ్వు మర్యాదకి మావాళ్ళకి కొనియిచ్చిన బహుమతులు తీసి ఇచ్చాను. వాళ్ళు పొంగిపోయారు. అత్తయ్య చేసి ఇచ్చిన పిండివంటలు చూసి అమ్మ సంబరంగా బుగ్గలు నొక్కేసుకుంది, ఇలా



నేను 'మహా'వ్రతాలు...

కాస్సేపు గడచిన తరువాత అమ్మా నాన్న గారు ఆసక్తిగా కుతూహలంగా నా వంక చూస్తూ నేను చెప్పబోయే శుభవార్త కోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని కూర్చుండి పోయారని నేను గ్రహించుకున్నాను. అయినా ఏమీ చెప్పాలనిపించలేదు. నా స్నానం భోజనం అయాయి. ఇంతలో వచ్చింది. అత్తయ్య వ్రాసిన వుత్తరం. పోస్టు బంట్రోతు చేతిలోనుండి అందుకున్న ఉత్తరం పూర్తిగా చదవకుండానే నాన్నగారి కళ్ళల్లోకి మొహంలోకి ఒక అపురూపమైన ఆనందం పొంగుకు వచ్చింది. అప్పటికప్పుడే అమ్మని పిలిచి ఆ శుభవార్త చెప్పేశారు. అమ్మ పొంగిపోతూ సంబరంగా నా బుగ్గలు నిమిరి, 'ఇది పొరుగూరిది ఏమీ చెప్పకపోయినా రాగానే దీని మొహం చూడగానే నాకు కనిపించింది. పెళ్ళికళ వచ్చేసిందని,' అంది.

వాళ్ళ ఆర్భాటం అంతా చూస్తుంటే నాకు వెర్రినవ్వు వినుకలిగింది. ఎందుకని నువ్వు ఆశ్చర్యపోవచ్చు. ఎందుకో నా మనస్సులోని సంగతులు నీకు విప్పుతాను.

ఊహ తెలిసినప్పటినుండి నేను నిన్ను ఆరాధించినమాట యదార్థమే. అప్పట్లో నువ్వుకూడ నేనే నీ సర్వస్వం అన్నట్లు వుండేవాడివి. ఆ రోజుల్లోనే మన వివాహం జరిగిపోయివుంటే బాగుండేది, కాని జరగలేదు.

ఇంతలో నువ్వు వుద్యోగంకోసం హైదరాబాదు వెళ్ళిపోయావు. అక్కడికి వెళ్ళిన తరువాత నీలో ఏదో మార్పు వచ్చింది అని మా కందరికీ అనిపించ సాగింది క్రమంగా. అయితే అది కేవలం మేము అనుకోటమే కాదు నువ్వు నిజంగా మారిపోయావని నేను మొన్న ఇక్కడ వున్నప్పుడు కొంత గ్రహించుకున్నాను. మిగిలినది నువ్వూ అత్తయ్య మాట్లాడుతున్న దానినిబట్టి అర్థం చేసుకున్నాను.

సంవత్సరాల తరబడి పెంచుకున్న ఆశ లాగన్నీ అనుబంధాన్ని పెద్దలంతా తెంచేసుకుని వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుంటే ప్రేమించసాగావు నువ్వు అంతగా పెంచేసుకున్న ప్రేమ లత పుష్పించి ఫలించబోతుంది అన్న తరుణంలో అత్తయ్య తొలికయాప్పు మన చిన్ననాటి సంగతులన్నీ మాలతి చెవిని వేసింది — మాలతి అంటే ప్రత్యేకమయిన అయిష్టత ఏమీ లేకపోయినా నా పట్ల నా కుటుంబం పట్ల ఆమెకిగల అభిమానమూ అనుబంధమూ ఆమెచేత అలా చెప్పించాయి. సరే — అత్తయ్య మాటలు మాలతి మనస్సులో సహజంగానే అలజడిని రేపాయి. అయితే చాలామందిలాగా మాలతి స్వార్థానికి ప్రాముఖ్యానికి లొంగిపోలేదు. నువ్వు తనని నాకంటె మిన్నగా ప్రేమిస్తున్నావు అని తెలిసికూడ నీదారినుండి తప్పుకోవాలనే నిశ్చయించుకుంది. నువ్వు ప్రతిఘటించినా ప్రాధేయపడినా ఆమె మనసు మార్చుకోలేదు. చివరికి నువ్వే ఆమె నిర్ణయానికి కట్టుబడిపోయావు.

తను మనసారా కోరుకుంటున్న వ్యక్తిని మరొకరిపాలు చెయ్యగలగటం అది ఒక అపురూపమైన త్యాగమే. అలాంటివని అందరికీ సాధ్యంకాదు.

నిజంగా మాలతి అపురూపమైన వ్యక్తి. ఆమె ఔన్నత్యమును నేను మెచ్చుకుంటున్నాను, అంతేకాదు ఆమె ఔన్నత్యాన్ని అర్థం చేసుకుని ఆమె త్యాగాన్ని అంగీకరించలేనంత నీచస్థితికి నేను దిగజారలేను.

నాకు జ్ఞానం వచ్చిన దగ్గరనుండి నిన్నే ఆరాధిస్తూ వస్తున్నా, ఆ ఆరాధన వెనక వున్న కోరికకి ప్రేమకి నిర్వచనం ఇవాళ చెప్తున్నాను. నా భర్త నిండు మనస్సుతో నన్ను ప్రేమించాలని నన్నే తన సర్వస్వంగా భావించాలని నా కోరిక. ఇంతేగాని ఇంకొకరి సౌఖ్యంగాని, మరొకరి ప్రభావం గాని నేను సహించలేను.

ఒకరు ఒక వ్యక్తిని మనసారా కోరుకుని తన స్వంతం చేసుకోబోతున్న తరుణంలో విచిత్రమైన సంఘటనలు, వాగ్దానాలు అడ్డు నిలిచి ఆ వ్యక్తి తప్పుకోవటం ఆ త్యాగాన్ని తెలిసికూడా మరొకరితో వివాహానికి అంగీకరించటం, ఆ పెళ్ళి జరుగుతున్నా అని నేను భరించలేను — జీవితం పొడుగునా, ఇంకొకరి త్యాగఫలం, ఈ బ్రతుకు మరొకరి దయాధర్మంగా ప్రసాదించినది అన్న స్పృహ నన్ను జీవితాంతం గుచ్చుతుంది ఆ బాధని నేను భరించలేను. ఇది చదువుతూంటే నన్ను ఒక్క మూర్ఖురాలిగా స్వార్థపరురాలిగా నువ్వు అంచనా వేసుకుంటూ వుండవచ్చు. అయినా నాకేమీ చింతలేదు.

నువ్వూ మాలతీ భార్యాభర్తలు కావాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇంక నా పెళ్ళిసంగతంటావా — నాన్నగారి శక్తికి తగినట్లు ఏదో ఒకటి దొరక్కపోదు. ఈ మధ్య నువ్వు పెళ్ళి విషయంలో ముభావంగా వుంటూండే రోజుల్లో నాన్నగారు నాకో సంబంధం చూశారు. పెళ్ళి చూపులదాకా రాలేదుకాని మిగిలిన విషయాలన్నీ బాగానే వున్నాయి, ముందుముందు ఆ సంబంధమే ఖాయం కావచ్చు. అదికాకపోతే మరొకటి అవుతుంది. నా పెళ్ళిని గురించి నాకేం దిగులు లేదు. మా కుటుంబంపట్ల కృతజ్ఞత చూపించుకోలేక పోతున్నానని నువ్వేమీ చింతపడకు. అలాంటి అభిప్రాయం మా కెవరికీ లేదు.

అత్తయ్యకి నమస్కారాలు. మాలతిని అడిగానని చెప్పు. మీ పెళ్ళికి ముహూర్తం పెట్టుకోగానే ఉత్తరం వ్రాయి. మేమంతా వస్తాము.

నా నిర్ణయం అమ్మా నాన్నగారికీ చెప్పినప్పుడు వాళ్ళు మొదట ఆశ్చర్యపడినమాట ఆ తరువాత బాధపడినమాటాకూడా నిజమే. అయితే మరొకరు ధారాదత్తం చేసిన అదృష్టాన్ని నేను అందుకోలేను. అంతటి ఔన్నత్యం నాలో లేదు. నేను మామూలు మనిషిని నన్ను క్షమించండి అని నేను ప్రాధేయపడినప్పుడు వాళ్ళు నన్ను అర్థంచేసుకున్నారు. నువ్వుకూడా నన్ను అర్థంచేసుకో.

సరళ,

ఉత్తరంలో ఒక్కొక్క వాక్యమే చదువుతున్న కొద్దీ సరళ మనస్సు ఆమె మనస్సే మరో అర్థం అయిన శ్యామ్‌కి ఆమె పట్ల కోపం రాలేదు. అపూర్వమైన గౌరవం ఆప్యాయత కలిగాయి.


ఏదో గుర్తుకువచ్చి ఏదో ఆలోచిస్తూ ఏదో ధ్యానంగా నిలిచిపోయి మాటల్లేక పెదవి విరుచుకుని కూర్చున్న శ్యామ్, చాలాసేపటి తరువాత,

'ఏం వ్రాసిందిరా సరళ' అన్న తల్లి మాట విరిగించి లేచివెళ్ళి, ఉత్తరం మడత ఆమెచేతికి అందించాడు.

(అయిపోయింది)


ఇది చాలా గొప్పవాళ్ళ క్లబ్బు క్లబ్బు
ఇందులో సభ్యత్వం చాలా కష్టం!
ఇందులో చేరాలంటే చాలా పెద్దవారి అనుగ్రహం --
-కనీసం కొన్ని లక్షలు ఖర్చు అవసరం!
ఒకసారి చేరింతర్వాత కొన్నేళ్ళదాకా భయం లేదు!
(పెద్దలు హఠాత్తుగా మనసు మార్చేస్తే తప్ప!)
ప్రజాసేవ పేదరికం తొలగించడం ఇవే మా ఆశయాలు!
బస ఇంటుమింటు ఉచితం, ఇంకా ఎన్నో, ఎన్నో...
ఏ వాహనం ఏదైనా సరే మాదే మొదటి హక్కు,
HOSPITAL
ఆసుపత్రి అయినా సరే.-
-మా తర్వాతే అందరూ!
మేం అందర్నీ ఏమైనా అనొచ్చు!
మమ్మల్ని ఏదైనా అంటే మాత్రం..!
బాధ్యతలు తక్కువ, హక్కులు ఎక్కువ!
మేమే లోకం మాదే రాజ్యం

సీరియల్



జరిగిన కథ

మాధవరావు ఆ వూళ్లోకి స్కూలు మాస్టారిగా వచ్చాడు. ఎవరికో ఉపకారం చెయ్యపోతే అతను కుక్కకాటుకు గురి అయ్యాడు. బామ్మగారు అతన్ని యింటికి తీసుకువచ్చింది. అనురాధ తొలి చూపుల్లోనే అతన్ని ఆకర్షించింది. ఆ తర్వాత అతనిదగ్గర చదువుకోవడం ఆరంభించింది. రంగ రాజు కొడుకు రాజారావు ఊరికి ప్రెసిడెంటుగా నెగ్గాడని ఆమె చాలా బాధపడింది. మాధవికి పెళ్లయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. రాజారావు రాధని నిర్బంధించాడు. మాధవరావుకు సంబంధించిన ఒక రహస్యాన్ని వెల్లడించాడు. రాధ నమ్మలేదు. రాజారావు అత్యాచారం చెయ్యబోగా ఆమెకి స్పృహ తప్పింది. మాధవరావు ఆమెని రక్షించాడు. దెబ్బలు తగిలిన మాధవరావు రాధ సపర్యలతో కోలుకుంటాడు. మాధవరావు తల్లి విషాదగాథ రాధని కలచి వేస్తుంది. శశికళతో తన పరిచయాన్ని రాధకి వివరిస్తాడు మాధవరావు. అతని కథంతా చెప్పుకు వచ్చాడు. అన్నగారు తనని ఎలా అనుమానించిందీ వివరంగా తెలిపాడు. ఎంతో బాధపడింది రాధ.

19

ఆ తర్వాత కొద్దిరోజులకి నాన్నగారు పోయారు. ఆయన చివరన పడిన బాధ చూసి నామనస్సు వికలమైపోయేది. శరీరమంతా దుర్గంధంతో భరించరానిదిగా ఉండేది. మేము దగ్గరకి వెళ్ళటానికే భయపడేవాళ్లము. ఆఖరికి అన్నపూర్ణ కూడ ఆయనకు సేవచేయటం మానేసింది. నాన్నగారి ఆత్మకు ఏ మాత్రమయినా శాంతి అనేది లభిస్తే అది చిట్టచివర అత్యాదరణతో వదిన చేసిన సేవవల్లనే అని చెప్పాలి. తానెవరికీ ఉపకారం చేయక పోయినా, తనవాళ్ళు కంటే పరాయి యింటి స్త్రీ తనకు చివరి దశలో చేసినసేవ ఆయన్ని పశ్చాత్తాపంతో దహించి ఉంటుంది. అందుకనే ఆయనకు త్వరగా విముక్తి లభించింది. ఆయన మరణం నాకు దుఃఖం కల్గించకపోవటానికి కారణం అదే!

పదిరోజుల కర్మకాండ యథావిధిగా నడిపించాడు అన్నయ్య. మూడేళ్ల తర్వాత మా యింట పరామర్శకని అడుగు పెట్టాడు లోకనాథం. మా ఆస్తి పంపకం జరిగిందని అతనికి తెలియదు. నేను ఎవ్వరికీ చెప్పలేదు. కాని, ఊసరవల్లిలా రంగులు మార్చే అన్నపూర్ణ అన్నగారింటికి రాగానే ఆ వార్త చెవిని వేసింది.

నన్ను విడిగా పిలిచి అడిగాడు లోకనాథం. అవునన్నాను. చెప్పలేదేమని నిష్ఠూరమాడాడు.

'ఏదో ఒకనాడు జరగవల్సిందే. నాన్నగారే ఆయన ఇష్టప్రకారం చేసా'రన్నాను.

'సరే, ఇప్పుడు నీకీ యింట్లో అడుగు మోపే స్థలం కూడలేదు. ఇకనయినా మా దగ్గరకి వస్తావా?' అని అడిగాడు.

'ఇంక రెండు నెలలున్నాయి నా పరీక్షలు. ఆ తర్వాత చూద్దాము' అన్నాను.

నా నిర్ణయం అప్పుడే చెప్పాలన్నాడు. ఏవేవో అన్నాడు, మాట మాట పెరిగాయి. ఆఖరికి తన కూతురు కావల్సివస్తే వెంటనే బయలుదేరి రమ్మన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది.

'మీ కూతురికి నేనవసరం లేకపోతే... మీ యిష్టం వచ్చిన వాడినే చెయ్యండి...' అన్నాను.

'ఛీ! తెలివి తక్కువ వాడివి. నీకు నా కూతురునిచ్చి గొంతుక్కోయను. రాజా లాంటి సంబంధం తెస్తాన'న్నాడు. మా ఘర్షణ వింటున్న అన్నయ్య వచ్చి, కలగజేసుకొని, తానూ నాలుగు మాటలన్నాడు. ఏమయితేనేం? మాట మాట పెరిగి నానా మాటలని వెళ్లిపోయాడు లోకనాథం. నా గుండెల్లో రాయి పడింది.

శశితోటి నా అనుబంధం ఎటువంటిదో తానీ ఇంటికి రాకముందే వదినకు తెలుసు. నేను తొందరపడ్డానని వదిన మందలించింది. కాని, నాలో ఆశ చావలేదు. ఏదో ఒక నాటికి లోకనాథంతో ఘర్షణపడి శశికళను తీసుకు తెచ్చుకోవల్సిందే కదా!' ఎప్పుడో జరగవల్సింది ఇప్పుడే జరిగింది — అనుకున్నాను. వెంటనే శశికళతో మాట్లాడా లనుకున్నాను.

కాని, దురదృష్టవశాత్తు తర్వాత పదిహేనురోజుల వరకు ఆమెను కలుసుకోవటం పడలేదు. ఈలోపల ఆమె మనస్సు విరిచేసాడు లోకనాథం!

నేనొకనాడు ఆమెను కాలేజీలోనే కల్సుకొన్నాను. నేను రమ్మన్న వెంటనే నాతో పాటు వచ్చింది. ఇద్దరం బీచికి వెళ్ళాము.

'కనిపించటం మానేశావేం శశీ!' అని అడిగాను.

'వేరే సంబంధం చూసుకోమని చెప్పావుటగా! ...నాన్నగారు చూపించే పెళ్లి కొడుకులకు ఎదురుగా కూర్చుద్దూ!' ఆమె ఎంత వ్యంగ్యంగా మాట్లాడినా దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.

'నువ్వేమన్నా నాకు కోపం రాదు శశీ! జరిగింది చెప్తాను విను...పూర్తిగా విన్నాక నా మాటలు ఏంతవరకు సమంజసమో నువ్వే చెప్పు' అని నా చిన్ననాటి చరిత్రంతా వివరంగా చెప్పాను. మా కుటుంబం విచ్ఛిన్నం అయిపోవటానికి, మా ఆస్తిపాస్తులు హరించి పోవటానికి లోకనాథమే కారకుడని ఒత్తి చెప్పాను. '...నీకు అర్థం చేసుకునే వయస్సు వచ్చింది. కనుకనే ఇన్నాళ్ళు ఆగి ఇప్పుడు పూర్తిగా జరిగిందంతా చెప్పాను. తన దుశ్చింతతో మా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసినా ఇంతవరకు ఆయనలో ఏకోశాన పశ్చాత్తాపం కలుగలేదు. పైగా మన చిన్ననాటి అనుబంధం తెలిసి కూడ నన్ను బెదిరించి తనవైపు త్రిప్పుకోవాలనుకున్నాడు. ఏ సంపద మా కుటుంబాన్ని విడదీసిందో తిరిగి దాన్ని నీవల్ల చేపట్టటం నా కిష్టంలేదు. ఏనాటికయినా ఆయనే పశ్చాత్తాపంతో మన దగ్గరకి వస్తే మనం ఆదరిద్దాం. అంతవరకు ఆయన చేసిన తప్పుకు ఆయన శిక్ష అనుభవించక తప్పదు. నా చదువు దాదాపు అయిపో వచ్చింది. నిన్ను, నన్ను పోషించుకునే స్థితిలో ఉన్నాను. మనకాళ్ళపై మనం నిలబడతాం...మనస్సుల్ని, మనుష్యుల్ని విడదీసే ఆస్తులు మనకు వద్దు, వెంటనే నువ్వు బయలుదేరి వచ్చెయ్యి శశీ!...' అని నచ్చ చెప్పాను.

తను నన్ను అర్థం చేసుకుంటుందని నా కోరిక నెరవేరనుందని ఎంతో ఆశించాను. కాని, నేను నా కథ చెప్పటానికి ముందే తన కనుకూలంగా మరొక రంగులోకి కథ మార్చి చెప్పాడు లోకనాథం. నా ప్రయత్నాలు విఫలమయ్యాయి.

శశి అందుకనే నాతో ఎదురు వాదించింది. '...నాన్నగారు ఏది ఎలా చేసారు అన్నదాన్ని గురించి ఇప్పుడు మాట్లాడి ప్రయోజనం లేదు. ఆయనే కనక ఆనాడు అలా చేయకపోయినట్లయితే, ఈ ఆస్తి కూడ హరించిపోయి ఉండేది. అదిమాత్రం నిజం! ఆయన అలా చేయటంవల్ల ఇప్పుడు ఇంకొక విధంగా నిలబడిందని ఏందుకనుకోకూడదు? ఇప్పుడదంతా మనదే అవుతుంది కదా! ... ఆస్తిమీద మనకాశ వద్దంటావు. బాగానేవుంది. కాని, చిన్నప్పటి నుంచి నన్ను అల్లారుముద్దుగా పెంచి



పెద్దచేసినందుకు వాళ్ళను పెద్ద వయస్సులో వదలి వచ్చెయ్యమంటావా? అంతకంటె కృతఘ్నత మరొకటి ఉంటుందా?...' అంది.

నాలో అసహనం పెరిగిపోయింది. 'నేనే ప్రధానమని అనుకున్నట్లయితే ఆయన రాజాలాంటి సంబంధం తెస్తానంటూ అనే వాడేనా? తను చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవాలని మనస్సులతో ఆటలాడుతున్నాడే కాని ఆయనలో ఇంత జరిగాకకూడ ఏమూలా పశ్చాత్తాపం కలగటంలేదు ... నేను నిన్ను వదులుకోవాలని, అనుకోవటం లేదు శశీ! కాని, ఆయన్ని మనిషిలా మసల మంటున్నాను. నిన్ను పెంచి, పెద్ద చేసినందుకు నీకు కృతజ్ఞత, మమకారం ఉండకూడదనటంలేదు. ఆయన్ని మనవైపు త్రిప్పుకోవాలంటే నీ సహకారం కావాలి. నువ్వు నాదగ్గరకి వచ్చెయ్యాలి— అంతే!'

'నువ్వేం చెప్పినా చేస్తాను. కాని, తల్లిదండ్రుల్ని వదులుకొని రాలేను బావా!'

నాకు కోపం వచ్చింది.

'అయితే ఇల్లరికం వస్తాననే ఆశించావా ఇన్నాళ్ళూ?'

'అదేమో నాకు తెలియదు. నువ్వు నా వాడివి కావాలనే నా కోరిక. అందరం అంతా కలిసి ఉండాలనే ఆశించాను. నేను'

ఈవిధంగా అటు యిటు కాకుండా ఆమె చెప్పటంతో విసుగు పుట్టింది. 'నువ్వుకూడా నన్ను అవమానిస్తానని నే

రాగధార

నెప్పుడూ అనుకోలేదు శశీ! నీ మనసు నొప్పించకూడదని ఇన్నాళ్ళు, ఇన్నాళ్ళు సహిస్తూ వచ్చాను ... నామీద గౌరవం, ప్రేమ ఉంటే నేను చెప్పినట్లు చెయ్యి...' అన్నాను సాధ్యమైనంత మృదువుగా.

'చెప్పు.'

'నువ్వు వెంటనే నాదగ్గరికి వచ్చెయ్యి'

'నన్ని సమస్యలో పడవేసి రాపాడకపోతే చంపివెయ్యకూడదా బావా?' అంది సజల నేత్రాలతో.

నా మనస్సు చలించింది. అయినా వెంటనే దిటవు చేసుకున్నాను. 'నా మనస్సుని బాధపెట్టాలని అటువంటి మాట అనకు శశీ! నీ మార్గానికి నేనడ్డు రాదలుచుకోలేదు. నీ కోరికల్ని తీర్చలేని అసమర్థుడిననుకుంటే, నీకు సుఖశాంతులు ఇవ్వలేని కఠినుడి ననుకుంటే నువ్వు నా దగ్గరకి రానక్కర్లేదు. నిన్ను బలవంతం చెయ్యను. నీకు తెలివి తేటలున్నాయి. నీకు మంచి చెడ్డలు తెలుసు. ఆలోచించుకొని నీ నిర్ణయం చెప్పు. ఎన్నిరోజులు, ఎన్ని నెలలు ఆగమన్నా ఆగుతాను. నీ రాక కోసం ఎన్ని యుగాలయినా నా ఇంటి తలుపులు తెరచి ఉంటాయి...'

అంతే! అప్పైన ఆమెకు చెప్పవల్సింది లేకపోయింది. తిరిగి కాలేజీవద్ద ఆమెను దిగవిడిచి ఇంటికి వెళ్ళిపోయాను.

'ఎన్నోరోజులూ ఎన్నోనెలలు నిరీక్షించాను! అనుక్షణం ఆమె వచ్చి తలుపు తట్టుతుందని ఎదురువెళ్ళి హృదయానికి హత్తుకోవచ్చని ఆశించాను.

ఈ విషయం తెలిసిన వేణు నా కోసం శశికళను ఒప్పించటానికి వాళ్ళింటికి వెళ్ళాడు. లోకనాథం అవమానంచేసి పంపాడని అతని ముఖం చూడంగానే గ్రహించాను. నా ఆశలన్నీ అడుగంటిపోయాయి. నా అంచనాలు పమ్మయిపోయాయి. శశి నా దగ్గరకి రాలేదు. నాపై పగ సాధించటం కోసం లోకనాథం రెండు, మూడు పెళ్ళి సంబంధాలు తెచ్చాడనికూడ నాకు తెలిసింది.

ఈలోపల నా బి.ఏ. పరీక్షలు బాగా వ్రాయలేకపోయాను.

ఒకనాడు పిడుగుపాటులాంటి వార్త విన్నాను ... ఊళ్ళోనే ఒక లాయరుగారబ్బాయితో శశి పెళ్ళి నిశ్చయమైందని తెలిసింది. నా మనస్సు ముక్కలయింది. జీవితంలో కంట తడిపెట్టని నేను ఆనాడు గుండెలు పగిలేలా ఏడ్చాను. కావాలంటే ఆక్షణంలో వెళ్ళి లోకనాథాన్ని బ్రతిమాలి శశిని నాదాన్ని చేసుకోగలిగే వాడినేమో! కాని, తర్వాత జీవితంగా బ్రతకటంకన్న ఇప్పుడు అనుభవిస్తున్న బాధే మెరుగనిపించింది.

సరిగ్గా అన్నం నీళ్ళు లేకుండ ఒంటరిగా గడుపుతున్న నన్ను చూసి వదిన విచలితురాలైంది. ఒకనాడు తన నేస్తురాలింటికి వెళ్ళినప్పుడు శశిని ఒంటరిగా కలుసుకొని మాట్లాడిందట. ఇంటికి వస్తూనే నాకు శశి అన్నమాటలు చెప్పింది.

లోకనాథం తోడల్లుడు — అంటే శశి అసలు తండ్రి ఒక చిన్న గుమాస్తాగిరీ చేసి సంసారంతో బ్రతుకు వెళ్ళదీస్తున్నాడు. శశిని పెంపు ఇవ్వటంవల్ల అతనికి బాగా ఆర్థిక సహాయం చేస్తున్నాడు లోకనాథం. శశికంటె పెద్దవాళ్ళైన ఆడపిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేయించింది కూడ లోకనాథమే! ఇంకా ఒక ఆడపిల్ల పెళ్ళికి వుంది. మగపిల్లలు ముగ్గురు చదువుకుంటున్నారు. ఈ స్థితిలో రక్తసంబంధానికి అంకెపెట్టి శశి కనుక నాదగ్గరకి వచ్చేసే పక్షంలో తన అసలు తల్లిదండ్రులకు చిల్లిగవ్వకూడ ఇవ్వ



లక్ష్మి ఇష్టములను గురించిన తాజా వార్త.

తను నటించిన ఫిల్ము ప్రారంభపు రాత్రి తారలా వెలుగుతున్న లక్ష్మిని మీ ఇష్టములు ఏమిటని అడిగితే, ఆమె నవ్వుతూ ఇచ్చిన జవాబులు:

'సితార్: దాని మధురమైన ధ్వనికి నేను పరవశించిపోతాను. సువాసన: తీరైన అత్తరు వాసనకు నేను ఏదో అయిపోతాను. ఆదివారములు: వారం అంతలో నాకు ఇష్టమైన రోజు. నెలలో అన్నీ ఆదివారాలైతే ఎంత బాగుండును అనుకొంటాను!'

మీ సౌందర్య రహస్యము అని అడిగితే లక్ష్మి చిరునవ్వు చిందిస్తూ అన్నారు. 'లక్స్ ఎల్లప్పుడూ'



'నా సౌందర్య రక్షణకు నేను వేరే ఏ సబ్బునూ నమ్మను. శుద్ధమైన, సౌమ్యమైన లక్స్ నేను ఏరి కోరి వాడే సబ్బు'

హిందుస్తాన్ లీవర్ వారి ఒక నాణ్యమైన ఉత్పత్తి

కని మరెవ్వడినయినా దత్తత చేసుకుంటా నని బెదిరించాడు లోకనాథం. శశి వదినకు చెప్పిన మాటలవల్ల తేలిన సారాంశ మిది.

తన ఒక్కదాని సుఖం చూసుకొని తన తోడబుట్టిన వాళ్ళగతి ఆలోచించటం లేదని ఆమెను అంతా తలోకవైపున సాధించిపోసారు. ఆమె మనస్సు విరిగి పోయింది. పరిస్థితులకి రాజీపడిపోయింది. లోకనాథం చూపించిన పెళ్ళి సంబంధానికి ఒప్పుకుంది.

కాని, నాలో చివరి ఆశ చావలేదు. 'వదినా! శశితండ్రికి డబ్బు కావలిస్తే నేనిస్తాను. ఎలాగయినా ఆమెను ఒప్పించి తీసుకురావూ?' అన్నాను.

'నీకంటె ముందే ఆలోచించి ఆ విషయం చెప్పాను మధూ!... శశి ఇప్పుడు పూర్తిగా పిచ్చిదయిపోయింది. నువ్వే తనకు మూర్ఖపు పట్టుదలతో అన్యాయం చేసావనుకుంటోంది...'

'నువ్వుకూడ అదే నమ్ముతున్నావా వదినా?' అన్నాను బాధగా.

'లేదుబాబూ! మీ ఇద్దరి బాధలు నాకు తెలుసు. ఇంతకీ భగవన్నిర్ణయం వేరుగా ఉంది. ఎవర్నని ప్రయోజనంలేదు. మనం ఉత్త మట్టి బొమ్మలం, అంతే!' అంది.

* * *

'అవును. వదిన అన్నమాటలు ఆణిముత్యాలు. మట్టిబొమ్మలం కనుకనే ఎవరికి వాళ్ళం కావల్సింది చేసుకోలేక పోయాము...నువ్వే చెప్పు రాధా! శశి నన్ను దూరం చేసుకుందా? లేక నేను శశిని దూరం చేసుకున్నానా?...' అని నా కళ్ళల్లోకి చూసాడు అతను.

నేను క్షణంపాటు తటపటాయించాను.

'నేనేమీ అనుకోనులే రాధా! నీఉద్దేశ్యం తెలుసుకుందామని మాత్రమే అడిగాను.'

'స్వార్థంవల్ల ఒకరు, పంతాని కొకరు, నీతికి కట్టుబడి ఒకరు అంతా తలోక విధంగా ఆ అమాయకురాల్ని అగ్నిపరీక్షకు గురి చేసారు. ఎవరికి వారు తమ ఆశయాలనే చూసుకున్నారు కాని బాధ్యతలకు కోరికలకు మధ్యపడి నలిగిపోతున్న ఆమె లలిత హృదయాన్ని ఎవ్వరూ గుర్తించ లేదు. నిజంగా ఆమె దురదృష్టవంతురాలు!... మిమ్మల్ని దూరం చేసుకుంది. కాని బాధ్యతలకు, కోరికలకు మధ్య సంఘర్షణ వస్తే మనదేశంలో పుట్టి పెరిగిన ప్రతి ఆడపిల్ల ఏం చేయవల్సి వస్తుందో అదే చేసింది. అది ఆమెకు తప్పనిసరి!' అన్నాను.

అతడు నావైపు నిమిషంపాటు సాశ్చర్యంగా చూస్తూండి పోయాడు. నా మాటలకేమనుకున్నాడో నాకంతుపట్ట లేదు.

'నామాటలు మిమ్మల్ని నొప్పించాయనుకుంటాను...' అన్నాను మృదువుగా.

'లేదు రాధా! సరిగ్గా వదిననోటివెంట ఇవే మాటలు విన్న నాకు మళ్ళీ ఆమాటలే గుర్తుకు వచ్చాయి. అంతస్తులు మారినా, ప్రదేశాలు మారినా, వ్యక్తులు మారినా మనసులు, మమతలు ఒక్కలా ఉండ వచ్చు. కాని, అదే నా విషయంలో నిజమయ్యేసరికి చిత్రంగా ఉంది.'

'బెనారస్‌లో చదివానన్నారు. అదెప్పుడు?'

'ఈ కథకు చివరిభాగం అదే!...' అని తరువాతికథ చెప్పటం మొదలు పెట్టాడు.

* * *

తన పంతాన్ని నెగ్గించుకున్నాడు లోకనాథం! ప్రొత్తడాబా కొన్నాడు. శశికళ పెళ్ళి జరిపించాడు. అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. శశి ఎలా బ్రతుకుతోందో నాకు తెలియదు. కాని, నేను మాత్రం దిగజారిపోయాను. మనశ్శాంతి లేదు. అందుకనే పరీక్షలు సరిగా వ్రాయలేకపోయాను. బి. ఏ. లో క్లాసు రాలేదు... ఇన్నేళ్ళచదువు వృధా అయింది.

వేణు ఎంత ఓదార్చినా, వదిన ఎంత సానుభూతి చూపినా నా మనస్సులోని వేదన తగ్గలేదు. చేతిలోని కుంచె ఎండిపోయింది. నా చుట్టూ ఉన్న శశికళ వందలాది చిత్రాలన్నీ నన్ను మరింత కలచివేసాయి.


ఏడేళ్ళ పిల్లగా నాతో పరిచయమైన నాటినుండి పదిహేడేళ్ళ వయస్సులో నన్ను వదలి పోయేవరకు ఆమె అందాలన్నిటినీ ఏరికోరి కూర్చి చిత్రించిన ఆ చిత్రాలు కళ్ళబడినప్పుడల్లా బ్రతుకు మరింత బాధా భరితమయ్యేది.

ఒకనాడు పిచ్చి ఆవేశంలో ఆమె చిత్రాలన్నీ చింపి పోగులు పెట్టి నిప్పు పెట్టి అంటించేసాను. నన్ను నేను దహనం చేసుకున్నట్లుగా ఆ రాక్షస కృత్యంతో నా గుండెలు మండిపోయాయి.

ఆ పొగచూసి నా గదిలోకి పరుగున వచ్చిన వదిన నిర్ఘాంత పోయింది.

నేను ఫెళ్ళున నవ్వాను. నా నవ్వు నాకే వికృతంగా వినిపించింది. 'ఇది శశి చిత్రాన్ని, స్మృతుల్ని రూపు మాపటం కాదు వదినా!... ముక్కలు చెక్కలయి చచ్చిపోయిన నా హృదయానికి దహనం జరుపుతున్నాను.'

నా మాటలు విన్న వదిన మనస్సు చెదిరిపోయింది. ఆ మంటల్ని ఆర్పివేసి ఏవో కొన్ని చిత్రాల్ని కాపాడాలని వృధా ప్రయత్నం చేసింది. నేను రాక్షసుడిలా



ప్రవర్తించాను. ఆమె చేతుల్లోని శశి చిత్ర ఖండాల్ని లాక్కుని ఖండఖండాలుగా చింపి పోగులు పెట్టాను.

అమె 'మధూ!' అని వెర్రికేక పెట్టి నిస్సహాంతంగా కౌగలించుకొని చంటి పిల్లలా ఏడ్చేసింది. అప్పటికి కాని నన్ను పట్టుకున్న పిశాచం వదలిపెట్టలేదు. ఆమెను పొదివి పట్టుకున్నాను. జలజల రాలిన ఆ అశ్రువులు ఆమె శిరస్సుపై వర్షించాయి. అశ్రుధారలతో ఆవేదన కొంత కరిగిపోయింది.

'నాకోసమయినా నువ్వు గుండె దిటవు చేసుకో మధూ! ఇంకెప్పుడూ ఇటువంటి పిచ్చిపని చెయ్యనని నాకు మాటియ్యి...' అంది ఏడుస్తూ.

'అంతా పూర్తయిపోయింది వదినా! ఇంక చేయటానికి మాత్రం ఏముంది?' అన్నాను నిస్పృహగా.

ఆమె నా ముఖాన్ని తనవైపు త్రిప్పుకొని నాకళ్ళు తుడిచి తనకళ్లు తుడుచుకుంటూ అంది. 'ఏం పిచ్చివాడివయ్యా నువ్వు! శశి దురదృష్టవంతురాలు— నిన్ను దక్కించుకోలేక పోయింది. నీకేం లోటయ్యా మరదీ! రాజాలాంటి బిడ్డవి.'

మనస్సులో అగ్ని రగులుతున్నా ఆమె పైకి నవ్వగలిగింది...నా కటువంటి నవ్వును నేర్పింది. చిన్నప్పుడు ఆంటీ అనీ తల్లి ప్రేమను చవిచూపింది. ఆతర్వాత శశి తోటి అనుబంధం స్త్రీ హృదయంలోని మమతానురాగాలను ధారపోసి నా జీవితాన్ని తీర్చి దిద్దింది. నా దురదృష్టంవల్ల ఆ జీవితం అసంపూర్ణమే అయినా వదిన దగ్గరగా ఉండటం పునర్జన్మను ప్రసాదించి ఈ దివ్వెను నిలబెట్టింది.

ఇంట్లో ఆమె, బయట వేణు నన్ను అహర్నిశలు కాపు కాసి కాపాడారని చెప్పవచ్చు. స్థలం మారితే నాకు మనశ్శాంతి కలుగుతుందని ఆమె అన్నమాటల్ని వేణు ధృవ పరిచాడు. నాకూ కొన్నాళ్లపాటు దేశమంతా తిరిగి రావాలన్న కోరిక కలిగింది.

అన్నయ్యతో చెప్పి నా ప్రయాణాని కేర్పాట్లు చేయించింది వదిన.

'ఎప్పటికప్పుడు ఉత్తరాలు వ్రాస్తూండు. నీ ఆరోగ్యం జాగ్రత్త. రా త్రిళ్లు పాలు త్రాగుతూ ఉండు. అనుక్షణం నీక్షేమం కోసం పరితపించే వదిన ఇక్కడ ఉందని మర్చిపోకు. డబ్బుకోసం ఇబ్బంది పడకు. వారం ముందుగా ఎ్రడను

వాస్తూండు నేను పంపిస్తాను.'
ా కళ్ళు నీళ్ళతో సాగనంపింది వదిన.
ునస్సు ద్రవించిపోయింది. ఆమె కోసమే
దిటవు చేసుకున్నాను.
ఫోటో ఒకటి ఇయ్యి వదినా!
తీరికయినప్పుడు కబుర్లు చెప్పు
కుంటాను.' అన్నాను నవ్వు తెచ్చుకుంటూ.
ంతకన్నానా? అలాగే పట్టుకు వెళ్ళు,
, అది చూసినప్పుడయినా నామాటలు
కు వచ్చి నీ ఆరోగ్యం జాగ్రత్తగా
ుకుంటావు.' అంది. ఆమె ఇచ్చిన
పర్సులో దాచుకున్నాను.
'నీవు వచ్చేవరకు నాకు విశాఖ
శూన్యంగా ఉంటుందిరా మధూ!,
సాగనంపాడు వేణు.
ళ్ళు కనుమరుగయ్యే వరకు కన్నీటి
మధ్య అస్పష్టమైన వాళ్ళ రూపాల
చెయ్యి ఊగిస్తూనే ఉన్నాను.
విధంగా నాయాత్ర ప్రారంభమైంది.
లలపాటు దేశమంతా తిరిగి చూసాను.
మైన ప్రకృతి వింతల్ని, అద్భుత
లను, మహానగరాలను, చరిత్ర
కెక్కిన స్థలాలను చూసాను.
దేశాటనతో నా మనస్సుకెంతో

రాగధార

ఊరట కలిగింది. హృదయం విశాలమై
నట్లుయింది. రకరకాల భాషలు. నాగరిక
తలు, మతాలు, జాతులు నాకెదురయ్యాయి.
వింత మనస్తత్వాలతో పరిచయమైంది.
ఇంతవరకు తెల్సుకున్నదంతా చాలా తక్కువ
అని ఇంకా తెల్సుకోవల్సిందెంతో ఉందని
అనిపించింది.

నేను సందర్శించిన స్థలాలను గురించి
చెప్పాలంటే ఒక మహాభారతమంత అవు
తుంది. నేను పొందిన అనుభూతుల్ని
భాషలో పెట్టాలంటే ఒక ఉద్గ్రంథమవు
తుంది. కన్నుల విందుచేసి నన్ను ముగ్ధు
డిని కావించిన స్థలాలు ఎన్నో ఉన్నాయి.

...కాశ్మీరు లోయలు, సిమ్లా మంచు
కొండలు, మహాబలేశ్వర్, అరుణ సంధ్య
లలో కన్యాకుమారి, అజంతా ఎల్లోరా
గుహలు, హంపీ మహాబలిపురాలు, అద్భుత
శృంగార శిల్ప సౌందర్యానికి ఆటపట్టులైన
ఖజురాహో కోణార్కలు, ప్రపంచ వింతలలో
ఒకటిగా పన్నెకెక్కిన తాజ్ మహల్, కుతుబ్
మీనార్, విక్టోరియా మెమోరియల్ ...
ఇన్నిటిని చూసాను. ఒక్కొక్క కట్టడాన్ని

చూస్తే ఒక్కొక్క భావం కలిగేది.
చరిత్ర ప్రసిద్ధమైన ఈ మహా కట్ట
డాలను, ప్రకృతి వింతలను చూసి ఎంత
ముగ్ధుడినయ్యానో గుజరాత్‌లోని సింహా
లను, రాజస్థాన్‌లోని పక్షుల గుంపుల్ని
మధ్యప్రదేశ్‌లోని ఏనుగుల్ని చూసినప్పుడు
అంత ఆనందించాను.


మహానగరాలన్నీ దర్శించాను. మహా
నదులన్నీ చూసాను. నెహ్రూ వర్ణించిన
ఆధునిక దేవాలయాలను ... భక్రానంగల్,
మెట్టూరు, కొయనా, నాగార్జునసాగర్
డాములను చూసాను. ప్రకృతి నడుమలో
పెట్టిన మానవశక్తికి నా ఒళ్ళు గగుర్పొడి
చింది.

పుణ్యక్షేత్రాలన్నీ దర్శించాను. మన
దేశంలో ఇంక చూడవల్సిందేమీ లేదన్నంతగా
చూసాను. ఇల్లువదలి అప్పటికి ఆరునెలలు
దాటింది. ప్రతివారం నేనెక్కడఉన్నా
అక్కడి వింతలు వివరిస్తూ వదినకు
ఉత్తరం వ్రాసేవాడిని. నేనిచ్చిన ఎడ్రసు
ప్రకారం ఆమె నా ఆరోగ్యాన్ని గురించి
హెచ్చరిస్తూ నాకు జవాబు వ్రాసేది.

ప్రతిచోట శశికళ స్మృతులు నన్ను
వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె సరసన
లేని యాత్ర కొన్నాళ్ళు విసుగు కల్గిం
చింది. ఎంత అందమైన దృశ్యాన్నీ
చూసినా చిత్రరచన సాగేదికాదు. ఆ
తర్వాత వదిన వ్రాసే ఉత్తరాలు నాకు
కొంత ధైర్యం కల్గించాయి. తీరికయి
నప్పుడు వదిన ఫోటో చేతిలోకి తీసుకొని
అలా చూస్తూ కూర్చుంటే ఆమె అను
రాగ ధారలను కురిపిస్తూ ఏవో ధైర్యో
క్తులు పలుకుతున్నట్లు అనుభూతి చెందు
తూండేవాడిని. నన్నుత్తేజపరచిన ప్రేమ
మూర్తి ఆమె!

ఆమెవల్లనే తిరిగి కుంచెను చేత పట్ట
గలిగాను. ఆ యాత్రలో మొత్తం రెండు
వందల లేండ్‌స్కేప్స్, నూటయాభై
స్కెచెస్ నేను చిత్రించాను.

కాశీ విశ్వవిద్యాలయం చూసాక అక్కడి
వాతావరణం నన్ను ముగ్ధుడిని చేసింది.
అక్కడ కొన్నిరోజులు తప్పకుండా చదువు
కోవాలనిపించింది. వెంటనే ఎమ్. ఏ. చదవ
టానికి నిశ్చయించుకున్నాను. కాని; తిరిగి
క్రొత్త సంవత్సరం ప్రారంభించటానికి
ఇంకా మూడునెలలు వ్యవధి ఉంది.



అంతవరకు ఏంచేయాలో తోచలేదు. తిరిగి ఇంటికి వెడితే నా పరిస్థితి ఎలా ఉంటుందో నాకే తెలియదు. అన్నయ్యా వదినల్ని వేణుని చూడాలని ఉన్నా విశాఖకు తిరిగి వెళ్ళాలంటే అంతరాంతరాలలో ఏదో భయం మొదలయింది.

వదిన అభిప్రాయం తెలుసుకుందామని కాశీలో ఎమ్.ఏ. చదవాలని ఉందని వ్రాశాను. నేనాశించినట్లుగానే నన్ను ప్రోత్సహిస్తూ వదిన వ్రాసింది. కాని, ముందొకసారి ఇంటికివచ్చి వెళ్ళమని ఆమె వ్రాసింది. నా మనస్సులోని భయాన్ని ఆమె పసికట్టింది.

ఆ తర్వాత విశాఖ వెళ్ళకపోయినా చదువు వంకతో ఆమెను ఒప్పించవచ్చును. కాని, ఈ స్థితిలో ఇంటికి వెళ్ళకపోతే ఆమె బాధపడుతుంది. అందుకని మనస్సుని సమాధాన పరచుకొని ఇంటికి బయలు దేరాను.

తీరా కలకత్తా చేరుకున్నాక మరొకసారి శాంతినికేతన్ చూడాలనిపించింది. అనుకున్నదే తడవు శాంతినికేతన్ చేరుకున్నాను. రవీంద్రుని విశ్వప్రేమ ఆలాపనలు వెల్లి విరిసే ఆ పవిత్ర స్థలాన్ని దర్శించి పరవశించి పోయాను. ఋషి వాటికలవంటి కుటీరాలలో సకల కళాపారంగతులవుతున్న విద్యార్థులను చూసి ముగ్ధుడనైపోయాను. అక్కడ నేను నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయనిపించింది. మొదటిసారి వెళ్ళినప్పుడు ఒక రోజే ఉండటంవల్ల అంతా వివరంగా చూడలేకపోయాను. కాని, ఈసారి ఆ ప్రదేశాన్ని వదలిపెట్టాలని పించలేదు. ఎమ్. ఏ. తర్వాతయినా చదవవచ్చును ... ముందొక సంవత్సరంపాటు అక్కడ చిత్రకళ అభ్యసించాలని వీలయితే శిల్పాన్ని కూడా నేర్చుకోవాలని అనుకున్నాను.

అక్కడే ఇంకో రెండు రోజు లాగితే ఆపనే చేసి ఉండేవాడిని. కాని, ఒకదారుణ విషాద వార్తను తెలుపుతూ వేణు వ్రాసిన జాబు నా మనస్సును కలచివేసింది.

వేణు తండ్రికి పెద్ద జబ్బుచేసి హఠాత్తుగా పోయాడట! ఇంక క్షణంపాటు కూడ నిలబడలేక పోయాను. శాంతినికేతన్‌ను అశాంతితో వదలిపెట్టాను.

(ఇంకా ఉంది)

కొన్ని సామాన్య వ్యాధులకు పథ్యాపథ్యములు

అజీర్ణ రోగులకు పథ్యాపథ్యములు

తిన్న ఆహారం జీర్ణంకాకపోవడం యీ వ్యాధి యొక్క ముఖ్య లక్షణం.

పథ్యములు:— బాగా గంజివార్చేసిన మంచి పాతబియ్యపు అన్నం తినవచ్చును. పేలాల గంజి త్రాగవచ్చును. పెసరకట్టూ అన్నం తినవచ్చును. పలుచని ఆవుమజ్జిగ అన్నంలో కలుపుకొని తినవచ్చును. పొట్లకాయకూర, బీరకాయకూర, వంకాయకూర, నక్కదోసకాయకూర, కాకరకాయకూర, లేతముల్లంగి కూర, చుక్కకూర, చెంచలికూర, అల్తపత్తి కూరలు తినవచ్చును. ఉసిరికకాయ పచ్చడి తినవచ్చును. అల్లం కూరలలో వేసుకోవచ్చును. పచ్చడి చేసుకొని తినవచ్చును. జింక, కుందేలు, నెమలి, లావుకము, పూరేడు వీని మాంసములు తినవచ్చును. ద్రాక్ష, దానిమ్మ, ఆపిల్ పళ్ళు తినవచ్చును. తేనె మితంగా త్రాగవచ్చును. చేదు, వగరు గల పదార్థాలు తినడం మంచిది. భోజనానంతరం తాంబూలం వేసుకోవచ్చును. మరిగించి చల్లార్చిన పరిశుభ్రమైన నీరు త్రాగడం శ్రేయస్కరం. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం యౌవనంలో ఉన్నవాళ్ళు వ్యాయామం చెయ్యడం ఎంతైనా అవసరం. లేదా ఒకటి రెండుమైళ్ళు దూరం నడవడం మంచిది.

అపథ్యములు:— క్రొత్త బియ్యపు అన్నం, ఉడకని అన్నం, అత్తెసరుపెట్టి వండిన అన్నం తినకూడదు. కాఫీ, టీలు త్రాగకూడదు. రోగం తగ్గేటంతవరకూ బచ్చలకూర అన్నం తినకూడదు. చేపలు తినకూడదు. అధికంగా నీరు త్రాగకూడదు. గురుకర, మలబద్ధక పదార్థాలను తినటం మానెయ్యాలి. ఆలు, కంద, చేమ మొదలగు దుంప కూరలను తినకూడదు. గోధుమలతో తయారుచేసే వంటకాలు కూడా ఈ రోగులకు అపథ్యమైనవే. నూనెతోను, నెయ్యితోను చేసే పిండివంటల్ని తినకూడదు. వేపుడుకూరలు తినకూడదు. పాలు త్రాగకూడదు. పథ్యములలో చెప్పినవి కాక మిగిలిన జంతువుల, పక్షుల యొక్క మాంసములు అపథ్యకరమైనవి. చారపప్పు తినకూడదు. నేరేడుపళ్ళు తినకూడదు. చమురు గల పదార్థాలు, ఉడకని పదార్థాలు, పండని పదార్థాలు తినడం— మద్యపానం చెయ్యడం— వెంటవెంటనే భోంచెయ్యడం— అమితంగా భోంచెయ్యడం— నిద్రపోకుండా బలవంతంగా మేల్కొనడం— మలమూత్రాలవేగాన్ని నిరోధించడం యివన్నీ యీ రోగులకు అపథ్యాలే.

అతిసార రోగులకు పథ్యాపథ్యములు


అమితంగాను, వికృతిగాను విరేచనాలయే రోగానికి 'అతి సారము' అని అంటారు.

పథ్యములు:— బాగా విరేచనాలవుతున్నప్పుడు గ్లూకోజు నీళ్ళుతప్ప యింకేమీ పుచ్చుకోకుండా ఉండడం శ్రేయస్కరం. విరేచనాలు బాగా తగ్గేక బాగా ఉడికించి చక్కగా గంజివార్చిన మంచి పాతబియ్యపు అన్నంలో పెరుగుమీది తేట కలుపుకొని తినవచ్చును. పేలాలగంజి త్రాగవచ్చును. పల్చని ఆవు మజ్జిగ కలుపుకొని అన్నం తినవచ్చును. కంది కట్టూ అన్నం, పెసరకట్టూ అన్నం తినవచ్చును. అరటికాయకూర, పొట్లకాయకూర, చుక్కకూర తినవచ్చును. దానిమ్మ, నేరేడు, అరటి, రేగు, వెలగ, మద్దిపళ్ళు తినవచ్చును. విరేచనాలు కట్టేశాక ఆవుపెరుగు అన్నం తినవచ్చును. వగరుగా ఉండే పదార్థాలు, లఘువుగా వుండి దీపనకరంగా ఉండే అన్నపానీయాలు యీ రోగులకు పథ్యములయినవి. ఈ రోగం గలవారు బాగా విశ్రాంతి తీసుకోవాలి.

అపథ్యములు:— క్రొత్తబియ్యపు అన్నం, బాగా ఉడకని అన్నం, చల్దన్నం, మాంసమిశ్రితమైన అన్నం, మిక్కిలి వేడిగా ఉండే అన్నం, చమురు గల గురుత్వపదార్థాలు, ఎక్కువగా ఉప్పుకారం పులుపుగల పదార్థాలు, పిండివంటలు, బెల్లం, చెరకురసం యివన్నీ అతిసార రోగులకు అపథ్యమయినవే. సారా, బ్రాంది మొదలగు పానీయాలను యీ రోగం గలవారు త్రాగకూడదు. గోధుమ రొట్టెలు, చపాతీలు మొదలగునవి తినకూడదు. మినపప్పుతో చేసే అప్పడాలు, గారెలు, కుడుములు, మొదలగునవి తినకూడదు. మునగకాయకూర, గుమ్మడికాయకూర, పనసకాయకూర, దోసకాయ కూర, ఆనపకాయకూర, అగాకరకాయకూర, కాకరకాయకూర, దొండకాయకూర, కంద

(04వ పేజీ చూడండి)

ఆహ్వానం



శ్రీమతి ప్రభావతీ నారాయణరావు

'సార్ ! మీకు లెటరు వచ్చింది.'

అంటూ ప్యూన్ రంగయ్య ఒక కవరు టేబిల్ మీద పెట్టి వెళ్లిపోయాడు.

కవరు చూస్తూ ఒక్కక్షణం తెల్ల బోయాడు మాధవ్. సాధారణంగా తనకు లెటర్సు రావు. ఒకేవేళ వచ్చినా యింటి అడ్రసుకే వస్తాయికాని ఆఫీస్‌కు అసలురావు.

'కవరు చేత్తో పట్టుకొని ఎవరు వ్రాశారో చూసుకోకుండా పిచ్చిగా ఆలో చిస్తున్నా నేమిటి' అని అనుకుంటూ కవరుచింపి చదవడం మొదలు పెట్టాడు.

డియర్ మాధవ్ ! నమస్తే !

'ఎవరీ వ్యక్తి ?' అని ఆశ్చర్య పోతున్నారా ? మీరెప్పుడూ నన్ను చూసి వుండరు. కాని మిమ్మల్ని నేను రోజూ చూస్తూ వుంటాను. ఎన్నాళ్లనుంచో మీతో మాట్లాడాలనీ మీతో స్నేహం చేయాలనీ కోరికగా వుంది. ఇంతకూ నన్ను పరిచయం చేసుకోలేదుకదూ ? నాపేరు రాధిక. అంతకన్నా ఎక్కువ వివరాలు అక్కర్లేదనుకోండి. మీరీ విషయంలో అన్యధా భావించరని తలుస్తాను. ఏమిటీ మనిషి అనుకుంటున్నారు ? మీ స్నేహం కావాలని నిష్కల్మష హృదయంతో మిమ్మల్ని కోరుచున్నాను. అటువంటి సంస్కారం, నాగరికత మీలో వున్నాయని నా నమ్మకం. ఈ విషయంలో మీ కెటు వంటి అభ్యంతరం వుండదనుకుంటా. త్వరలోనే మీ ఎదుట పడేందుకు ప్రయ త్నిస్తాను. ఇక వుంటాను.

ఇట్లు
మీ స్నేహం కోరుచూ
రాధిక.

వుత్తరం పూర్తిగా చదివిన మాధవ్ ఒక్కక్షణం నిశ్చేష్టుడయాడు. తలంతా ఆలోచనలతో వేడెక్కింది. 'ఏమిటీవిపరీతం?. ఎవరీ రాధిక'? అయినా ఆమె తనస్నేహం కోరడం ఏమిటి ?

ఎప్పుడూ ఆటువంటి సంఘటన ఎదు ర్కోని మాధవ్ అయోమయస్థితిలో పడ్డాడు.

మాధవ్‌కు అసలు ఆడవాళ్ళతో మాట్లాడ్డం అన్నా, వాళ్ళతో స్నేహం చేయడమన్నా అదొకరకమైన భయం, యం. ఎ. చదివినా కాలేజీలో 'ఏదో అవసరంవస్తే తప్ప ఏ అమ్మాయితోనూ ఐదునిముషాలకన్న ఎక్కువసేపు మాట్లాడి

[illegible]
తం స్నేహం కోరడం ఏమిటి? అందు లోనూ తనకు పెళ్ళయి పదిరోజులన్నా కాలేదు. భార్య విశాలతో సరిగ్గా మాట్లాడ కన్నా లేదు. 'యిప్పుడీ సమస్య ఏమిటి?' ఆలోచనలలో ఏపని చేయబుద్ధి కాలేదు.

నాలుగవగానే స్కూటర్ స్టార్ట్ చేసి యింటికి బయల్దేరాడు మాధవ్.

యింటికి రాగానే వదినగారు పెట్టిన టిఫిన్ తిని కాఫీ తాగాడు. మళ్ళీ రాధిక గుర్తుకువచ్చి ఆలోచనలు ముసురుకున్నాయి. ఆలోచిస్తూ కూర్చుంటే యింటో వాళ్ళందరూ తనను ఆటలు పట్టిస్తారేమో ననిపించింది మాధవ్‌కు. వెంటనే స్నానం చేసి బట్టలు వేసుకొని, 'అమ్మా! మూర్తి వాళ్ళింటికి వెళ్తొస్తాను' అంటూ బయట పడ్డాడు.

చిన్నప్పటి నుంచి మూర్తికి, మాధవ్‌కి మంచి స్నేహం. మూర్తికి పెళ్ళయి రెండు సంవత్సరాలయింది. మూర్తి భార్య సరోజ కూడా చాలా చనువుగా వుంటుంది. 'రావోయ్! తమ్ముడూ!' అంటూ ఆప్యాయంగా ఆహ్వానిస్తుంది తనను. రాధిక ఉత్తరం విషయంలో మూర్తి అభిప్రాయం ఏమిటో అడగాలి అనుకొన్నాడు మాధవ్.

ఆ సమయంలో వచ్చిన మాధవ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.

'పెళ్ళయి పది రోజులన్నా కాలేదు. అటువంటి అందమైన సాయంకాలాలు ఆనందంగా గడపవలసింది పోయి, ఇలా రోడ్లట్టుకు తిరుగుతున్నావేమిటి?' అన్నాడు మూర్తి.

అప్పుడే లోపల్నించి వచ్చిన సరోజ మాధవ్‌ని చూసి 'అదేం ఒక్కడివే వచ్చావు? మా మరదల్ని తీసుకు రాలేదేం?' అంది.

'ఆషాఢ మాసంట కదా! మొన్న వాళ్ళ మామయ్యగారు వచ్చి వాళ్ళింటికి తీసుకు వెళ్ళారు.' అన్నాడు మాధవ్.

'ఓహో! అదా సంగతి?' నవ్వుకుంటూ లోపలికి వెళ్ళింది సరోజ.

'అయితే అబ్బాయిగార్కి విరహ బాధ అన్నమాట.' అన్నాడు నవ్వుతూ మూర్తి.

'నోరు ముయ్యరా! అసలు సంగతి చెప్ప నీయకుండా ఏమిటా వాగుడు?' అన్నాడు కొంచెం కోపంగా మాధవ్.

'సరే! చెప్పు ఏమిటా కథ?'

ఆషాఢం

'ఇదిగో యిది చదువు' అంటూ రాధిక వ్రాసిన కవరు అందించాడు మాధవ్.

ఉత్తరం పూర్తిగా చదివిన మూర్తి గట్టిగా నవ్వాడు.

అతని నవ్వు చూసి ఆశ్చర్య పోయాడు మాధవ్.

'నువ్వు చాలా అదృష్టవంతుడివిరా!' అన్నాడు సీరియస్‌గా.

'అంటే?' అన్నాడు అర్థం గాక.

'ఏం లేదోయ్! రాధికే స్వయంగా మాధవుడి స్నేహాన్ని కోరి వచ్చింది.

'ఛ! ఏమిటా మాటలు! పెళ్ళయిన వాణ్ణని తెలిసుండి కూడా.'

ఇంతట్లో సరోజ కాఫీ కప్పులతో వచ్చింది.

కాఫీ త్రాగి 'ఇంక వెళ్తాను' అంటూ బయటకు నడిచాడు మాధవ్.

'ఉండు! నేనూ వస్తాను' అంటూ తను కూడా బయలుదేరాడు మూర్తి.

ఉత్తరం విషయంలో తన సలహా కోరుతున్నాడని చెప్పకుండానే గ్రహించాడు మూర్తి.

మూర్తిని ఎక్కించుకొని స్కూటర్ పోనిచ్చాడు మాధవ్. కొంతదూరం వెళ్ళాక యిక్కడ ఆపు అన్నాడు మూర్తి. అడగవలసిన విషయం ఎలా అడగాలో అర్థంకాలేదు మాధవ్‌కు.

మాధవ్ ఉద్దేశం గ్రహించి నట్టుగా—

గులాబీలతో గుల్‌కంద్

కావలసినవి:—

పంచదార—ఒక గ్లాసుడు.

గులాబీ పూలరేకలు—ఒక గ్లాసుడు.

చేసేపద్ధతి:— పంచదారలో గులాబీ పూల రేకులను కలిపి ఎత్తైంలో వేసి బాగా పిసకాలి. అలా పిసికితే రేకులనుండి తడివచ్చి పంచదార అంతా కరుగుతుంది. బాగా కరిగే వరకు పిసకాలి. కరిగింతర్వాత తడిలేని సీసాలో ఎత్తి పదిరోజుల పాటు ఎండలో ఉంచాలి సీసాను. బాగా ఊరిన తర్వాత తింటూ ఉంటే ఒంటికి మంచిది.

—మూర్తిశ్రీ జయసౌజన్య

'పెట్టి ఉత్తరానికి యింత ఆలోచనా ఏమిటి? అయినా ఆమె కోరింది స్నేహం మాత్రమే కదా! మగవాడివై యుండీ ఆడ పిల్లతో స్నేహం చేయడానికి భయపడితే ఎలా? ధైర్యంగా వుండాలి. ఇలాంటి చిన్న విషయంలో పిచ్చిగా ఆలోచించడం మగవాడి లక్షణం గాదు. మళ్ళీ యింకో ఉత్తరం రావచ్చు. ఎదురుచూడు. ఇక్కడ కొద్దిగా పని వుంది వెళ్తాను' అంటూ ఎదురుగుండా ఉన్న షాపువైపు దారి తీశాడు మూర్తి.

భోజనం చేసి పక్కమీద వ్రాలిన మాధవ్‌కు ఆలోచనలు ఎంతకీ నిద్ర పట్టనీయలేదు. మూర్తి అన్న మాటలు గుర్తుకి వచ్చి పౌరుషాన్ని తెప్పించాయి.


* * *

మూర్తి అన్నట్టుగానే మూడు రోజుల తరువాత మాధవ్ ఆఫీసులో వుండగా ప్యూన్ రంగయ్య ఒక కవరు టేబిల్ మీద పెట్టి వెళ్ళాడు.

ఈసారి ముందు విధంగా ఆలోచించకుండా కవరు చింపి చదవడం మొదలు పెట్టాడు.

డియర్ మాధవ్! నమస్తే!

నేనింతకుముందు వ్రాసిన — అందినదని తలుస్తాను. నాతో స్నేహం చేయడాన్కి అభ్యంతరం వుండదన్న ధైర్యంతో నేనీ వుత్తరాన్ని వ్రాస్తున్నాను. ఎదుట పడకుండా ఏమిటీ వుత్తరాలు. అనుకుంటున్నారా? అందుకే ప్రయత్నిస్తున్నాను. నేను మీ ఆఫీస్‌కు రావడం బాగుండదు, అందుకని ఎక్కడికైనా ప్రోగ్రాం వేసుకుంటే బాగుంటుంది కదూ? అన్నీ నేనే నిర్ణయిస్తున్నానని కోపంగా వుందా? ముందు నేను మీ ఎదుట పడాలికదా మరి. నాకు 'జమ్రుద్ మహల్'లో పిక్చరు చూట్టం అంటే చాలా యిష్టం. తరువాత మీ యిష్టం. చెపుదురుగాని ఎల్లుండి ఆదివారం కదా! నన్ను జమ్రుద్ దగ్గరే కలుసుకోండి. ఎలా గుర్తుపట్టాలి అనుకుంటున్నారా! నా డ్రస్ చూసి గుర్తుపట్టండి. ఎర్రంచు తెల్లచీర, అదే ఎరుపురంగు జాకెట్, తల్లో ఎర్రగులాబీ ... ఈ సారి సునాయాసంగా గుర్తు పట్టగలరనుకుంటా. ఆదివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు సరేనా? నాకుమాత్రం ఆశాభంగం కలిగించకండేం. తప్పకుండా ఆరోజు మీకోసం



గ్లాక్సోస్-డి వేసవి అలసటను
తక్షణం పోగొట్టగలదు!
గ్లాక్సోస్-డి ఎన్నో రుచికర
మార్గాలలో తీసుకోండి!
రోజులు వేడెక్కిన కొద్దీ, మీరు తేలికగా అలిసి పోగలరు. మీ శక్తి అంతా ఏమైందా అని ఆశ్చర్యం మీకు కలుగుతుంది. చల్లవరచు గ్లాక్సోస్-డి తెచ్చుకోండి. ఒక గ్లాసు నీళ్లతో రెండు చెంచాలను కలపండి.
మీరు త్రాగేటప్పుడు, ఉత్సాహంగా శక్తిని పొందండి.
ఉచితం!
3 గ్లాసుల
సెట్
రూ. 1.28 విలువగలది,
ప్రతి 700 గ్రా.ల
గ్లాక్సోస్-డి
టిన్‌తో పొందండి.
త్వరపడండి!
సరుకు ఉన్నంత వరకే
ఈ సదుపాయం!
గ్లాక్సోస్-డి
తక్షణ శక్తి కోసం
GLAXOSE-D
dCP/GL/27

విదుదు చూస్తుంటాను మర్చిపోకండి."

ఇట్లు
రాధిక.

మళ్లా ఆలోచనలు మొదలయాయి మాధవ్‌కు. యిప్పుడేం చేయాలి ? కాదన డానికి కూడా వీలుకాకుండావుంది. పెళ్లయి తను యింకో స్త్రీతో స్నేహం చేస్తే తన భార్య విశాల సహించగలదా ? విశాల గుర్తుకు రాగానే మంచి ఆలోచన వచ్చింది. తను ఈ రోజు వాళ్లింటికి వెళ్ళి విశాలతో మాట్లాడి విశాలను కూడా విల్లుండి తనతో తీసుకువెళ్లి రాధికకు పరిచయం చేస్తే చాలా బాగుంటుంది. విశాలకు అసలు విషయం చెప్పేయవచ్చు. విశాల తనను అర్థం చేసుకుంటుంది.

'అమ్మయ్య! సమస్య తేలిపోయింది.' అనుకున్నాడు మాధవ్. అన్పించిందే తడవుగా స్కూటర్ స్టార్ట్‌చేసి చిక్కడపల్లి వేపు పోనిచ్చాడు.

ఇంటి ముందు స్కూటర్ దిగి లోపలకు వెళ్లాలా? వద్దా? అనుకొంటూ నిలబడి పోయాడు.

కారణం లేకుండా యిలా వస్తే వాళ్ళు ఏమనుకుంటారు? 'అప్పుడే భార్య కోసం పరిగెత్తుకొంటూ వచ్చాడు' అని నవ్వుకుంటారేమో. ఛీ! వెనక్కి వెళ్లిపోతే...అనుకుంటుండగానే వరండాలో కుర్చీలో కూర్చున్న విశాల మామయ్యగారు రామనాథం గారు 'లోపలికి రావోయ్! అక్కడే నిలబడిపోయావేం ?' అంటూ ఆహ్వానించారు.

ఆషాఢం

తప్పించుకోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది మాధవ్‌కు.

'ఏమైతే అయింది,' ధైర్యంగా లోపలికి వెళ్లాడు మాధవ్.

'కూర్చో!' అంటూ కుర్చీ చూపించారు రంగనాథంగారు.

'ఏమిటి విశేషాలు.' అంటూ క్షేమ సమాచారాలు అడిగారాయన. వెంటనే వచ్చిన ఆలోచనతో 'యిక్కడ దగ్గరలో వున్న స్నేహితుడింటికి వచ్చాను దారిలో మీ యిల్లు కన్పించింది. చూసి పోదామని వచ్చాను.' అంటూ సమయస్ఫూర్తిగా చిన్న అబద్ధం ఆడాడు మాధవ్.

'ఏమేవ్! మాధవ్ వచ్చాడు.' అంటూ కేకవేశారు ఆయన భార్య నుద్దేశించి.

ఆయన సతీమణి బయటకు వచ్చి క్షేమ సమాచారాలు అడిగి లోపలకి వెళ్లిపోయింది.

రామనాథంగారు ఒక లాయరు. ఆయన కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడంటే ఒక పట్టాన వదిలిపెట్టడు. ఏవో రాజకీయాల గురించి మాట్లాడ్డం మొదలు పెట్టాడు ఆయన. విశాలతో మాట్లాడే అవకాశం కోసం ఎదురుచూస్తున్న మాధవ్‌కు ఆయన మాటలు ఏవీ చెవికెక్కడం లేదు. యింతలో కాఫీ తీసుకు వచ్చింది సుశీలమ్మగారు. విశాల తీసుకు రాకూడదూ అనుకున్నాడు మనసులో. అయిష్టంగానే కాఫీ త్రాగాడు. విశాలతో మాట్లాడే అవకాశం దొరుకుతుందేమోనని 'ఆశ ఒక ప్రక్కా' రామనాథంగారి మాటలు విసుగెత్తిస్తున్నాయి వేరొకప్రక్క. ఏం చేయాలో తోచలేదు మాధవ్‌కు.

'ఏయ్ ఆగు!' కేక వినిపించిన వైపు చూచాడు తను. అటుగా పరిగెత్తుకు వచ్చిన నాలుగేళ్ళ రామనాథంగారి చిన్నమ్మాయికి గౌను వేయడాన్కి వచ్చింది విశాల.

విశాలను చూడగానే మాధవ్ ముఖం సంతోషంతో విప్పారింది. కానీ అది ఎంతో సేపు వుండలేదు.

అప్పుడే ఒకసారి మాధవ్ కేసి చూసింది విశాల. వెంటనే ముఖం తిప్పేసుకొని ఆ పిల్ల చేయి పట్టుకొని లోపలకు వెళ్ళి పోయింది.

మాధవ్ హృదయం కలుక్కుమంది. 'అబ్బ! ఆ చూపులో ఎంత నిర్లక్ష్యం? 'అసలు కట్టుకున్న భర్త అన్నభావం ఏకోశానా వున్నట్లులేదు.'

ఆ సంఘటన జరగగానే ఒక్కక్షణం అక్కడ వుండబుద్ధి కాలేదతనికి. వెంటనే లేచి నిలబడుతూ 'యింక నేను వెళ్తానండి' అన్నాడు.


'అదేమిటోయ్! రాత్రికి భోజనం చేసి వెళ్దువుగాని' అన్నారు రామనాథంగారు.

అప్పుడే లోపల్నించి వచ్చిన ఆయన సతీమణి కూడా అదేమాట అంది.

విశాల అలా చూసి వుండకపోతే తను తప్పక ఒప్పుకొనేవాడు. కాని అలా జరగలేదు, సరిగదా తనసలు రావడం యిష్టంలేనట్లుంది.

'లేదండి అన్నయ్యా, అమ్మ, వదినా

హరిరామ్



అంతా నాకోసం భోంచేయకుండా ఎదురు చూస్తుంటారు.' అంటూ బయటకు వచ్చేసి స్కూటర్ స్టార్ట్ చేసాడు. ఆ రాత్రి ఎంతకీ నిద్ర పట్టలేదు మాధవ్‌కు. పెళ్ళయిన పదిరోజుల్లోనే ఏమిటీ విపరీతాలు? విశాలకు తనంటే అంత నిర్లక్ష్యం ఎందుకు? ఎవరో ముక్కూ మొహం తెలియని రాధిక తన స్నేహం కోరి రావడం ఏమిటి? అన్నీ జవాబు లేని ప్రశ్నలు ... ఆదివారం నాటి ప్రోగ్రాం అంతా విశాలతో చెప్పి విశాలను కూడా తీసుకు వెళ్దామనుకున్నాడు కాని యిప్పుడేమయింది?

అసలు యిదంతా విశాల వాళ్ళ మామయ్యగారింటికి వెళ్ళడం వల్లే జరిగింది. లేకుంటే తను యిక్కడే వుండేది.

అసలు ఆషాఢమాసం లేకుంటే బాగుండేది. విశాలను పంపించడం తనకసలు యిష్టంలేదు.

అత్తా కోడళ్ళు ఒక యింట్లో వుండకూడదు అంటూ తనను, విశాలను వేరు చేశారీ పెద్దలు. ఒక్కసారిగా కోపం వచ్చింది పెద్దవాళ్ళందరి మీద. కాలం మారుతున్నా వీళ్ళు మారరు. అన్నీ మూఢ నమ్మకాలు. ఆషాఢంట ఆషాఢం అనుకున్నాడు కసిగా.

అంతలో రాధిక గుర్తుకు వచ్చింది. రాధిక తన స్నేహం కోరి వచ్చింది. తనెందుకు వూరుకోవాలి. ఈ దెబ్బతో విశాలకు కూడా బుద్ధి చెప్పాలి. ఎల్లుండి తప్పక రాధికను కలుసుకోవాలి, అనుకుంటూ నిద్రలోకి జారాడు మాధవ్.

ఆరోజు ఆదివారం. లేవగానే సాయంత్రం ప్రోగ్రాం గుర్తుకు వచ్చింది. మూర్తి దగ్గరకు వెళ్ళి సంగతి చెప్పాడు. మాధవ్ ధైర్యాన్ని మెచ్చుకున్నాడు మూర్తి.

సాయంత్రం నాలుగు గంటలకు స్నానం చేసి తనకు అన్నిటికన్న యిష్టమయిన తెల్లని టెరికాట్ షర్ట్, తెల్లటి టెరికాట్ పాంట్ వేసుకున్నాడు. అందమైన నల్లని వుంగరాల జుట్టుని అందంగా మరొకసారి దువ్వుకొని బయలుదేరాడు మాధవ్. ఎర్రటి బ్లౌజ్ వేసుకుంటుందిట, ఎర్రంచు తెల్లచీర కట్టుకుంటుందిట. ఎరుపు తెలుపు తనకిష్టమయిన రంగులు. ఆ విషయం చెప్పాలి అనుకున్నాడు.

ఒకవేళ ఎవరైనా తనను మోసం చేస్తున్నారేమో ఆలోచించడానికి అవకాశం లేకుండా జమ్మిద్ వచ్చేసింది. స్కూటర్ ప్రక్కన ఆపి కొంచెం ముందుకు వెళ్ళాడు. వళ్ళంతా చెమటలు పట్టాయి. తను విశాలకు అన్యాయం చేస్తున్నాడా? ఏమో! తనకు తనే ధైర్యం చెప్పుకుని కొంచెం ముందుకు వెళ్ళాడు. అదో! అక్కడ ఎర్రంచు తెల్లచీర, ఎర్ర జాకట్ తల్లో ఎర్ర గులాబి. అనుమానం లేదు. రాధికే. రెండడుగులు దూరంలో వుండగా రాధిక యిటు తిరిగింది.

మాధవ్ నోటమాట రాక నిశ్చేష్టుడయాడు.

'ఏమిటి? అలా నిలబడి పోయారు?' అంది చిరునవ్వు నవ్వుతూ రాధికగా వచ్చిన విశాల.

'విశాలా? నువ్వా!' అన్నాడు యింకా

ఆశ్చర్యంగా.

'అవును విశాలనే' అంది చిన్నగా నవ్వుతూ.

'మరి మరి ...' ఆపైన ఏమనాలో తెలియలేదు మాధవ్‌కు.

'అదంతా తరువాత మాట్లాడుకొందాం. అంతా మనకేసే చూస్తున్నారు. అలా తాజ్‌కి వెళ్దాం పదండి' అంది సిగ్గుగా.

ఆ మాట విని చుట్టుప్రక్కల్ని గమనించాడు మాధవ్. అందరూ తమ వంకే చూస్తున్నారు. కొంచెం దూరంలో యిద్దరమ్మాయిలు మాత్రం విశాల కేసి చూసి నవ్వారు.

విశాల కూడా బదులుగా నవ్వింది.

'పద వెళ్దాం' అంటూ స్కూటర్ వైపు నడిచాడు. విశాలను వెనుక కూర్చోపెట్టుకొని తాజ్ వైపు పోనిచ్చాడు. తాజ్‌లో కూర్చున్న తరువాత అడిగాడు మాధవ్.

'ఎందుకలా చేసావు?'

అయితే శ్రద్ధగా వినండి అంటూ మొదలు పెట్టింది విశాల.

'నాకు ఎవరినైనా ప్రేమించి పెళ్లి చేసుకోవాలని వుండేది కాని ముందుగానే ఎవరినైనా ప్రేమిస్తే ఎదరు దెబ్బలు తింటానేమోనని భయం చేత ఎవరినీ ప్రేమించలేదు. చివరకు మిమ్మల్ని కూడా ప్రేమించకుండానే పెళ్లి చేసుకున్నాను. కాని నాకోరిక తెలిసిన నా స్నేహితులు కమల, శ్యామల కలిసి ఈ ప్లాను వేశారు. దానికి తోడు ఆషాఢం కలిసి వచ్చింది వాళ్ల ప్లాను విజయం పొందింది.' అంది విశాల.

'మరి మీ యింటికి వస్తే నువ్వు...' అన్న మాటల్ని మధ్యలోనే ఆపి, 'క్షమించండి. మా ప్లాను భగ్నం అవుతుందేమోనని అలా ప్రవర్తించాల్సి వచ్చింది.' అంది.

'యింకా ఏమైనా సందేహాలున్నాయా?' అంది నవ్వుతూ.

'ఒకవేళ వేరే రాధిక కోసం నేను వెళితే...'

మగవాడికి 'అటువంటి ధైర్యం వుండాలి. అదే నాకిష్టం. మీ మీద నాకు నమ్మకం వుంది. పదండి పిక్చరు టైమ్ అయింది' అంది లేస్తూ.

ఆషాఢ మాసం అంతా మంచి ప్రేమికులుగా గడిపారు.

'ఆషాఢం మనకో మంచి అవకాశాన్నిచ్చింది కదూ?' అంది విశాల.

'అవును.' అన్నాడు అంతకుముందు ఆషాఢాన్ని తిట్టుకున్న మాధవ్. ●

ఒక వారం విపరీతం
ఫాలాక్షుడు

అబ్బాయిగా మారిన అమ్మాయి!

ఉత్తర ప్రదేశ్‌లోని బులాన్డ్ షహర్ అనే గ్రామానికి చెందిన నిష అనే అమ్మాయికి 12 ఏళ్ళ వయస్సు వచ్చాక రానురానూ ఆమెలో స్త్రీలక్షణాలు క్షీణించ నారంభించాయట. ఆమెగొంతులోని కోకిలలు ఎగిరిపోయాయట. ఆగొంతులో మగతనం వచ్చిందట. ఇంకా ఎదగవలసివున్న స్తనద్వయం రాను రాను క్షీణిస్తూ వచ్చిందట. ఇది చూసి ఆమె తలిదండ్రులు భయపడి, స్థానిక ఆసుపత్రిలో ఆమెను చూపించారట. వారిదమిద్దమని తేల్చనందువల్ల ఢిల్లీ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకు వెళ్ళి చూపిస్తే అక్కడి డాక్టర్లు ఆమెలో ఆడతనంతో పాటు మగతనం కూడా పుష్టిగా వున్నదని, ఆ మగతనమే క్రమేణా అభివృద్ధి చెందుతోందని కనిపెట్టి, ఆ అభివృద్ధికి సంబంధించిన ఇంజక్షనులూ అవీ యిచ్చి, వైద్యం చేశారట. తత్ఫలితంగా ఆ నిష యీనాటికి 15ఏళ్ళ కుర్రాడిగా మారిపోయిందట. ఆసుపత్రి అధికారులే ఆమెకు అరవింద కుమార్ అని పేరుపెట్టారట.



నిష తలిదండ్రులకు ఆమె గాక యింకో ముగ్గురు కూతుళ్ళు వున్నారట. కొడుకులు లేని ఆతలిదండ్రులు నిషలో యీ మార్పుకు చాలా ఆనందించారట. అబ్బాయిగా మారిన నా కూతురుకు నేనో మోటారు సైకిలు కొనిస్తాను అన్నాడట నిష తండ్రి. లోగడ ఆమె తీయించుకున్న ఫొటోలన్నీ కూడా ఆమె తలిదండ్రులు చింపిపారేసి... నిష 'ఇక అరవిందకుమారే' అని ఆనందాన్ని ప్రకటించారట.

* * *

వేలూరు కణియంబాడి హరిజన కాలనీలో వుండే 32 ఏళ్ళ బాలు అనే అతను మురుక్కేరి అనే గ్రామానికి చెందిన పద్మ అనే ఆమెను వివాహం చేసుకుని, తాను పెట్టిన 45 రోజుల శలవూ అయిపోంగానే తిరిగి సైన్యంలో చేరడానికి వెళ్ళిపోయి, మొన్న ఏప్రిల్ నెల తిరిగి శలవు మీద వచ్చాడట. వచ్చి చూసేసరికి తన భార్య పద్మ నాలుగునెలల గర్భిణి అని తెలిసి, ఆమె మెళ్ళో తానుకట్టిన తాళి తెంపేసి, ఆమెను పుట్టింటికి పంపేశాడట. కానీ వూరి పెద్దలంతా చేరి, హితవు చెప్పి మళ్ళీ ఆమెను అతనింట్లో చేర్చారట.

దాంతో అతనికి ఏంచేయాలో తెలీక, తోచక, ఆమె మీద కిరసనాయిలుపోసి, నిప్పంటించి తాను పారిపోయాడట. ఆమె ఆ మంటలకు చనిపోయిందట. పోలీసులాతనికోసం వెతుకుతున్నారట.

నగ్నంగా ఇద్దరు బౌద్ధస్త్రీల ఊరేగింపు?

పర్భాని జిల్లా సోనాలో 23వ తేదీ హొయిద్దరు కొత్తపంథా బౌద్ధ స్త్రీలను నగ్నంగా చేసి, వీధులలో తిప్పారుట. దీనికి నిరసనగా పూనాలో మహిళలందరూ చేరి, 'అలా చేసిన వారి చేతులు నరకవలెను' అని అరుస్తూ కలక్టరు వారి కార్యాలయం ముందు గలాటా చేసి, ఆనక ఆయనకో ప్రముఖం యిచ్చారట — యింతకన్నా సోనా గ్రామంలో జరిగిన ఆ అకార్యానికి వివరాలు తెలియలేదు.

120 పౌనులు బరువున్న 11 ఏళ్ల బాలుడు!

బెంగళూరు శ్రీరామ పురంలోని హోకు రకర్మశాలకు చెందిన ఒకాయన కొడుకు సదానంద కుమార్ పుట్టిన ఆరు నెలలకే విపరీతంగా పెరిగిపోనారంభించాడట. ఇప్పుడు 11వ ఏట వచ్చిన ఆ సదానందకుమార్ 120 పౌనుల బరువు, 4అడుగుల, 4 అంగుళాల ఎత్తూ వున్నాడట. ఈకుర్రాడికి ఏస్కూల్లోనూ అతని దేహస్థితి కారణంగా సీటు యివ్వ నిరాకరించారట. ఈ సందర్భంగా మైసూరు గవర్నరు మోహన్‌లాల్ సుఖాడియా ఆకుర్రాడికి ఆర్థిక సహాయం చేశారట.




అప్పు తీర్చమంటే చెప్పుదెబ్బ!

అరూర్‌కు చెందిన మొరప్పూరులో చిన్నసామి అనే హోమియోపతీ డాక్టరుకు హనుమంతబోయన్ అనే ఆయన యివ్వాల్సిన డబ్బు యివ్వలేదుట. ఒక రోజు అరూర్ బస్‌స్టాండులో వున్న హనుమంతయ్యను చిన్నసామి తన డబ్బుకోసం నిలదీశాడట. తత్ఫలితంగా అది పోట్లాటగా మారి చిన్నసామి అతన్ని చెప్పుతో కొట్టాడట.

17 పౌనుల శిశువు!

మే 25వ తేదీన సిప్లిలో ఒక స్త్రీ 17 పౌనుల బరువున్న శిశువును ప్రసవించిందట. ప్రపంచంలో ఇంత బరువున్న శిశువింతవరకూ జన్మించిన దాఖలా అన్న దాఖలాలు కూడా వున్నాయి. చక్కగా ఆరోగ్యంగా వున్న ఆశిశువు ఏడెనిమిది నెలల పిల్లాడిలా కనుపిస్తున్నాడట. ఈపిల్లాడి తల్లి ఆరడుగుల మూడంగుళాల ఎత్తుట. ఆమెకు పుట్టిన మొదటి బిడ్డ 12 పౌనులు,



రెండో ఆడపిల్ల 12 పౌనులు 11 ఔన్సుల బరువుగా వున్నారట.

గర్భస్రావ చట్టాన్ని సద్వినియోగం చేసుకున్న ఢిల్లీ!

గర్భస్రావాన్ని అనుమతిస్తూ క్రిందటి సంవత్సరం చట్టం చేశాక, ఇంతవరకూ దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా ఢిల్లీలో ఎక్కువమంది స్త్రీలు ఆ చట్టాన్ని సద్వినియోగం చేసుకున్నారట.

మైసూరు రాష్ట్రంలో ఒక్క నెలలోని విపరీతాలు!

పోయిన ఏప్రియల్ నెలలో మైసూరు రాష్ట్రంలో 66 హత్యలు, 15 దారిదోంగతనాలు, 3 దోపిడీలు, 476 యింటి దొంగతనాలు, 836 వదితర దొంగతనాలూ జరిగాయని పోలీసు అధికారులు వెల్లడి చేశారట — రామరాజ్యమనేది! ●

సినిమా

మదరాసులో అందాల పోటీ!

మద్రాసు సెఫైర్ థియేటర్లో, ఈవ్స్ వీక్లీ పత్రిక, కోకో–కోలా కంపెనీ కలిసి 'అందాల పోటీ'ని జూన్ 8 రాత్రి జరిపారు.

మద్రాసు అందగత్తెగా బెంగుళూరు కళాశాలకు చెందిన విద్యార్థిని మాలతి (వయస్సు 21) ఎన్నుకోబడింది. ద్వితీయ స్థానాన్ని మీనా పావ్‌చందిని (21 ఏండ్లు) గెలుచుకుంది.

'యువరాణి' పోటీలో మద్రాసు స్టెల్లా మేరీస్ కళాశాల విద్యార్థిని అమృతాశశి (వయస్సు 17) మొదటి స్థానాన్ని ఆక్రమించుకుంది. రెండవ అందగత్తెగా కుమారి గాయత్రి పాపా (17) నెగ్గింది. ఈ పోటీలో ఎన్నికయిన విజేతలకు మద్రాసు మేయర్ కామాక్షి జయరామన్ కిరీటాన్ని అమర్చారు.

హిందీ చిత్రంలో నటి జయకౌశల్య

గీతా ఎంటర్‌ప్రైసెస్ నిర్మించే హిందీ చిత్రంలో తమిళ, తెలుగు చిత్రాల నటి జయకౌశల్య నాయికగా నటిస్తోంది. ఈమెకి జతగాడు శంకర్. జంబు దర్శకత్వం నిర్వహిస్తున్న యీ చిత్రం షూటింగు ప్రసాద్‌లో జరుగుతూ వుంది.

నాయకుడే దర్శకుడు

రేఖా అండ్ మురళీ సంస్థ 'ఆజన్మ బ్రహ్మచారి' చిత్రాన్ని నిర్మిస్తున్నారని పాఠకులకు తెలిపియున్నాము. ఈ చిత్ర నాయకుడైన పద్మనాభం, దర్శకత్వాన్ని కూడా చేపట్టారు. నాగభూషణం, పద్మనాభం గురు, శిష్యులుగా నటించే యీ చిత్రానికి పద్మరాజు రచయిత.

పుల్లయ్య రష్యా అనుభవాలు

ప్రముఖ దర్శకుడు పి. పుల్లయ్య రష్యా పర్యటించి వచ్చారని యిదివరకే తెలిపాను. ఆయన్ను న్యూ వుడ్‌లాండ్స్ హోటల్‌లో మద్రాసు ప్రాతికేయ సమాఖ్య తేనీటి విందులో సత్కరించారు. అప్పుడాయన తమ రష్యా అనుభవాలను వివరించారు. 'రష్యాలో భారతీయులకు ఎక్కువ విలువనిస్తారు. వాళ్ళు కాలాన్ని వృథా చెయ్యరు. ఎప్పుడూ, అందరూ పనిలో నిమగ్నులైయుంటారు. రష్యాలో కూడా స్టార్ సిస్టమ్ అమలులో వుంది. మన కుటుంబ గాథిప్రత్తాలపై వాళ్ళకి మోజు వున్నట్టు తెలుస్తోంది. మానవత్వపు విలువల్ని ప్రతిబింబింపచేసే కథలను నిర్మిస్తే, రష్యా ప్రజల ఆదరణ లభిస్తుంది. నాకు 26 యేండ్లు అని సులేదత్తు జోకు విసిరాడు. వాళ్ళు ఆ జోకుకు ఆనందించారు. నా 62 వ జన్మదినోత్సవం రష్యాలో జరుపుకున్నాను.' అన్నారు పుల్లయ్య.




'మరపురాని తల్లి' లో వాణిశ్రీ


ఈలపాట రఘురామయ్య జపాన్ పర్యటన

ఈలపాట కె. రఘురామయ్య ఇండో నిప్పన్ వేదాంత సంఘం ఆహ్వానం పై జపాన్‌లో పర్యటన జరిపారు. అక్కడివారు ఈలపాటకు మంత్రముగ్ధులయ్యారట. ఆశ్రమవాసులు రఘురామయ్యని సాక్షాత్తు కృష్ణపరమాత్ముడిగా పరిగణించి, ఆయనకి పరిచర్యలు చేసారట. నాట్య సంఘం కృష్ణంరాజును, రఘురామయ్యను హాస్యనటుడు పద్మనాభం ప్రాతికేయులకు పరిచయంచేశారు.



'పంతాలు పట్టింపులు' లో జమున, కృష్ణంరాజు.


యస్.ఆర్. కంబైన్స
హంతకులు
దేవాంతకులు
దర్శకత్వం:
కె.యస్.ఆర్.దాస్
నిర్మాతలు:
యస్.వి.సుబ్బరాజు-ఎమ్.కె.రాధ
అన్నపూర్ణా
రిలీజ్



భరణీపిక్చర్స్ 20వ చిత్రం షూటింగ్ ప్రారంభంసందర్భంలో తీసిన చిత్రం. దర్శకురాలు భానుమతీ రామకృష్ణ, ఛాయాగ్రాహకుడులక్ష్మణగోరెలని చిత్రంలో చూడవచ్చు.

సినిమా

వాణిశ్రీకి అస్వస్థత

నిర్మాతల సౌకర్యార్థం మూడు షిఫ్టులు పనిచేస్తూ, ఆరోగ్యం సంగతి దేముడెరుగు అని యెంచే వాణిశ్రీకి గతవారం వచ్చ కామెర్లవ్యాధి సోకింది. వేడి చెయ్యడంవల్ల, ఎక్కువగా శ్రమించడంవల్ల ఈ వ్యాధి వచ్చిందని డాక్టర్లు చెప్పి, పక్షం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవలసిందిగా సలహా యిచ్చారు. ఇప్పుడు కాస్త నయంగా వుందని తెలుసుకున్నాను.

ఇల్లు — ఇల్లాలు

నందినీ ఫిలింస్ వారి 'ఇల్లు—ఇల్లాలు' చిత్రంలో వాణిశ్రీ తల్లీ — కూతురుగా ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు మీకు తెలిపియున్నాను. తల్లి పాత్రకి భర్తగా టి. ఎల్. కాంతారావు, కూతురు వేషానికి పెనిమిటిగా కృష్ణ నటిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ అనే నూతన నటిని ఒక ముఖ్య పాత్రలో పరిచయం చేస్తున్నట్టు, నిర్మాతల్లో ఒకరైన రామిసుబ్బిరెడ్డి చెప్పారు. వీరి మొదటి చిత్రం 'అత్తలు—కోడళ్లు' ద్వారా లీలారాణిని ప్రేక్షకులకు పరిచయం చేశారు, దర్శకుడు చంద్రశేఖరరెడ్డి. ఈ నెల 16 నుండి 'ఇల్లు—ఇల్లాలు' షెడ్యూలు వాహినీలో జరుగుతుందని నిర్మాణ నిర్వాహకుడు పి.వి రమణయ్య చెప్పారు.

థియేటరు అధినేత అయిన జమున !

ప్రముఖనటి జమున ఏంచేసినా ముందు చూపుతోనే చేస్తుంది. అందుకే శాశ్వతమైన ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఒక మంచి పనిని చేసింది. గుంటూరులో 'శ్రీనివాస్' పేరిట చెలామణి అయిన సినిమా థియేటరును కొన్నది. దాన్ని మరింత అందంగా నిర్మించి ఆ థియేటరుకు 'అలంకార్' అని పేరు పెట్టింది. ప్రస్తుతం అక్కడ 'మంచిరోజులొచ్చాయి' ప్రదర్శింపబడుతూంది. మరొక థియేటరుకూడా బేరానికి వచ్చినట్టు జమున చెప్పింది.

మూడు దశల వైవిధ్యం

సుభాషిణీ ఆర్ట్స్ పిక్చర్స్‌వారి 'వింత దంపతులు' చిత్రంలో జమున అపూర్వంగా నటిస్తూంది. 'కన్నకుమార్తెకు పెండ్లి చెయ్యలేని తండ్రికి బిడ్డగా. పెండ్లి తర్వాత వుత్తమ గృహిణిగా. బాధ్యతగల తల్లిగా జమున మూడుదశల వైవిధ్యాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తున్నట్టు, యీ పాత్ర 'కలెక్టర్ జానకి, కైకేయి, తాసిల్దారు గారి అమ్మాయి' పాత్రలద్వారా తెచ్చిపెట్టిన పేరును యినుమడింప చెయ్యగలదని గట్టిగా చెప్పగలను.' అన్నారు, నిర్మాత. దర్శకుడు కె. హేమాంబరధరరావు: 'అలాగే క్యారెక్టర్ నటుడు నాగభూషణం తన పాత్రను ప్రతిభావంతంగా పోషించి, తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు' అని చెప్పారు, సుభాషిణీ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత.

హిందీలో

మానవుడు—దానవుడు

ఉషశ్రీ సంస్థకి తెలుగు పరిశ్రమలో మంచి పేరు వుంది. మంచి చిత్రాల నిర్మాతగా చిన్నప్పరెడ్డికి పలుకుబడి వుంది. 'మానవుడు—దానవుడు' చిత్రం యీనెల 22న ఆంధ్రదేశంలో విడుదలవుతుంది. ప్రజల ఆదరణ లభిస్తే, యిదే చిత్రాన్ని హిందీలో నిర్మిస్తారట చిన్నప్పరెడ్డి.

సినిమా డైరీ

- శ్రీ మహేశ్వరీ మూవీస్ 'మాయింటి వెలుగు' చిత్రం షూటింగు జూన్ 1 నుండి 6 వరకు వాసూ స్టుడియోలో జరిగింది. ఈ చిత్రానికి విజయ్ దర్శకుడు. దీంతో 13 రీళ్లు తయారైంది.
- రవిశంకర్ పిక్చర్స్ 'మేనకోడలు' చిత్రం జూన్ 12న సెన్సార్ అయింది. బి. ఎస్. నారాయణ దర్శకుడు.
- సౌభాగ్య కళాచిత్ర వారి వర్ణచిత్రం 'శభాష్‌పాపన్న' జూన్ 29న లక్ష్మీ ద్వారా విడులవుతుంది. జగ్గయ్య ద్విపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా వున్న యీ చిత్రానికి షహీద్‌లాల్ దర్శకుడు.
- రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్‌వారి 'అజన్మబ్రహ్మచారి' షూటింగు జూన్ 12న ప్రారంభమైంది. పద్మనాభం దర్శకుడు.
- శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైసెస్‌వారి రెండవ షెడ్యూలు జూన్ 12న సత్యా స్టుడియోలో ప్రారంభమైంది. కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు.
- సురేష్ మూవీస్ 'జీవనతరంగాలు' రెండవ షెడ్యూలు జూన్ 14న వాహినీలో ప్రారంభమైంది. తాతినేని రామారావు దర్శకుడు.

తెలుగు చలన చిత్రలోకంలో అపూర్వ సంచలనం

అగ్రశ్రేణి నటీనటుల అపూర్వ

నటనా కౌశలం మిమ్మల్ని

ముగ్ధులను చేస్తుంది.



మానవుడు-దానవుడు

నిర్మాత: పి. చిన్నపరెడ్డి, M.Sc. దర్శకత్వం: పి. చంద్రశేఖరరెడ్డి, B.Sc.

ఛాయా: సుఖదేవ్ సంగీతం: అశ్వద్ధామ మాటలు: అంకిరెడ్డి

ఇది ఉషశ్రీ వారి చిత్రం

సినిమా

పండంటి కాపురం

హీరో కృష్ణ, డాక్టర్ ప్రభాకరరెడ్డి కలిసి నిర్మిస్తున్న 'పండంటి కాపురం' (వర్ణ) చిత్రం దాదాపు పూర్తయింది. తెలుగు తెరనంతా ఒకే చిత్రంలో చూడొచ్చు. ఇంతమంది నటీనటులతో చాలా తక్కువ కాలంలో షూటింగును పూర్తి చెయ్యడమంటే మాటలా? జమున, విజయనిర్మల, సరోజాదేవి, దేవిక, కృష్ణ, ఎస్వీరంగారావు, గుమ్మడి, రాజబాబు, ప్రభాకరరెడ్డి, లాంటి బిజీ ఆర్టిస్టులందర్నీ సమావేశపరచి, షెడ్యూలు ప్రకారం షూటింగును జరపగలిగారంటే— మన చిత్రసీమలో ఇదొక సాధనే అని చెప్పాలి.

కారెక్టర్ నటుడు ప్రభాకరరెడ్డి కథను అందించటంలో అసామాన్యుడు. చెప్పదలచిన భావాన్ని సూటిగా వివరించగల శక్తి ఆయన కలానికి వుంది. 'పండంటి కాపురం' కథ ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలను గొన్న చిత్రగాథగా నిర్మితమైనదని తెలిసింది. దర్శకుడు సి. లక్ష్మీదీపక్ కి మహార్దశను తెచ్చిపెట్టే చిత్రం యిది. త్వరలో విడుదల.

నాగభూషణం విజృంభణ!

జై శంకర్ అండ్ కో వారి 'కోడలుపిల్ల' నిర్మాణం పూర్తయింది. దర్శకుడు ఎం. మల్లికార్జునరావుకు పేరు తెచ్చే చిత్రం గుంది. ఈ చిత్రంలో రాజశ్రీ మాటలతో, నాగభూషణం నటన పోటీపడి నెగ్గింది. ఒకే స్వభావంగొన్న అన్నదమ్ముల పాత్రను నాగభూషణం అద్భుతంగా చిత్రించారట. కథలో వెరైటీ, కథనంలో వేగం, సంగీతంలో మాధుర్యం, మాటల్లో సౌలభ్యం వున్న యీ చిత్రంలో కృష్ణ, కె. ఆర్. విజయ, రాజబాబు, అంజలీదేవి, రావి కొండలరావు, అల్లు రామలింగయ్య, పండరీబాయి ముఖ్యపాత్రధారులు. హాస్యాగ్రహాన్ని చేపట్టిన ప్రకాశ్ కి మంచి మార్కులు వస్తాయీ చిత్రంలో. త్వరలో విడుదల.

యంగ్ టర్క్స్ షూటింగు ప్రారంభం!

ఈ సంస్థ నిర్మిస్తున్న మొదటి చిత్రం షూటింగు జూన్ 12న వీనస్ స్టుడియోలో వేడుకగా ప్రారంభమైంది. ఉషశ్రీ చిన్నపరెడ్డి స్విచ్ ఆన్ చెయ్యగా, పింజల సుబ్బారావు క్లాప్ కొట్టగా, మొదటి షాటును విజయలలితపై దర్శకుడు కె. వి. ఎస్. కుటుంబరావు చిత్రీకరించారు. ఈ షెడ్యూలు నాలుగురోజులపాటు జరుగుతుందని నిర్మాతల్లో ఒకరైన చిట్టిబాబు చెప్పారు. మొదటి సెట్టులో విజయలలిత, విజయచందర్, ప్రభాకరరెడ్డి, నాగేష్, ప్రభాకర్ పాల్గొనగలరని నిర్మాతల్లో మరొకరైన కె. ఎం. నాయుడు చెప్పారు.

నిర్మాతలిద్దరికీ చిత్రపరిశ్రమతో సన్నిహిత సంబంధం వుంది. ఇద్దరికీ నిర్మాణ నిర్వాహకులుగా మంచి పేరు వుంది. నిర్మాణ సాధకబాధకాలు తెలిసిన వ్యక్తులవడంచేత వీరికి చిత్రనిర్మాణం కష్టం అనిపించదు. వీరికి పిలగారు వెంకట్రామా అండ్ కో అధినేత ఎ. ఓబ వెంకట్రామయ్య అండదండలు దొరకడం ఒక విశేషం. ఈ చిత్రానికి దాసం గోపాలకృష్ణ రచనను, దేవరాజ్ ఛాయను, పుహళేంది సంగీతాన్ని, భాస్కరరాజు కళను నిర్వహిస్తున్నారు. ముఖ్యపాత్రలను పై సుదహరించిన వారితోబాటు రాజబాబు, త్యాగరాజు, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని, సూర్యకాంతం, జ్యోతిలక్ష్మి, హేమలత, సుమతి నిర్వహిస్తారు.

జ్యోతిలక్ష్మి పుట్టినరోజు

సెక్సీ బాంబ్ షెల్ గా ప్రసిద్ధిపడిన నాట్యకత్తె జ్యోతిలక్ష్మి జూన్ 12న సారంగపాణి వీధిలోని ఆమె యింట పుట్టినరోజు పండుగను జరుపుకుంది. పత్రికేయులను తేనీరుకు ఆహ్వానించింది. తేనీటి విందు అంతకన్న బాలసుబ్రమణ్యం గంధర్వగానం

మీకు తెలుసా?

అగ్నిబాధితుల కుటుంబ సహాయార్థం ఉషశ్రీ వారి 'మానవుడు దానవుడు' చిత్రం జూన్ 22న విజయవాడ అలంకార్ లో ప్రత్యేక ప్రదర్శనం ఏర్పాటు చేశారు.

పద్మశ్రీ భానుమతిగారి దర్శకత్వంలో తయారవుతున్న తెలుగు చిత్రంలో ప్రమీల అనే కొత్త నటికి అవకాశం యిస్తున్నారు.

ఆర్ట్ డైరెక్టర్ రాజేంద్రకుమార్ నిర్మిస్తున్న 'శ్రీరామాంజనేయ యుద్ధం'లో హేమమాలిని సీత పాత్రను పోషిస్తారట.

బాపు దర్శకత్వంలో తయారైన 'సంపూర్ణ రామాయణం' జూన్ 23న సికింద్రాబాద్ లో శతదినోత్సవం జరుపుకోబోతోంది.



'కోడలు పిల్ల'లో కృష్ణ, కే. ఆర్. విజయ, రాజబాబు.

...హాటలను తనరిదరలో ...మరిచేత ...ంది!
...వ్యతిలక్ష్మి జరుపుకున్నది ఎన్నవ పుట్టిన
...జో! ? !

...వ శక్తి లో
...త్త నటీనటులు

నవశక్తి గంగధరరావుకు కొత్త నటీ...టులతో సినిమా తీయాలన్న తలపు ...చ్చింది. నూతన కళాకారుల కోసం అన్వే...ణ ప్రారంభించారు. కొంతమందిని ఎన్నిక ...శారని తెలుస్తోంది. త్వరలో సెట్స్ ...కి వెళ్ళగలరట. ఈ చిత్రానికి విద్వాన్ ...శ్వ.శ్రీ రచయిత. మట్టిలో మాణిక్యం ...ం బి. వి. ప్రసాద్ దర్శకుడు.

ఒకే పేరున్న రెండు పాత్రలు !

రవిరాజ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'మరపురాని తల్లి' చిత్రంలో ఒకే పేరున్న రెండు పాత్రలు కనిపిస్తాయి. పేర్లు ఒక్కటే, భావాలు ఒక్కటే, మనస్సులు ఒక్కటే అని యీ రెండు పాత్రలు చెపుతాయి. ఈ పాత్రలను (సరూ, సరోజ) వాణిశ్రీ, లక్ష్మి పోషిస్తున్నారు. తనువులు వేరయినా, తలపులు ఒక్కటే అన్న భావం గొన్న యిద్దరూ అనివార్యంగా విడిపోవలసి వచ్చింది. తన మెడలోని గొలుసును సరోజకి బహూకరించింది, సరు.

"సారి నేనేం యివ్వను", అరిది సరోజ రిక్త హస్తాలతో. 'నా హృదయమే నువ్వు! ఇక వేరే యిచ్చేదేముంది? నా హృదయం నాకు దూరమవుతుంది. మమతలతో ముడి పడ్డ ఆవేదన నీకు తెలియనిది కాదే ?' అంది సరు. ఈ సన్నివేశంలో వాణిశ్రీ, లక్ష్మి పోటా పోటీగా నటించి కథకుడు గొల్లపూడి భావానికి పూర్తి న్యాయం చేకూర్చారు. ఈ ఒక్క షాటు చిత్రీకరణను బట్టే దర్శకుడు ప్రకాశరావు మేధాసంపత్తిని ప్రశంసించవచ్చు. నిర్మాత కేశవ జయరాం టేస్టు వున్న వ్యక్తి అని యీ చిత్రం నిరూపిస్తుంది. మంచి కథలకోసం వువ్విళ్ళూరుతున్న ఆంధ్ర ప్రేక్షకులకు యీ చిత్రం సంతృప్తిని కలిగిస్తుంది.

ఈ చిత్రంలో కృష్ణ, గుమ్మడి, శాంత కుమారి, సత్యనారాయణ, బాలయ్య, అల్లు రామలింగయ్య, కె. వి. చలం, రమాప్రభ, పండరీబాయి, మిక్కిలినేని ముఖ్య పాత్రలను పోషించారు. విజయా కంబైన్స్ విడుదల.

కథ ఎలా దొరికింది ?


'మేనకోడలు' చిత్ర నిర్మాత సునీల్ చౌదరిని వారి ఆఫీసులో కలిసినప్పుడు, ఏదయినా మంచి కథ వుంటే చెప్పండి అని నన్ను అడిగారు. మీకు మొదటి చిత్రానికి కథ ఎలా దొరికింది ? అని ప్రశ్నించాను.

'నేను కథకోసం అన్వేషిస్తున్న సమయంలో, నా మిత్రులు జ్యోతి మాస పత్రికలో సీరియల్‌గా వస్తున్న 'శిక్ష' నవలను సూచించారు. కథ చదివాను. ప్రతి వ్యక్తి నిజ జీవితంలో ఎదురయ్యే సంఘటనల ప్రతిరూపమే అన్న భావం యేర్పడింది. తదనుగుణంగా ఆ కథను కొని, చిత్ర నిర్మాణం ప్రారంభించాను. షూటింగు కూడా పూర్తి చేశాను. పైగా యిలాటి కథ నిజంగానే జరిగింది ఒకచోట. నే నెరిగిన ఒక కుటుంబంలో రెండవ భార్య తన సవతి కుమారుణ్ని దూరంగా వుంచడం, ఆస్తికోసం దుశ్చర్యలకు పూనుకోవడం సంభవించింది.' అన్నారు సునీల్.

'చెరపకురా, చెడేవు' అనెడి నానుడికి పూర్తి న్యాయం చేకూర్చే కథే 'మేనకోడలు'. 'ఎదుటివారికి ఒక కన్ను పోవాలని కోరుకుంటే, మన రెండు కళ్లు పోతాయి అంటారే'—అది నిజమేనని యీ కథ చూస్తే తెలుస్తుంది. ఈ చిత్రానికి దాసరి నారాయణరావు మాటలను, ఘంటసాల సంగీతాన్ని, రామచౌధురి ఛాయను నిర్వహించారు. నాయికగా జమున తన సహజ నటనా నైపుణ్యంతో 'మేనకోడలు' పాత్రను తీర్చిదిద్దింది. ముఖ్య పాత్రధారులందరూ (కృష్ణ, గుమ్మడి, రాజబాబు, సూర్య కాంతం, కె. వి. చలం, రేణుక, ఆనంద్, సత్యనారాయణ, రావుగోపాలరావు, రోజా రమణి) యథోచితంగా నటించారు. అనిల్ ప్రభాస్ ద్వారా విడుదలయ్యే 'మేనకోడలు' చిత్రాన్ని బి. ఎస్. నారాయణ డైరెక్ట్ చేశారు.

తాత—మనవడు తారాగణం

ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ 'తాత — మనవడు' పేరిట ఒక సముజ్జ్వల సాంఘి కాన్ని ప్రారంభిస్తున్నారు. కథ, మాటలు, సినిమా అనుకరణ మరియు దర్శకత్వం దాసరి నారాయణరావు చేపట్టారు. 'మనో రమ, 'అమ్మమాట' చిత్రాల్లో శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించిన రమేష్ నాయుడు తమ సత్తాను బహిర్గతం చేసే సన్నివేశ ప్రాధానత వున్న పాటలు యీ




'నిజం నిరూపిస్తా'లో లక్ష్మీఛాయ, రాజబాబు.


చిత్రంలో వున్నాయి. ఇటీవల డాక్టర్ నారాయణరెడ్డి మూడు పాటలను వ్రాశారు. మూడింటికీ రమేష్‌నాయుడు బాణీలను కూర్చారు. జూన్ 9న మహాలింగపురంలోని ఆఫీసులో 'తాత — మనవడు' చిత్రానికి ప్రారంభ పూజ జరిగింది. చిత్రంలో ఎవ రెవరు నటిస్తారు? అని నిర్మాత రాఘవను అడిగాను. 'ఎస్వీరంగారావు, రాజబాబు, రాజసులోచన, లీలారాణి, సూర్యకాంతం వరకు నిర్ణయం జరిగింది. మరికొన్ని పాత్రలకి నాల్గయిదు రోజుల్లో బుక్ చెయ్యడం అవుతుంది,' అని చెప్పారు రాఘవ. షూటింగు ఆగస్టులో ప్రారంభమై, అక్టోబరుకు పూర్తవుతుంది, అన్నారు నిర్మాత.

అమర ప్రేమికుల గాథ

సంచలనాన్ని సృష్టించే ప్రయత్నాల్లో వుండడం చలంకి మొదటి నుండీ అలవాటు. తను చెయ్యదలచుకున్నదాన్ని ధైర్యంగా చెయ్యడంలో దిట్ట. ఇటీవల ఆయన్ని వారి ఆఫీసులో కలిశాను. 'అమర ప్రేమి



'మేనకోడలు' షూటింగ్ సందర్భంలో కెమెరామెన వి. వి. ఆర్. చౌదరి, రాజబాబు, హాలం.



'మాయింటివెలుగు'లో కృష్ణ, వె. నిర్మల.

కాల ప్రణయ శృంగార గాథను తెరకెక్కించాలనుకుంటున్నట్టు' చెప్పారు. మీరు ఏం చేసినా చెల్లుతుంది! అని అభినందించాము.

జానకి కుమార్తె వివాహం

క్యారెక్టర్ నటి 'షావుకారు' జానకి ద్వితీయ కుమార్తె సౌభాగ్యవతి కృష్ణ నమ్మకి ఆగస్టు 23న తిరుపతి సమీపాన వున్న తిరుచానూరులో వివాహం జరిపడానికి నిశ్చయం అయిందట. వరుడు చిరంజీవి శ్రీనాథ్ బొంబాయిలోని అమెరికన్ బ్యాంక్ మేనేజరుగా వుద్యోగం చేస్తున్నారట.

నాజర్ బృందం బుర్రకథ

కళాప్రపంతి ఈనాడే పుట్టింది. తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ వుంది. జూన్ 7న ఫిలింఛాంబర్ థియేటరులో నాజర్ - బృందం వారు 'పల్నాటి యుద్ధం' బుర్రకథ చెప్పారు. ఆంధ్రా బ్యాంకు డివిజనల్ మేనేజరు కృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించి, మద్రాసులో విరివిగా తెలుగు సమాజాలు వుండడం వల్ల తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. నాజర్ బృందం బుర్రకథ చెప్పడంలో ప్రత్యేక పరపతిని సంపాదించి యున్నారు. నాటి పల్నాటి యుద్ధ కథను, నేటి పరిస్థితులతో సమన్వయ పరుస్తూ, [illegible] శైలి శ్రోతలను ఆకట్టు

కుంది. నిన్నవ కవి శ్రీ శ్రీ మాటాడుతూ 'కవిత్వానికి సామాజిక ప్రయోజనం వుండాలన్న నమ్మకం తనదని, నేడు ప్రపంచమంతటా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా 'విప్లవం అనివార్యం' అన్నారు.

ఆత్రేయ వ్రాసిన మంచి పాట

రామవిజేతా ఫిలింస్‌వారి 'రామరాజ్యం' మొదటపాట రికార్డింగు జూన్ 7న జెమినీలో జరిగింది. ఆచార్య ఆత్రేయ వ్రాసిన ఆణిముత్యం యిది. చిత్రం యొక్క థీమ్ సాంగ్ యిది:

'ఇదే రామరాజ్యము
మా గ్రామ రాజ్యము
సమతతో మమతతో
సాగిపోవు రాజ్యము.
మాకు లేని దొక్కటే స్వార్థము;
మాకు రాని దొక్కటే వైరము;
చేతకాని దొక్కటే ద్రోహము;
అందుకే మాది రామరాజ్యము'

ఈ పాటను ఘంటసాల, యిరవైమంది గాయకులు కలిసి, నలభై వాయిద్యాల మేళవింపుతో అద్భుతంగా పాడారు. ఈ పాటకు ఘంటసాల సమకూర్చిన ట్యూను సాహిత్యంతో పోటీ పడింది అనే చెప్పాలి.


'రామరాజ్యం' కథను దర్శకుడు బాబూరావు టూకీగా చెప్పారు. కథా పాత్రలను వివరిస్తుంటే, అన్ని పాత్రలకు ప్రాధాన్యత వున్నట్టు గ్రహించాను. ఇందులో ఏ ఒక్క పాత్ర సన్నబడినా, మొత్తం కథకే యిబ్బంది వస్తే విధంగా పాత్రలు అల్లిక జరిపారు, దర్శకుడు బాబురావు.

'జరిగిన కథ' కన్నా 'తల్లిదండ్రులు,' దానికన్నా 'రామాలయం,' మూడింటికన్నా 'రామరాజ్యం' మెరుగ్గా వుందని నాకు అనిపించింది. నిర్మాత కె. సి. ప్రభాకర్‌కి 'రామరాజ్యం' నాలుగవ విజయాన్ని తెచ్చిపెడుతుంది. చిన్నవాళ్ళయినా, గడుసువాళ్ళే, మొనగాళ్ళే అనిపించుకుంటారు యీ రామవిజేతా సోదరులు. —శ్రీనివాస్

అవీ — ఇవీ . . .

సన్మానం

మదరాసు సంగీత కళాశాల నిర్వాహకురాలైన శ్రీమతి, శ్రీ ఎస్. పి పార్థసారధి గార్లకి స్థానిక రసిక రంజని సభలో జూన్ రెండవ తేదీన ఘనంగా సన్మానం జరిగింది. ఈ సన్మాన సభకి సర్వశ్రీ ఎ. సాంబమూర్తి అధ్యక్షత వహించారు. ప్రఖ్యాత సంగీత దర్శకుడు శ్రీ ఎస్. రాజేశ్వరరావు ప్రార్థనాగీతాన్ని ఆలాపించారు. విద్వాన్ శ్రీ బాలమురళీకృష్ణ జ్యోతిని వెలిగించి సభని ప్రారంభించారు. సన్మాన సంఘం కార్యదర్శి శ్రీ రామాచారి సభికులకి స్వాగతం చెప్పారు. మహాజన్యాయమూర్తి జస్టిస్ ఎస్. కృష్ణస్వామి నాయుడు పార్థసారధి తల్లిగారి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. వైణిక విద్వాన్ చిట్టిబాబు సన్మాన పంచికని, పార్థసారధి దంపతులు కూర్చిన 'శ్రీ వాగ్గేయ సుబ్రహ్మణ్యఅయ్యర్ గారి రచనలు' అనే గ్రంధాన్ని ఆవిష్కరించారు. ఎమ్.పి.ఎస్. చీఫ్ ఇంజనీరు శ్రీ డి. ఎల్. రావు సన్మాన సంఘం తరపున పార్థసారధి దంపతులని సన్మానించారు. అనంతరం చిట్టిబాబుగారి వీణ కచేరి శ్రోతల్ని ముగ్ధుల్ని చేసింది. (ఒ. వి.)



శ్రీ డి. ఎల్. రావు సన్మానసంఘం తరఫున పార్థసారధి దంపతులకి సన్మానం చేస్తున్న దృశ్యం.

రాజా—మహిషి

(మొదటి భాగము)

రచయిత: శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి, క్రౌను 390 పేజీలు. వెల 8రూ. ప్రచురణ—స్టూడెంట్ బుక్ సెంటర్ ఏలూరు రోడ్, విజయవాడ—2.

నవలాయుగం ప్రారంభ దశలో చారిత్రాత్మక నవలలు, కొన్ని సాంఘిక నవలలు వెలువడేవి. తర్వాత బెంగాలీ, హిందీ నవలల అనువాదాలు— డిటెక్టివ్ నవలలు, సాంఘిక నవలలు విరివిగా వచ్చినవి. దరిమిలా తెలుగు దేశానికీ, జనుల పరిస్థితులకూ, ప్రతిబింబాలయిన నవలలు వస్తున్నవి. అట్టి నవలల్లో ఇది ఒకటి.

రచయిత— అభ్యుదయ రచయితలలో అగ్ర శ్రేణికి చెందినవారు. నవలకు 'రాజా—మహిషి' అనే పేరుతో, ప్రేమ మనిషి, దైవం, న్యాయం, ధర్మం, సత్యం, అని కూడా ముఖ (జాకెట్) చిత్రం మీద ఉన్నందున తలిన తేమిటంటే—ఇందులోని రాజా రాజా కాడు, మహిషి మహిషి కాదని. లోకంలో నిజమైన ప్రేమకీ న్యాయ, సత్య, ధర్మాలకీ, తావు లేదనీ, దేవుడనే వాడు లేడనీ, లోకం మూఢనమ్మకాల మీదా, మోసంమీద ఆధారపడి బతుకుతున్నదనీ, వ్యంగ్యం వల్ల తెలుస్తున్నది దీన్ని పరిచయం చేస్తున్న శ్రీశ్రీగారు భవిష్యత్తులోకి తొంగి చూసి, 'యేభయ్యేళ్ల తర్వాత సమాజంలో వచ్చే ఏ మార్పుకూడా 'రాజా—మహిషి' గొప్పతనాన్ని తగ్గించ లేదంటూ (వ్యక్తిగతాభిమానంతో ఇలా చెప్పలేదని వారే గట్టిగా) దీన్ని ప్రశంసించారు.

పుస్తకాలు

అనవసరంగా విశ్వనాథ వారు మున్నగువారిని విరసించేరు.

ఇది చెప్పదగ్గ నవలే! తెలుగు దేశంలో అతి సామాన్య సంసారాలకు చెందిన వృత్తాంతాలూ, అడుగు నుంచి అత్యుత్తున్నతమైన అంతస్తు వరకూ వుండే వ్యక్తుల బలహీనత, స్వార్థపరత, మోసం, డాంబికత, అధిక్షేపణ మున్నగునవీ ఇందులో ఎంతో స్వాభావికంగా విశాఖ పట్నం ప్రాంతపు మాండలికాలతోనూ, జాతీయాలతోనూ, చమత్కార సంభాషణల తోనూ, వర్ణించ బడ్డాయి. ఎంతో అనుభవజ్ఞులుగాని ఇంత నిశితదృష్టితో వ్రాయలేరు. పోలీసులూ, లాయర్లూ, కౌన్సిలర్లూ ఛైర్మెనులూ, నాయకులూ, అధికారులు, మున్నగు వారి దురన్యాయాలు రాజమ్మ, మందుల భీముడు' రంగారావు, భీమసేనరావు, గంగరాజు, చిట్టిబాబు, సూర్యచంద్రరావు, —మున్నగు పాత్రల మూలంగా వెల్లడించబడినవి. స్త్రీ పాత్రలు స్త్రీ లోకానికి తలవంపులు తెచ్చే రీతిని చిత్రించ బడ్డవి .'కాలం మా తరఫున ఉందని విప్లవ రచయితల మైన మాకు తెలుసు.' అని శ్రీశ్రీగారు పరిచయపు తుది వాక్యం పలికేరు. కాని, యీ మొదటి భాగంలో విప్లవ చిహ్నాలు కానరావు.

రివ్యూకి ఇచ్చిన పుస్తకంలో 8 పేజీలు—(41—48) రెండుమార్లు సాగిపోతున్న కథకి మధ్య పెద్ద బ్రేకుపడి, ఆ భాగాన్ని వూహించుకోవలసి వచ్చింది. రివ్యూకి పంపే వాటినైనా చెక్‌చేసి పంపడం మంచిది. మానవుల లోపాలనూ, సామాన్య జన స్వభావాన్ని చిత్రించే నవలలో 'రాజా—మహిషి' ఎన్నదగినది.

— ఆంగీరస

రెండు కథల సంపుటాలు :

1. **మిసెస్ కైలాసం:** రచన: వాసిరెడ్డి సీతాదేవి, ప్రచురణ: స్టూడెంట్సు బుక్ సెంటర్, విజయవాడ.2 వెల: రు. 3—50.

2. **నాకు నువ్వూ నీకు నేనూ:** రచన: అవసరాల రామకృష్ణారావు, ప్రచురణ: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, వెల: రు. 4.

ఇవి రెండూ కథల సంపుటాలు. వీటిలో మొదటి సంపుటం మిసెస్‌కైలాసానికి డాక్టరు సి. నారాయణ రెడ్డి ఉపోద్ఘాతం వ్రాశారు. 'అన్నీ కథలే' అనే శీర్షికన. 'ఈ సంపుటిలో దాదాపు అన్నీ మంచి కథలే వున్నాయి: ఒక్క 'అమ్మమ్మ చెప్పినికథ' తప్ప ఇంతకూ అది కథ తేనా? కథకానికథ' అన్నారు నారాయణరెడ్డిగారు. కళ్ళ ఎదుట జరిగే సంఘటనలను మకారంగా చిత్రించగల రచయిత్రి సీతాదేవి. తమ సామాజ్యోతిర్మయం, ఇంటర్వ్యూ, సానుభూతి, అమ్మమ్మచెప్పినికథ, పశువూ మనిషీ, బతుకు ఖరీదు, మిస్టర్ ముకుందం, ఇంకా ఏం చెప్పాలి?, మా వూరు (తిరిగి)కూరిరిది, మిసెస్ కైలాసం అనే కథలున్నాయి యీ సంపుటిలో.

మనుషుల ప్రవర్తనను సమగ్రంగా అర్థంచేసుకొనగలగడమేకాక, విమర్శించే సందర్భంలో కూడా సమతా దృష్టిని చూపించగల రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. ఆమె రచనలలో విమర్శతోపాటు సానుభూతి కూడా ఉంటుంది. ఉత్తమ రచనకు ఉండవలసిన ముఖ్యలక్షణాలలో యివి ప్రధానమైనవేకదా.

వేన్నీళ్ళ సంచీ, సామాన్యుడూ సర్కారువారూ, నిజానికి నిలబడగలవా? ఎవడితోనైనాలేచిపోదామా ఎక్కడుంది లోపం? ఎర్రోడికథ, గాంధిగారిఖరీదు, ఏకపత్నీవ్రతుడు, నేనంటే నాకేనాయిష్టంలేనిది! నాకు నువ్వూ, నీకు నేనూ అనే కథలున్నవి, రెండవ సంపుటంలో. పరిచయ మవసరంలేని రచయిత శ్రీ అవసరాల రామకృష్ణారావు.

సమాజంలో జరిగే సంఘటనల నుంచి ఒక ప్రతిబింబాన్ని సృష్టించి, సంభాషణల రూపంలో కొంత జిజ్ఞాసచేసే రచయిత రామకృష్ణారావుగారు. ఉదా:

'అవును.... నాకు బోధపడింది.... మంచిని నమ్మడం, నమ్మినదాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పగలగడం, చెప్పినదాన్ని ఆచరించడం, ఇంతకన్నా స్వేచ్ఛ ఏమున్నది? ఇదికాక వేరే బతుకేమున్నది?' (51వ పుట).

'సౌజన్యతా, సహృదయతా సమీపించిన చోట బయటపడని నిజమేమున్నది? ఆత్మీయతా, ఆప్యాయతా కలుసుకున్నచోట చోటకరగని శిలఏమున్నది?' (45వ పుట).

'గాంధిగారి ఖరీదు యెంతో, అయన్ని కొనుక్కుని, వాడుకోడానికి ఏం తాకట్టు పెట్టవలసి వుంటుందో వాడిలాంటి వాళ్ళకి ఈ జన్మలో తెలిసే అవకాశంలేదు. (136వ పుట)' ఈ సంపుటిలోని కథలన్నీ చదివి ఆలోచించదగినవే అయినప్పటికీ 'ఎర్రోడికథ' 'గాంధిగారి ఖరీదు' చాలా బాగున్నవనుకుంటున్నాను.

—వి. ఎస్. అవధాని

కొన్ని సామాన్య...


(47వ పేజీ తరువాయి)

కూర, చేమకూర, పెండలం కూర, ఆలు దుంపలుకూర, బచ్చలి మొదలగు ఆకుకూరల్ని తినకూడదు. సీరుల్లిపాయల్ని, వెల్లుల్లిపాయల్ని ఈ రోగం గలవారు రోగం బాగా తగ్గేటంతవరకూ తినకూడదు. రోగం ఎక్కువగా ఉన్నప్పుడు పప్పుల్ని తినడం పూర్తిగా మానెయ్యాలి. మాంసాన్ని శీతల పదార్థాలను తినకూడదు. తాంబూలం వేసుకోకూడదు. శరీర శ్రమను కల్గించే పనులేవీ చెయ్యకూడదు. మైథునం, జాగరణ, స్నానం, ధూమపానం యివేవీ ఈ రోగం గలవారు చెయ్యకూడదు.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3. Acting Editor: S. Radhakrishna.


వెంకన్నా కోటు
బొమ్మలకథ: బాపు
5
ఏవిటే రోజా?
హాయ్ రాజీ! రిజల్ట్సు వచ్చాయే!
మా బావ కనుక్కొచ్చాడు - నీ నెంబరూ నా నెంబరూ ఇచ్చి - నేను పాసయ్యాను - నీ నెంబరు కనపడం లేదన్నాడు ఎంత వెతికినా!
రోజా వెంటనే వెళ్ళిపోయింది - ఇక రాజీ పక్కనే వున్న మంచంలో బోర్లా పడుకొని రాగాలు తీయడం మొదలెట్టింది!
అమ్మాయి పరీక్ష తప్పిందట - దాని స్నేహితురాలు చెప్పెళ్లింది
ఎవరా అన్నదీ? అమ్మాడు ఫస్టుక్లాసులో పాసయితేనూ
ఎవరే నువ్వు తప్పావన్నదీ! నువ్వు ఫస్టుక్లాసులో పాసయ్యావు! నే కనుక్కున్నాగా
కాసేపాగితే తప్పినింగు పేపరొస్తుంది - చూద్దువుగాని
(ఇంకా ఉంది)



"అవును, జానకి. నాకు తెలిసిన మంచి ఆరోగ్యవంతమైన కుటుంబాలన్నీ 'హార్లిక్స్' తాగుతాయి—అది పుష్టిని చేకూర్చు టానికి ప్రధాన సాధ

అంటారు జానకియొక్క డాక్టరు ?

'హార్లిక్స్' యొక్క విశిష్టమైన ఆహార విలువ ఆయనకు తెలుసు. 'హార్లిక్స్'లో మంచి సత్తువనియ్యగల మాంసకృత్తులు, శుద్ధమైన పూర్తి మీగడగల పాల పుష్టినిచ్చే సారము, గోధుమ, మాల్టు చేయబడిన బార్లీ వం ప్రకృతి సిద్ధమైన పదార్థములు ఇమిడి ఉండుట కారణముగా అది సర్వ శ్రేష్ట ఉదాహరణకు, 'హార్లిక్స్' పాల యొక్క పుష్టి నిచ్చే శక్తిని రెండింతలు పెంచు

జానకి తన కుటుంబములోని వారందరికీ ప్రతి రోజూ 'హార్లిక్స్' నిస్త దాని ప్రయోజనం కనిపిస్తూనే ఉంటుంది. వారు ఎంతో ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా ఉంటారు. అది 'హార్లిక్స్' పుష్టినుంచి వచ్చినది. కుటుంబము పుష్టికి సంబంధించి నంతవరకు ఎవరికీ 'హార్లిక్స్'ను మించి మరొకటి తెలియ



'హార్లిక్స్' రిజిస్టరు కావింపబడిన ట్రేడ్ మార్కు.

'హార్లిక్స్'—మంచి పుష్టికరమైనది